


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 11.03.2024 | సంపుటి : 10 సంచిక : 241 | పేజీలు : 12 వెల: రూ. 4/- | Follow :

RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## కరీంనగర్‌లో బాధితులకు

# ఇన్‌స్టంట్ న్యాయం



ప్రధాన శత్రువును తుదముట్టించాలంటే ముందుగా చుట్టూ ఉన్న కోటరీని ధ్వంసం చేయాలి. ఎన్నో అడ్డంకులను దాటి మెయిన్ విలన్ ఆత్మస్థైర్యంపై దెబ్బకొట్టాలి. అప్పుడే శత్రువును ఓడించగలరు. ఇలాంటి సన్నివేశాలు సినీ 'తెర'పై ఆవిష్కృతమవుతుంటే ప్రేక్షకుల ఈలలు, కేకలతో థియేటర్లు దద్దరిల్లిపోతుంటాయి. నిజ జీవితంలో ఆ తరహా దృశ్యాలు కనిపించకపోవచ్చుగానీ పట్టుదల, నిజాయితీగల వ్యక్తులు, అధికారుల నుంచి కొన్ని సందర్భాల్లో వాస్తవిక 'తెర' ప్రతి బింబిస్తుంది. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి కూడా చరిత్రలో నిలిచిపోయే సాహసోపేతమైన చర్యలు చేపట్టడం 'రియల్ హీరో'ను తలపించేదే..! కబ్జాకోరుల చేతుల్లో నలిగిపోతున్న పేద, మధ్య తరగతి ప్రజల గోడును విని ఎలాగైనా వారికి న్యాయం దక్కాలనే లక్ష్యంతో అన్నీతానై రంగంలోకి దిగారు. అధికారం మాటున దౌర్జన్యాలకు పాల్పడిన ఒక్కొక్కరి బాగోతాలను బట్టబయలు చేస్తూ ఇతర అధికార యంత్రాంగానికి స్ఫూర్తిగా.. ప్రజల్లో అసలైన కథా నాయకుడిగా నిలుస్తున్నాడు.

### పదేళ్ల క్రితం అన్యాయాలకు చిటికెలో పరిష్కారం
### ప్రజాకోర్టులను మరిపిస్తున్న జిల్లా పోలీస్‌బాస్
### కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు నీరా'జనం'
### చరిత్రలో నిలిచిపోనున్న అభిషేక్ మహంతి

**భూములతో పాటు అవినీతి బాగోతాలపైనా అటాకింగ్**

**ఇక మిగిలింది అనేక ఆరోపణలున్న గంగుల కమలాకరే..!?**



భూకబ్జాలకు సహకరించిన కొత్తపల్లి మాజీ ఎమ్మార్వోను అరెస్టు చేసిన దృశ్యం

స్పెషల్ కరస్పాండెంట్/హైదరాబాద్ (జనంసాక్షి)

ఎన్నికల సమయంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ మహంతి ఐపీఎస్ పట్ల కొన్ని వారాల్లోపే ప్రజల్లో భరోసా వ్యక్తమైంది. గతంలో వారానికోసారి నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రతిరోజూ కొనసాగించేలా చర్యలు తీసుకోవడం అమాయకులకు దీమాగా మారింది. మహంతి వచ్చిన కొన్ని రోజుల్లోనే కుప్పలు తెప్పలుగా ఫిర్యాదు రావడాన్ని గమనించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. రెణ్నెళ్ల కాలంలోనే 1700 వరకు వినతులు రాగా.. అందులో వెయ్యికిపైగా భూ వివాదాలు, దౌర్జన్యాలు, కబ్జాలు, ఆక్రమణలపైనే ఉన్నాయి. ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీపీ.. సీనియర్ అధికారులతో స్పెషల్ టీం వేసి విచారణ చేపట్టారు. మొదటి పదిరోజుల్లోనే భూముల మీద వినతులు వెల్లువెత్తడంతో మిగతా 2లో..

## మరో ఐదురోజుల్లో ఎన్నికల కమిషనర్ల

# నియామకం




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్నికల కమిషనర్లుగా అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయల్ అనుహ్య రాజీనామాతో కేంద్ర ఎన్నికల సంఘంలో ఏర్పడిన ఖాళీల భర్తీ మరో ఐదు రోజుల్లో జరగనుంది! ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు తెలిపాయి. మార్చి 13 లేదా 14 తేదీల్లో సెలక్షన్ కమిటీ భేటీ కావచ్చని చెప్పాయి. మార్చి 15వ తేదీలోగా నియామకాలు జరిగే అవకాశం ఉందని వెల్లడించాయి. మరో మూడేళ్ల పదవీ కాలం ఉండగానే అరుణ్ గోయల్? రాజీనామా చేయడం వల్ల వస్తున్న వార్తలపై సంబంధిత వర్గాలు స్పందించాయి. వ్యక్తిగత కారణాల వల్లే ఆయన రాజీనామా చేసి ఉండొచ్చని చెప్పాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్?, అరుణ్ గోయల్?కు మధ్య విబేధాల వల్లే రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తలను ఖండించాయి. 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన అరుణ్ గోయల్

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కిందకాంగ్రెస్ బీ ఫామ్ అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్(జనంసాక్షి):** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు హస్తం పార్టీ అభ్యర్థిగా పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి పేరును కాంగ్రెస్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పార్టీ బీ ఫామ్‌ను అందించారు. జీవన్‌రెడ్డిని భారీ మిగతా 2లో..



## భాజపా ఒత్తిడికి లొంగకనే రాజీనామా..

**అరుణ్ గోయెల్‌కు నా అభినందనలు**

**మమతా బెనర్జీ ప్రశంసలు**

**కోల్‌కతా(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న వేళ కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మిగతా 2లో..



# తెలంగాణ ఏ ఒక్క రాజకీయ పార్టీ సాధించలేదు

### విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతో రాష్ట్రం సిద్ధించింది

ఉద్యోగ,ఉపాధ్యామ కార్మిక సంఘాల సమస్యల్ని పరిష్కరిస్తాం • అందుకోసం ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం • గవర్నర్‌తో మాట్లాడి కోదండరాంను శాసన మండలికి పంపుతాం • మేం అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదు • ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం • రోజుకు 18 గంటలు పని చేస్తూ పాలనను గాడిలో పెడుతున్నాం • ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో భేటిలో సీఎం రేవంత్ రెడ్డి

**పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోండి:సీఎం రేవంత్‌రెడ్డి**

- ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాల్సిందే
- మౌళిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ స్వయం సహాయక సంఘాలకు..
- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్
- ఉన్నతాధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి

2లో

**హైదరాబాద్(జనంసాక్షి):**విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని మాజీ సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతారని మండిపడ్డారు. ఆయన కుటుంబం లో ఎవరి రక్తం చిందలేదేమో కానీ, రాష్ట్రం కోసం కానిస్టేబు ల్ కిష్టయ్య లాంటి వారు రక్తాన్ని చిందించారన్నారు. శ్రీకాం తాచారి లాంటి వారు ఉద్యమంలో మిగతా 2లో..



## అమలుకాని హామీలు ఇవ్వను

**నేను అలాంటి నేతను కాను**

**దేశాభివృద్ధి కోసమే నా ప్రయాణం: ప్రధాని మోదీ**

**లఖ్‌నవూ(జనంసాక్షి):** ఎన్నికల సమయంలో ఓటర్లను నమ్మించేందుకు గత ప్రభుత్వాలు తప్పుడు హామీలు ఇచ్చి ఆ తర్వాత కనిపించకుండా పోయేవని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మిగతా 2లో..





## బీఆర్‌ఎస్‌ను ఓడించామని ప్రజలు బాధపడుతున్నారు

**కామారెడ్డిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్**

**కామారెడ్డి(జనంసాక్షి):**మంచి ప్రభుత్వాన్ని ఓడించి తప్పు చేశామని ప్రజలు అంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెప్పారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కామారెడ్డిలోని పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు.కామారెడ్డిలో మిగతా 2లో..

## సికింద్రాబాద్ టు విశాఖ రెండో 'వందే భారత్'

రేపు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

## నెతన్యాహు తీరుతో ఇజ్రాయెల్‌కే ప్రమాదం

అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆగ్రహం

## ఇండోనేషియాలో వరదలు

21 మంది మృతి.. పలువురు గల్లంతు

## వెంటనే సంస్కరణలు చేపట్టండి

లేకుంటే మీ ఉనికినే కోల్పోతారు

భద్రతా మండలికి భారత్ హెచ్చరిక!



పై వార్తల వివరాలు 2లో

## భాజపాలోకి భారాస నేతలు

**కాషాయ తీర్థం పుచ్చుకున్న సీతారాం నాయక్, నగేశ్, శానంపూడి సైదిరెడ్డి, జలగం వెంకట్రావు**



**దిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో భారాసకు మరో ఎదురు దెబ్బ తగిలింది. సార్వత్రిక ఎన్నికల వేళ పలువురు సీనియర్ నేతలు భాజపా గూటికి చేరారు. మహబూబాబాద్, మిగతా 2లో..



## భాజపా ఒత్తిడికి లొంగకనే రాజీనామా

ఈ పరిణామంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. భాజపా ఒత్తిడికి లొంగిపోలేదంటూ గోయెల్‌పై ప్రశంసలు కురిపించిన దీదీ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాషాయదళానికి ఓటమి ఖాయమన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. వచ్చే ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు.'లోక్‌సభ ఎన్నికలు, పశ్చిమబెంగాల్‌లో కేంద్ర బలగాల మోహరింపునకు సంబంధించి దిల్లీ నేతల (భాజపా) నుంచి వచ్చిన ఒత్తిళ్లకు లొంగనందుకు అరుణ్ గోయెల్‌కు సెల్యూట్ చేస్తున్నా. ఎన్నికల పేరుతో వాళ్లు(ఎన్డీయే ప్రభుత్వం) ఏం చేయాలనుకుంటున్నారో దీంతో రుజువైంది' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేస్తున్నారని.. నిధులు మాత్రం విడుదల చేయడం లేదని విమర్శించారు.లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరి పోరుపై స్పందిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, భాజపా, సీపీఎంలకు వ్యతిరేకంగా పోటీ చేస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు. అస్సాం, మేఘాలయాల్లోనూ పోటీ చేస్తామని చెప్పారు. యూపీలో ఒకచోట పోటీపై ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్‌తో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

**బెంగాల్‌లో టీఎంసీ జాబితా..**

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీ సమర శంఖాన్ని పూరించింది. 'ఇండియా' కూటమిలో భాగమైనప్పటికీ..రాష్ట్రంలో ఒంటరిగానే బరిలోకి దిగుతున్నట్లు సీఎం మమతా బెనర్జీ తెలిపారు. మొత్తం 42 స్థానాలకుగానూ అభ్యర్థులను ప్రకటించారు. కోల్‌కతా వేదికగా ఆదివారం పార్టీ ప్రచారానికి శ్రీకారం చుట్టారు.బహరామ్‌పుర్ నుంచి మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ బరిలో దిగనున్నారు. హుగ్లీ నుంచి నటి రచనా బెనర్జీకి అవకాశం కల్పించారు. ఆమె తెలుగులో బావగారు బాగున్నారా?, కన్యాదానం, మావిడాకులు చిత్రాల్లో నటించి మెప్పించారు. అవినీతి ఆరోపణలపై పార్లమెంటు సభ్యత్వం కోల్పోయిన మహువా మొయిత్రా మరోసారి కృష్ణానగర్ నుంచి పోటీ చేయనున్నారు. ఎనిమిది మంది సిటింగ్‌లను పక్కకు తప్పించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒక స్థానం నుంచి పోటీకిగానూ సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో చర్చలు జరుపుతున్నట్లు మమతా తెలిపారు. అస్సాం, మేఘాలయాలోనూ పోటీ చేస్తామన్నారు.రాష్ట్రంపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "నేను న్యాయ వ్యవస్థను గౌరవిస్తాను. కానీ, కొంతమంది భాజపా ఏజెంట్లుగా పనిచేశారు" అని కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయపై విరుచుకుపడ్డారు. ఆయన ఇటీవల భాజపాలో చేరిన విషయం తెలిసిందే.

"పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ భాగస్వామ్యంతో గౌరవప్రదమైన స్థానాల్లో పోటీకి సీట్ల సర్దుబాటు జరగాలని కాంగ్రెస్ కోరుకుంది. ఈ విషయంలో చర్చలకు మా తలుపులు తెరచి ఉన్నాయని ఎప్పటినుంచో చెబుతూనే ఉన్నాం. సీట్లపై ఏకపక్ష ప్రకటన ఉండకూడదు. తమిళనాడు, మహారాష్ట్ర, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌ల మాదిరిగానే అందరం కలిసికట్టుగా నిర్ణయానికి రావాలి. టీఎంసీపై ఎలాంటి ఒత్తిడి ఉందో నాకు తెలియదు. మాకు సంబంధించినంతవరకు మేం బెంగాల్‌లో 'ఇండియా' కూటమిని బలోపేతం చేయాలనుకుంటున్నాం. ఏం జరుగుతుందో చూద్దాం" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు.

## బీఆర్‌ఎస్‌ను ఓడించామని ప్రజలు బాధపడుతున్నారు

గంప గోవర్ధన్ నాయకత్వంలోనే పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు."అసంబద్ధమైన హామీలు ఇచ్చి కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. ఏమైంది? చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణమాఫీ చేయాలి. 100 రోజులు అయ్యాక ఆడబిడ్డలు కాంగ్రెస్ భరతం పడతారు. మేడిగడ్డలో 85 పిల్లర్లు ఉంటే 3 పిల్లర్లు కుంగాయి. మూడు నెలల్లో ఆ పిల్లర్లను బాగు చేయలేరా?"అని కేటీఆర్ ప్రశ్నించారు.కామారెడ్డిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముందే నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. వేదిక పైకి దూసుకొచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కామారెడ్డి బీఆర్‌ఎస్ ఇంఛార్జ్ ఎవరో చెప్పాలని కేటీఆర్‌ను కోరారు. వెంటనే జై గంప గోవర్ధన్‌అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించినకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు. కేటీఆర్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. గంప గోవర్ధం నాయకత్వంలోనే పార్లమెంటు ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. మంచి ప్రభుత్వాన్ని ఓడించి తప్పు చేశామని ప్రజలు అంటున్నారని అన్నారు. అసంబద్ధమైన హామీలు ఇచ్చి కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించారని మండిపడ్డారు. గొర్రె కసాయిని నమ్మినట్లు ప్రజలు రేవంత్‌కు అధికారం ఇచ్చారని విమర్శలు చేశారు. డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు."రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి. ఇది కాలం తెచ్చిన కరవు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరవు. అబద్ధపు ప్రచారాలు, అసంబద్ధ హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మార్చి 17 వరకు వంద రోజులు నిండే దాకా ఓపికగా చూద్దాం. తర్వాత ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అందాయా అని అడుగుదాం. దమ్ముంటే ఇచ్చిన హామీలు అమలు చేసి చూపించాలనీ రేవంత్‌కు సవాల్ విసురుతున్నాను. రేవంత్ మగాడైతే పంటకు బోనస్, రుణ మాఫీ, ఆడబిడ్డలకు నగదు బదిలీ చేసి చూపాలి.'' కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వరికి రూ.500 బోనస్ వెంటనే ప్రకటించాలని కేటీఆర్ అన్నారు. 100 రోజులు అయ్యాక ఆడబిడ్డలు కాంగ్రెస్ భరతం పడతారని తెలిపారు. మేడగడ్డలో 85 పిల్లర్లు ఉంటే, 3 పిల్లర్లు కుంగాయని అన్నారు. మూడు నెలల్లో మేడిగడ్డ పిల్లర్లను బాగు చేయలేరా అంటూ సూటిగా ప్రశ్నించారు. మేం చెప్పినట్లే కాంగ్రెస్ రాగానే కరెంటు పోయిందని ఆరోపించారు. అధికారంలో లేకపోయినా బీఆర్‌ఎస్‌కు కార్యకర్తల బలం ఉందని తెలిపారు.

## వెంటనే సంస్కరణలు చేపట్టండి

**దిల్లీ(జనంసాక్షి):** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తక్షణమే సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని భారత్ సూచించింది. లేదంటే సంస్థ విస్మరణకు గురవుతుందని హెచ్చరించింది.దాదాపు 25 ఏళ్లుగా ఈ అంశంపై చర్చలు కొనసాగడంపై అసహనం వ్యక్తం చేసింది. 'మిలినియం సమ్మిట్ 2000'లోనే సంస్కరణలను ప్రతిపాదించారని ఓ సమావేశంలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ గుర్తు చేశారు.భద్రతా మండలి సంస్కరణల విషయంలో ముందు తరాలు ఇక ఏమాత్రం వేచి చూసే అవకాశం లేదని కాంబోజ్ స్పష్టం చేశారు.

## అమలుకాని హామీలు ఇవ్వను

తాను మాత్రం అటువంటి నేతను కాదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మోదీ.. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

"35 ఏళ్ల క్రితం చేసిన వాగ్దానాలను ఇప్పటికీ నెరవేర్చలేకపోయారు. గత ప్రభుత్వాల్లో కొందరు నేతలు ప్రజలను మోసం చేసేందుకు హామీలు ఇచ్చేవారు. ఫలితాల అనంతరం వారితో పాటు హామీలు కూడా కనుమరుగయ్యాయి. అలాంటి జాబితాలో నన్ను కూడా చేర్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, నేను అలాంటి నాయకుడిని కాదు. మోదీ ఎప్పుడూ భిన్నమైన వ్యక్తి" అని అభివర్ణించు కున్నారు."అభివృద్ధి కోసం 2019లో మా ప్రభుత్వం వేసిన పునాది ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేసింది కాదు. ఆ ప్రాజెక్టులను నేడు ప్రారంభించాం. నా ప్రయాణం కేవలం దేశ అభివృద్ధి కోసమే. 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చాలనే సంకల్పంతో పని చేస్తున్నా" అని మోదీ పేర్కొన్నారు. యూపీలో రూ. 34,700 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వీటిలో 16 విమానాశ్రయాలు, బహుళ అభివృద్ధి ప్రాజెక్టులున్నాయి.

## కరీంనగర్‌లో బాధితులకు
# ఇన్‌స్టంట్ న్యాయం

మరింత వేగంగా స్పందించి చర్యలు పూనుకు న్నారు. ప్రధాన పార్టీల నేతల ప్రమేయం ఉన్నట్టు పలు ఫిర్యాదుల్లో బాధితులు పేర్కొన్నప్పటికీ.. అత్యధికంగా బీఆర్‌ఎస్ నాయకుల మీదనే కంప్లెయింట్లు రావడం గమనార్హం. మొదట బీఆర్‌ఎస్ కార్పొరేటర్, సీఎం కేసీఆర్ సన్నిహితుడిని రిమాండ్‌కు పంపడంతో బాధితులు వందల సంఖ్యల్లో బయటకొచ్చారు. ఫిర్యాదులు వెలువలా రావడం, పూర్తిస్థాయి విచారణ అనంతరం ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకోవడం.. ఇప్పటివరకు మొత్తంగా 30 మందిని జైలుపాల్జేయడం సీపీ అభిషేక్ మహంతికే చెల్లింది. ఇంకా అనేక ఫిర్యాదులను కులంకూషంగా పరిశీలిస్తున్నారు. గతంలో కలెక్టర్లకు, పోలీస్ కమిషనర్లకు ఎన్ని విన్నపాలు వెళ్లినా ఫలితం లేకపోగా, ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ బాస్ పకడ్బందీ చర్యల ద్వారా దశాబ్దాల సమస్యలకు పరిష్కారం దొరుకుతోందని బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇక చివరి మజిలీ గంగులదే..?

కరీంనగర్ జిల్లాలో బడాబాబులుగా చెలామణి అయ్యే వివిధ పార్టీల నేతలు తమ బలాబలాలు చూపెడుతూ అమాయకులను ఇబ్బందుల పాల్జేయగా.. బాధితులకు ఎక్కడ మొరపెట్టుకోవాలో తెలియని అగమ్యగోచరం. కొంతమంది అధికారుల ప్రోద్బలంతోనే అక్రమ పద్ధతుల్లో కార్యకలాపాలు కొనసాగించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్‌పైనా అనేక ఆరోపణలు వచ్చాయి. ఆయన అనుచరులు చేసిన ఆగడాలకు హద్దేలేకుండా పోయింది. గంగుల కనుసైగలతోనే ఇవన్నీ జరుగుతున్నాయని కొందరు బహిరంగ విమర్శలు చేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. పలువురు కార్పొరేటర్లపైనా పదుల సంఖ్యల్లో ఫిర్యాదులొచ్చాయి. ఈ నేపథ్యంలో గంగుల అనుచరులు, కార్పొరేటర్ల భర్తలు, సన్నిహితులపై కేసులు నమోదై పలువురు జైలుపాలయ్యారు. కమలాకర్‌పై నేరుగా ఫిర్యాదులు రాకపోయినప్పటికీ రిమాండైన వ్యక్తుల నుంచి, బాధితుల నుంచి మాజీ మంత్రికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవలే వక్ఫ్ బోర్డు భూముల కబ్జా కూడా తెరపైకి రావడంతో గంగులకు అన్నివైపుల నుంచి ఉచ్చుబిగియనున్నట్టు తెలుస్తోంది.

### తహసీల్దార్ అరెస్టు కలకలం

కరీంనగర్‌లో జరిగిన భూ వ్యవహారాల్లో కొందరు అధికారుల కక్కుర్తి సామాన్య ప్రజానీకానికి న్యాయం దక్కకుండా చేయగా.. ఈ విషయాన్ని సీరియస్‌గా భావించిన సీపీ తక్షణ చర్యలకు దిగారు. తప్పుచేసిన వాళ్లకు అవకాశమే ఇవ్వకుండా ఎక్కడికక్కడ కట్టడి చేశారు. ఈ క్రమంలో కొత్తపల్లి మాజీ ఎమ్మార్వో చిల్ల శ్రీనివాస్‌ను, అతని బినామీని అరెస్టు చేయడం కలకలం రేపింది. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించినట్టు గుర్తించి దానికి సహకరించిన మొత్తం 12మందిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తప్పించుకోవాలని చూసిన సదరు అధికారిని సీపీ చాకచక్యంగా వ్యవహరించి కటకటాల పాల్జేయడం బాధితులకు ఉపశమనాన్నిచ్చింది. ఈ అరెస్టుతో ఇతర రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖలోనూ అప్రమత్తమయ్యారు.

### 'చీట్'ఫండ్ బాధితుల కోసం..

భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపిన సీపీ అభిషేక్ మహంతి, ఇతర దోపిడీ దౌర్జన్యాలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. చిట్‌ఫండ్‌లలో జరిగే మోసాలపై ఫిర్యాదులు రాగా ఓ ప్రత్యేక చట్టం ఆధారంగా బాధితులకు న్యాయం చేయొచ్చని గుర్తించారు. వెంటనే ప్రభుత్వానికి సిఫార్సు చేసి దాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇదే జరిగితే వేల మందికి న్యాయం చేకూరుతుంది. అయితే, ఓ చిట్‌ఫండ్ కంపెనీ పేరిట కోట్ల రూపాయల ఆస్తులున్నప్పటికీ.. ప్రజలతో డబ్బులు కట్టించుకుని పనికిరాని భూములను వారికి అంటగట్టేందుకు సదరు కంపెనీ యత్నిస్తోంది. ఈ విషయం సీపీ దృష్టికిరాగా, బాధితులకు సరైన న్యాయం జరగాలనే చర్యల్లో భాగంగా దాన్ని సీజ్ చేయబోతున్నారు. ఆయన గుర్తించిన చట్టం అమలైతే కంపెనీ ఆస్తులమ్మి ప్రజలకు సెటిల్ చేయాల్సి ఉంటుంది. సీపీ చర్యలకు జంకిన మరో చిటఫండ్ కంపెనీ యాజమాన్యం మాత్రం ఆస్తులమ్మి తమ ఖాతాదారులందరికీ సెటిల్మెంట్ చేస్తుండటం గమనార్హం.



## మరో ఐదురోజుల్లో ఎన్నికల కమిషనర్ల నియామకం

2022 నవంబర్‌లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.అయితే కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన కమిషనర్‌తో పాటు మరో ఇద్దరు కమిషనర్లు ఉంటారు. ఫిబ్రవరి 14వ తేదీన అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. ఇప్పుడు అరుణ్ గోయల్ అనూహ్యంగా రాజీనామా చేయగా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ మాత్రమే మిగిలారు. సెలక్షన్ కమిటీ రెండు రోజుల క్రితం సమావేశం కావాల్సి ఉండగా, వాయిదా పడింది. మరి కొత్త ఎన్నికల కమిషనర్ల నియామకం ఎలా జరుగుతుందంటే దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం గతేడాది ద చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ అపాయింట్?మెంట్ యాక్ట్-2023 చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం తొలుత కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు కేంద్ర కార్యదర్శులతో కూడిన సెర్చ్ కమిటీ రెండు కమిషనర్ల పోస్టుల కోసం ఐదుగురి పేర్లను సెలక్షన్ కమిటీకి పంపాలి.సెలక్షన్ కమిటీకి ప్రధాన మంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. లోక్‌సభలో విపక్ష నేత, ఓ కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. సెలెక్షన్ కమిటీకి కొన్ని విచక్షణాధికారాలుంటాయి. సెర్చ్ కమిటీ పరిగణనలోకి తీసుకున్న పేర్లను సైతం అవసరమనుకుంటే సెలక్షన్ కమిటీ పరిశీలించవచ్చు. కమిటీ పంపే పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తారు. సీఈసీ, కమిషనర్లు ఆరేళ్లపాటు లేదా 65 ఏళ్ల వయసు వరకు పదవిలో ఉంటారు. అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి గతేడాది వరకు కేంద్ర ప్రభుత్వం సిఫార్సుల మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలు జరిగేవి. కేంద్ర సిఫార్సుల మేరకే రాష్ట్రపతి నియమించేవారు. రాజ్యాంగంలోని 324- 329 అధికరణలు కేంద్ర ఎన్నికల సంఘం సభ్యుల నియామకం, జీతభత్యాలు, కాలపరిమితి, విధులను తెలియజేస్తున్నాయి.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి

మెజార్టీతో గెలిపించుకోవాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను రేవంత్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆయన పేర్కొన్నారు.అనేక మంది ప్రజాప్రతినిధులు చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే పార్టీలకు అతీతంగా వారు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి వివరించారు. తనకు బీ ఫామ్ అందజేసిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో తాను ఘనవిజయం సాధిస్తామనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆయన కోరారు. సోమవారం ఉదయం 11:00 గంటలకు జిల్లా కేంద్రంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఇటీవలే మన్నె జీవన్‌రెడ్డి హస్తం పార్టీలో చేరారు. ఆయన బాబాయి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం భారత్ రాష్ట్ర సమితి నుంచి మహబూబ్‌నగర్ ఎంపీగా కొనసాగుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం గురుకుంట గ్రామం జీవన్‌రెడ్డి స్వస్థలం. ఆయన ఎంఎస్ఎన్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.ప్పటికే బీఆర్‌ఎస్ తమపార్టీ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఖరారు కావడంతో ఈ స్థానానికి పోటీ అనివార్యమైంది. ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నామినేషన్లు సమర్పించడానికి ఈనెల 11 ఆఖరి రోజు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం ఒక్కరోజే నామినేషన్లకు అవకాశం ఉంది. 12న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణకు గడువు ఉంది.

## భాజపాలోకి భారాస నేతలు

ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సీతారాం నాయక్, గోడం నగేశ్, హుజూర్‌నగర్, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, జలగం వెంకట్రావు..దిల్లీలో తరుణ్‌చుగ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇండోనేషియాలో భారీ వరదలు..

**- 21 మంది మృతి**

**జకార్త (జనంసాక్షి):**ఇండోనేషియాలోని పశ్చిమ సుమత్ర ప్రాంతంలో ఇటీవల భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. వరదలతో పాటు చాలా చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాదాపు 70,000 మంది నిరాశ్రయులయ్యారు. 21 మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఆ దేశాధికారులు ఆదివారం వెల్లడించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు .గురువారం నుంచి పడాంగ్ సహా మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో దాదాపు 200 ఇళ్లు నేల మట్టమయ్యాయి. పలు చోట్ల వంతెనలు, రోడ్లు దెబ్బతిన్నాయి. కొండ చరియలు కూలడంతో చాలా మార్గాలు మూసుకుపోయాయి. మెరుపు వరదలతో సుతేరా ఉప జిల్లాలో 200 కుటుంబాలున్న గ్రామానికి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. వరద నీరు తగ్గినా.. కొండచరియలు పడటంతో సహాయ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు.దాదాపు 150 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఆహారం, ఔషధాలు, మంచినీరు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం పడాంగ్ ప్రాంతం మొత్తం ఇంకా నీటిలోనే ఉంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇండోనేషియాలో వర్షాకాలం జనవరిలో మొదలవుతుంది.

## నెతన్యాహు తీరుతో ఇజ్రాయెల్‌కే ప్రమాదం

**విల్మింగ్టన్(జనంసాక్షి):** హమాస్‌పై పోరు విషయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అనుసరిస్తున్న తీరుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.బెంజమిన్ వైఖరి ఆయన సొంత దేశాన్నే గాయపరుస్తోందని శనివారం వ్యాఖ్యానించారు. గాజాలో పౌరుల మరణాల విషయంలో ఇజ్రాయెల్ నిబంధనలకు కట్టుబడటం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇది చాలా పెద్ద పొరపాటని పేర్కొన్నారు.దాదాపు 1.3 మిలియన్ల మంది పాలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్న రఫా ప్రాంతాన్నీ ఇజ్రాయెల్ ఆక్రమించే అవకాశం ఉందన్న వార్తలపై బైడెన్ (ఏనీవ ఃతిటవని) కీలక వ్యాఖ్యలు చేశారు. నెతన్యాహు అనుసరిస్తున్న కఠిన వైఖరికి దాన్ని హద్దుగా భావిస్తున్నామని తెలిపారు. అది మీరితే చర్యలు ఉంటాయని పరోక్షంగా సంకేతాలిచ్చారు. అయితే.. ఇజ్రాయెల్ ఎంత హద్దు మీరినా ఆ దేశానికి అమెరికా మద్దతు కొనసాగుతుందని చెప్పడం గమనార్హం. ఆ దేశ రక్షణ, అక్కడి పౌరుల భద్రత చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కొన్ని రకాల ఆయుధాలను అందించటం, ఐరన్ డోమ్ వ్యవస్థకు మద్దతివ్వటం వంటి విషయాల్లో రాజీ ఉండదని స్పష్టం చేశారు.తన అభిప్రాయాన్ని నేరుగా ఇజ్రాయెల్ (ఎబతీజీవశ్రీ) వెళ్లి అక్కడి పార్లమెంటుకే తెలియజేయాలనుకుంటున్నానని బైడెన్ వెల్లడించారు. అయితే, ఆ పర్యటన ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని మాత్రం స్పష్టంగా తెలియజేయలేదు. రంజాన్ మాసం ప్రారంభానికి ముందే ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని బైడెన్ ఆశిస్తున్నారు. కానీ, ఆ దిశగా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. ఇరు పక్షాల మధ్య సయోధ్యకు అగ్రరాజ్యం సహా ఈజిప్టు, ఖతర్ ప్రయత్నిస్తున్నాయి.

# తెలంగాణ ఏ ఒక్క రాజకీయ పార్టీ సాధించలేదు

అమరులయ్యారని అన్నా రు. తెలంగాణ బాపు అని కేసీఆర్ తనకు తానే చెప్పుకుం టున్నా రని, అలా చెప్పుకోవడానికి కనీసం పోలికైనా ఉండాల ని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాపు సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, ఆయనను గౌరవించకపోతే సమాజం మన ల్ని క్షమించదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.. పదేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం రాలేదని, వారి ఆవేదన వినేవారు లేక ఇబ్బందులు పడ్డారని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో పొందుపరిచిందని చెప్పారు వాటిని పరిష్కరించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి వివరించారు. ఇన్నాళ్లు సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది, అధికారంలో ఉన్నది కేసీఆర్ కుటుంబమేనని రేవంత్‌రెడ్డి విమర్శించారు. నిర్బంధా లతో పాలన సాగిస్తామని అనుకోవడం వారి భ్రమని మండిపడ్డారు. ఎంసీహెచ్‌ఆర్డీలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంలతో పాటు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచి తంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ పాఠ శాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియ మిస్తాం. ఉద్యో గుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మంత్రివర్గ ఉపసం ఘం శాఖల వారీగా సమావేశం నిర్వ హించి నిర్ణయాలు తీసుకుంటుంది. సంఘాలతో చర్చిం చకుండా నిర్ణయాలు తీసుకోమని' రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో మాట్లాడి ప్రొఫెసర్ కోదండరాంను శాసనమండలికి పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే మండలికి గౌరవంగా ఉంటుందని అన్నారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు విశ్వాసం కల్పించడానికే ఈ సమా వేశం నిర్వహించామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.' 'ఇప్పటికే మీ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యోగుల తరపున ప్రాతినిధ్యం ఉండాలి. తెలంగాణను ఏ ఒక్క రాజకీయ పార్టీ తామే సాధించామని చెప్పుకున్నా అది అసంబద్ధం. మూడు నెలల్లో 30,000ల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఒక్కో చిక్కుముడిని పరిష్కరిస్తూ ఉద్యోగాల భర్తీని ముందుకు తీసుకెళ్లాం. 11,000ల పైచిలుకు ఉద్యోగాలతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశాం. రోజుకు 18 గంటలు పని చేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని రేవంత్‌రెడ్డి వివరించారు. తమ సర్కార్ మూడు నెలలు ఉంటుందని ఆరు నెలలు ఉంటుందని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే తమాషా అనుకుంటున్నారా అని ప్రశ్నించారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోండి : సీఎం రేవంత్

**ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాల్సిందే • మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ స్వయం సహాయక సంఘాలకు**

**ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ • ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలుండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీహెచ్‌ఆర్డీలో ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. విద్యార్థులకు యూనిఫామ్ తో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దీని ద్వారా స్కూల్స్ పైన నిరంతర పర్యవేక్షణ ఉండటంతో పాటు మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి రాష్ట్రంలో అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రీన్ ఛానెల్ ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆఫీ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాల మెరుగుపరిచేందుకు సహకారం తీసుకోవాలన్నారు.



రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి సెలవులు ముగిసేలోగా పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. విద్యావేత్తలు, మేధావులతో చర్చించాలని ఆయన సూచించారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్ పై పూర్తిస్థాయిలో దృష్టిసారించాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టం తీసుకు వచ్చే యోచనపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ టు విశాఖ రెండో 'వందే భారత్'..

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రముఖ నగరాలను కలుపుతూ మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలెక్కేందుకు ముహూర్తం ఖరారైంది. సికింద్రాబాద్- విశాఖ పట్నం మధ్య రెండో వందేభారత్ రైలు (నం.20707/20708) మార్చి 12న ప్రారంభం కానుంది. ఈ రైలును ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ రైలు గురువారం మినహా మిగతా రోజుల్లో సర్వీసులందించనుంది. రెగ్యులర్ సర్వీసులు మార్చి 13 నుంచి ప్రారంభం కానున్నాయి. బుకింగ్‌లు మార్చి 12 నుంచి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. సికింద్రాబాద్- విశాఖపట్నం వందే భారత్ రైలు (20707) ఉదయం 5.05గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.50గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మళ్లీ అదే రోజు విశాఖపట్నంలో మధ్యాహ్నం 2.35 గంటలకు బయల్దేరిన (20708) రాత్రి 11.20 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనుంది. 530 మంది ప్రయాణికుల సామర్థ్యంతో నడిచే ఈ రైలులో ఏడు ఛైర్‌కార్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ కోచ్ ఉన్నాయి. విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20833/20834)ను 2023 జనవరి 15న సంక్రాంతి రోజు పట్టాలెక్కిన విషయం తెలిసిందే. ఈ రైలుకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ ఉండటం, వంద శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. రిజర్వేషన్ దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయి. రానుపోను ఒక్కటే రైలు ఉండటంతో సాంకేతికంగానూ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో మరో రైలు ఏర్పాటుతో ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. తొలి రైలు 16 బోగీలతో నడుస్తుండగా.. కొత్త రైలు ఎనిమిది బోగీలతో పట్టాలెక్కనుంది.

# నేడు సీఎం చేతుల మీదుగా
# ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం

- అన్ని గ్యారెంటీలను అమలు చేస్తాం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క
- రూ.280.85కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మంత్రులు



**వరంగల్ బ్యూరో, మార్చి 10 (జనంసాక్షి) :** నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టనున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తెలిపారు. రూ.280.85 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలతో కలసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వరంగల్‌లోని ఎస్ఎస్ఎం క్లబ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు రూ 4.10 కోట్లతో పుప్పాలగుట్టలో నిర్మించిన 1500 కిలో లీటర్ల ఎలివేటెడ్ లెవెల్ సర్ఫేస్ రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్)ను, రూ 20 లక్షలతో ఏర్పాటు చేసిన ఫాతిమానగర్ జంక్షన్‌ను మంత్రులు ప్రారంభించారు. రూ.272.12 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అందులో రూ.2 కోట్లతో ఖాజీపేట, కృసి ఆఫీస్ (జిడబ్ల్యుఎంసి), వడ్డేపల్లి, వెంకట్రామా నాయుడు పెట్రోల్ పంప్, టిటిడి జంక్షన్ల వద్ద అభివృద్ధి, సుందరీకరణ పనులు, రూ.2 కోట్ల వ్యయంతో బాలసముద్రం చిల్డ్రన్ పార్కు అభివృద్ధి పనులకు, 15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే ఎంజిఎం పీడియాట్రిక్ బ్లాక్‌లో పిల్లలకు ఆట పరికరాల ఏర్పాటుకు, రూ 2 కోట్లతోఎస్ ఎన్ఎం క్లబ్, సికెఎం డివైడర్, బాలాజీనగర్ జంక్షన్ల పరిధిలోని పలు జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులకు, రూ. 3.50 కోట్ల వ్యయంతో గోవిందరాజుల గుట్ట వద్ద ఎలివేటెడ్ లెవెల్ సర్ఫేస్ రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్) నిర్మాణ పనులకు, రూ.250 కోట్లతో జిడబ్ల్యుఎంసి పరిధిలో వరద నీటి ముంపు నివారణకు అభివృద్ధి పనులకు, రూ.50 లక్షలతో వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్‌లోని 34వ డివిజన్ లోని మెట్ల బావి అభివృద్ధికి, రూ.10 కోట్ల వ్యయంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, అవెన్యూ ప్లాంటేషన్ పనులకు, రూ 6.60 కోట్లతో నర్సంపేట మరియు ఖమ్మం రోడ్డులో, కరీంనగర్, ములుగు భారీ ముఖ ద్వార నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీ హామీల్లో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను ప్రభుత్వం వారి చెంతకు చేర్చిందని, ప్రజల మనసుల్లో కోరికగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సోమవారం ఆవిష్కరిస్తారని, ప్రభుత్వం 72 రోజుల్లో 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని, టిఎస్‌పిఎస్‌సిని ప్రక్షాళన చేసి నిబద్ధత గల సిబ్బందిని నియమించి యుద్ధ ప్రాతిపదికన నోటిఫికేషన్లు ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే సుమారు 11,600 ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చామని, ఉద్యోగస్తులకు ఒకటో తారీకు నుండి మూడో తారీకు లోగా జీతాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వచ్చే 3 సంవత్సరాలలో వరంగల్ నగరంలో పచ్చదనం పెంపొందించి హరితనగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ఇందులో వరంగల్ ప్రజలు కూడా భాగస్వాములై వారి కాలనీలలో మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగరంలోని అన్ని లేఅవుట్ ఖాళీ ప్రదేశాలను అందమైన వివిధ రకాల థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, దీనికి తోడుగా నగరంలో అన్నీ జంక్షన్లను అభివృద్ధి చేసి సుందరీకరించడం జరుగుతున్నదని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నగరానికి సుమారు రూ. 260 కోట్ల నిధులను అందజేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని, హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసే దిశలో ముందుకు సాగుతుందని, అధికారంలోకి వచ్చిన 75 రోజులలోనే కోట్లాది రూపాయలు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేస్తూ పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని, ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచితబస్సు సౌకర్యాన్ని కల్పించడం ద్వారా సుమారు 5 నుండి 6 వేల రూపాయలు ఆదా చేస్తున్నామని, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు అందజేసే ప్రక్రియలో భాగంగా జీరో బిల్లుల వల్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించి తమ అందరి ముందు ఉంచుతున్నారని, ప్రస్తుతం సంక్షేమ ఫలాలు మహిళలకు అందజేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని సీతక్క అన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు మహిళా శిశు సీనియర్ సిటిజన్స్ శాఖ ఆధ్వర్యంలో రూ. 19 లక్షల విలువగల 12 ద్విచక్ర వాహనాలు (మోటరైజ్డ్ వాహనాలు), 5 బ్యాటరీ వీల్ చైర్లను మంత్రుల చేతుల మీదుగా దివ్యాంగ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు మురళీనాయక్, కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, తూర్పాటి సులోచన సారయ్య, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, గుండు చందన పూర్ణ చందర్, గుండేటి నరేందర్, పస్కుల బాబు, ముష్కమల్ల అరుణ సుధాకర్, కావేటి కవిత, పోశాల పద్మ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి,ఆర్ డి ఓ కృష్ణవేణి, జిడబ్ల్యుఎంసిఎస్ ఈ లు కృషా రావు,ప్రవీణ్ చంద్ర సిఎంహెచ్ఓ డా.రాజేష్‌తోపాటు రెవెన్యూ పోలీస్ జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం

- ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎల్చల దత్తాత్రేయ

**ఓయూ, మార్చి 10 (జనంసాక్షి) :** గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం చేయనున్నట్లు ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ శనివారం పేర్కొన్నారు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర 9 వేల ఉద్యోగాలకు 1:2 మెరిట్ ప్రకారం ఎంపికైనట్లు తెలిపారు. అయితే ఇందులో కేవలం 5 వేల మందికి ఉద్యోగాల నియామక పత్రాలు అందజేశారని మిగిలిన 4 వేల ఉద్యోగాలను పక్కన పెట్టారని వివరించారు. మిగిలిన 4 వేల ఉద్యోగాలను కూడా మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అభ్యర్థులకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు పెద్ద ఉద్యోగంలో చేరగా మిగతావి ఖాళీగా ఉంటున్నాయని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గురుకుల నియామకాల విధానంలో లోపాలు ఉన్నందున ఉద్యోగాలకు ఎంపికైన నాలుగు వేల మందికి అన్యాయం జరుగుతుందని ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు. గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు న్యాయం జరిగేందుకు కోర్టును ఆశ్రయించనున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

## మహిళల విద్యకు దారిదీపం సావిత్రి బాయి పూలే

- ఆచార్య కూరపాటి వెంకటనారాయణ, రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ చైర్మన్



**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** మహాత్మ జ్యోతిరావు పూలే మార్గదర్శనంలో సావిత్రీ బాయి చేపట్టిన కార్యక్రమాలు ఈనాటికీ ఆచరణీయమేనని రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ కొనియాడారు. పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 127 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ ముందుగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యను అందిచేందుకు ఎన్నో అవమానాలు, కష్టాలు విమర్శలు దాడులు ఎదుర్కోని ఉక్కు సంకల్పం తో తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన ధీశాలి సావిత్రిబాయి పూలే అన్నారు. పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో వివక్షత రూపు మాపి అందరికీ విద్య అందిన రోజు మనం ఆమెకి ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వడ్డే రవీందర్, ఆచార్య ఎం.సారంగపాణి, డాక్టర్ గజ్జల మల్లేశం, డాక్టర్ ఎం సదాలక్ష్మి, డాక్టర్ దేవోజి నాయక్ ,కుమార్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## హిర ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో
## గ్రామీణ ప్రాంత ఇమామ్‌లకు దుస్తులు పంపిణీ



**కరీంనగర్, మార్చి 10 (జనంసాక్షి) :** మరో రెండు రోజుల్లో ప్రారంభమవుతున్న పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హిర ఫౌండేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మస్జిద్లలో పనిచేస్తున్న ఇమామ్ లకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. నగరంలోని 18వ డివిజన్ షేఖాన్‌నగర్‌లోని రేకుర్తి మదర్సా అరేబియా హిఫ్జుల్ ఖురాన్‌లో హిర ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది గ్రామీణ ప్రాంతాల్లోని మస్జిద్ లలో పని చేస్తున్న ఇమామ్ లు, మత గురువులకు వారి కుటుంబ సభ్యులకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కొత్త బట్టలను అందించారు. ఈసందర్భంగా ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు గత 15 సంవత్సరాలుగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింలను చేరదీసి హిర ఫౌండేషన్ కరీం నగర్ ద్వారా ఇస్లామిక్ ఆధ్యాత్మిక సేవలను నిరంతరాయంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హిర ఫౌండేషన్ ద్వారా పవిత్ర రంజాన్ మాసంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపవాస దీక్షల వెసులుబాటు కల్పించేందుకు బియ్యం వంట సామాగ్రి దుస్తులు సైతం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో హాఫిజ్ అబ్దుల్ రజాఖ్ ఫైజి, హాఫిజ్ షేఖ్ అహ్మద్ హిఫ్జి, మౌలాన బిలాల్, హాఫిజ్ ఇమ్రాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి దృష్టిపై స్టెరాయిడ్ ప్రేరిత గ్లాకోమా ప్రభావంపై అవగాహన

- అవేర్‌నెస్ వాక్ ను ప్రారంభించిన సినీ నటి నిహారిక కొణిదెల



**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** కంటి దృష్టిపై స్టెరాయిడ్ ప్రేరిత గ్లాకోమా ప్రభావాన్ని వివరించేందుకు తలపెట్టిన గ్లాకోమా అవేర్‌నెస్ వాక్ ను బంజారాహిల్స్ లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ దగ్గర సినీ నటి నిహారిక కొణిదెల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లాకోమాపై ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు, వైద్య నిపుణులు చేస్తున్న కృషిని అభినందించారు. కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ దీక్షిత్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ గ్లాకోమా వీక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్టెరాయిడ్ నిశ్శబ్దంగా కంటి దృష్టిపై ప్రభావం చూపుతుందన్నారు. గ్లాకోమా అనేది కంటి పీడనం పెరగడంతో కలిగే కంటి సమస్య అన్నారు. ఇది ఆప్టిక్ నరాలు దెబ్బతినడం ద్వారా అంధత్వానికి దారితీస్తుందన్నారు. దృష్టిని నష్టపోవడానికి అత్యంత సాధారణ కారణమన్నారు. 2040 నాటికి గ్లాకోమాతో బాధపడుతున్న రోగుల సంఖ్య 76 మిలియన్ల నుంచి 111.8 మిలియన్లకు పెరుగుతుందని అంచనాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది స్టెరాయిడ్ ప్రేరిత గ్లాకోమాపై దృష్టి పెట్టిందన్నారు. ఉబ్బసం, కీళ్లనొప్పులు, కంటి అలెర్జీలు తదితర వాపు సంబంధిత పరిస్థితులకు చికిత్స చేయడానికి స్టెరాయిడ్లు ఉపయోగిస్తారన్నారు. ఇవి అధికంగ అయినప్పుడు కంటి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. స్టెరాయిడ్లు కంటి శుక్లాలకు కారణమవుతాయని తెలిపారు. దీనిని కంటి శుక్లం శస్త్రచికిత్సతో చికిత్స చేయవచ్చన్నారు. కంటి లోపల ఒత్తిడిని పెంచడం ద్వారా కూడా గ్లాకోమాకు కారణమవుతాయని తెలిపారు. 4 నుండి 6 వారాల పాటు పరిమిత అధ్యయనంలో గ్లాకోమా లేని ఐదు శాతం మంది కంటి లోపల ఒత్తిడిని పెంచారన్నారు. ఇది గ్లాకోమాకు కారణమవుతుందన్నారు. ఏ రూపంలోనైనా స్టెరాయిడ్లు ఉపయోగిస్తే తప్పనిసరిగా సమగ్ర కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఎవరైనా స్టెరాయిడ్స్ కారణంగా గ్లాకోమాను అభివృద్ధి చేస్తే వైద్యులు గ్లాకోమాకు అవసరమైన చికిత్సతో పాటు స్టెరాయిడ్స్ స్థానంలో ప్రత్యామ్నాయ మందులను సూచించాలని తెలిపారు. ప్రిస్క్రిప్షన్‌లో స్టెరాయిడ్లు ఉన్నాయా? అని వైద్యులను తప్పక అడగాలన్నారు. మందులు జాగ్రత్తగా వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వాడాలన్నారు. కంటి చుక్కలు, ఇన్‌హేలర్‌లు, ఆయింట్‌మెంట్లు, మాత్రలు వంటి సూచించిన స్టెరాయిడ్‌లను తీసుకునే వ్యక్తులు వారి కళ్ళను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని తెలిపారు.

## జేవీవీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం





**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమావేశంలో అలివేలు మంగ పాల్గొన్నారు. సైన్స్ పార్క్ ది స్కూల్ ఆఫ్ సైన్స్, అత్తాపూర్ లో జరిగిన ఈ సమావేశానికి కులనిర్మూలన సంఘం గౌరవ అధ్యక్షురాలు గుత్తా జ్యోత్స్న గారు అధ్యక్షత వహించగా జై భారత్ ప్రధాన కార్యదర్శి రజని, కులనిర్మూలన సంఘం సలహాదారులు లక్ష్మీ నాగేశ్వర్, ఉపాధ్యక్షులు జ్యోతి యదుల్ల, స్వరాజ్య లక్ష్మి ప్రసంగించారు. టివి రావు, వాణి దంపతులు భోజనం ఏర్పాటు చేశారు. మహిళలంతా వివిధ ఆటలతో సరదాగా గడిపారు. విజేతలకు టివి రావు బహుమతులు అందజేశారు. వాసవిశ్రీ నిలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అలివేలు మంగ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆ రోజుల్లో మహిళా అభివృద్ధికి హక్కుల కోసం పోరాడి, విద్యావేత్తగా సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా గుర్తు చేసుకుంటూ ఆదర్శవంతంగా అమ్మ దగ్గర నుండి అన్ని రంగాలలో, మనం ఏం కోల్పోతున్నామని, మహిళలను కించపరచకుండా, సమాజంలో మన బిడ్డలను కూడా చిన్నప్పటి నుంచి, ప్రతి స్త్రీని గౌరవించే విధంగా మన కుటుంబాల నుండి, మన ఇంట్లో మగ పిల్లలను స్త్రీని గౌరవించే విధంగా పెంచాల్సిన బాధ్యత మన మీద 100% ఉందని తెలిపారు.

## చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో
## మహిళా దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) :** అంబర్‌పేటలోని న్యూ దుర్గానగర్‌లో చైతన్య మహిళా సంఘం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సిటీ కో కన్వీనర్ శ్రీదేవి ఆహ్వానం పలికారు. కన్వీనర్ సత్య అధ్యక్షత వహించారు. బస్తీ మహిళలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యురాలు, రిటైర్డ్ టీచర్ గిరిజ మాట్లాడుతూ ఎన్నికలకు వచ్చే అభ్యర్థులను తమ సమస్యల కొరకు నిలదీసి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయురాలు జయ మాట్లాడుతూ ప్రభుత్వం, పెట్టుబడిదారులు మహిళా దినాన్ని ఏ విధంగా తమ ప్రయోజనాలకు వాడుకుంటుందన్న విషయాన్ని వివరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వనమాల ఐక్యంగా ఉండి, మహిళలు స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలనీ పిలుపునిచ్చారు. ఎన్నో సంవత్సరాల నుండి బస్తీ వాళ్లకు ఇళ్లస్థలాల పట్టాల్లేవని, పట్టాల కోసం పట్టాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ ఎన్నికైన ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ కమిటీ సభ్యురాలు విజయ, బస్తి మహిళలు కవిత, బాలమణి, పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులను ఖండిస్తున్నాం




- వరంగల్ లో మంత్రుల సాక్షిగా జర్నలిస్టులను
- దూషిస్తూ నెట్టేసిన డిసిపి బారి
- కార్యక్రమంలో ఆందోళన చేసిన జర్నలిస్టులు
- ఆందోళనలకు జర్నలిస్ట్ సంఘాల పిలుపు

**వరంగల్ ప్రతినిధి, మార్చి 10 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలో మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండాసురేఖల కార్యక్రమంలో జర్నలిస్టులకు తీవ్ర అవమానం జరిగింది. కార్యక్రమ కవరేజికి వెళ్లిన జర్నలిస్టులను వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి బారీ బూతులు తిడుతూ నెట్టేశారు. తాము కవరేజికి వచ్చామని చెప్పినా వినకుండా బారీ స్వయంగా జర్నలిస్టులపై దాడికి దిగడాన్ని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. మంత్రుల సాక్షిగా జరిగిన ఈ ఘటనపై వారు స్పందించకపోగా మంత్రి కొండా సురేఖ జర్నలిస్టులు సంయమనం పాటించాలంటూ చెప్పడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపించింది. గతంలో కూడా డిసిపి బారి జర్నలిస్టులపట్ల అవమానకరంగా వ్యవహరించడం, తనకు రాజకీయంగా సపోర్ట్ ఉందని తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ చెప్పుకుంటున్నారు. విధినిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల విధులకు భంగం కలిగిస్తే ఎలాంటి చట్టాలు వర్తిస్తాయో అవే చట్టాలు విధుల్లో ఉన్న జర్నలిస్టులకు కూడా వర్తింపచేయాలని ఐజెయు వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామ్ చందర్, మట్టాదుర్గాప్రసాద్, ఐజెయు నేషనల్ కౌన్సిల్ సభ్యులు మిద్దెల రంగనాథ్, సంగోజు రవిలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల విషయంలో చాలా హుందాగా వ్యవహరిస్తుండగా కొందరు మంత్రులు మాత్రం చాలా అవమానకరంగా వ్యవహరిస్తూ పోలీసులు, పార్టీ కార్యకర్తలతో జర్నలిస్టులపై దాడులకు ఉసిగొల్పడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సోమవారం లోగా మంత్రి కొండా సురేఖ స్వయంగా పూనుకుని డిసిపి బారీపై చర్యలు తీసుకోవాలని.. లేని పక్షాన తమ ఆందోళనలు రాష్ట్రవ్యాప్తం చేసి.. జరిగిన ఘటనను సిఎం దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై జర్నలిస్ట్ సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి సోమవారం వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝూను కలిసి మెమొరాండం ఇచ్చే కార్యక్రమానికి హాజరవాలని వారు కోరారు.

# బంగారంలాంటి భూమి కబ్జా

- ఏడీ సర్వే అంటూ బుకాయింపు?
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమా!
- భూకబ్జాలపై ఆర్డీవో స్పందించాలని డిమాండ్





**ఆర్మూర్, మార్చి 10 (జనంసాక్షి):** ఓ బంగారు వ్యాపారి తాను కోల్పోయిన భూమిని వదులుకోలేక బంగారం సాక్షిగా బంగారం లాంటి భూమిని కబ్జాకు పాల్పడుతున్నాడు. రెవెన్యూ అధికారులు సైతం భూకబ్జాపై నానా హంగామా చేసి ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో జాతీయ రహదారి హైవేపై నష్టపరిహారం పొందిన లబ్ధిదారు ఆ భూమి తమదేనంటూ కంచే వేసి భూ కబ్జాకు శ్రీకారం చుట్టారు.

మామిడిపల్లి శివారులోని జాతీయ రహదారి 44 ఆనుకొని ఉన్న సర్వే నంబర్లు 196, 197, 199లో భూమి ఉంది. జాతీయ రహదారి భూ విస్తరణలో భాగంగా జాతీయ రహదారి అధికారులు అప్పటి భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందజేశారు. జాతీయ రహదారికి సంబంధించిన భూమి పోగా మిగిలిన కాస్త భూమి వారి ఆధీనంలోనే ఉంది. ఆ బంగారు వ్యాపారి జాతీయ రహదారి అధికారుల సంబంధించిన భూమిపై ఫ్రీ కాస్ట్ వేసి కబ్జాకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదికను సంబంధిత అధికారులకు పంపిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. రెవెన్యూ అధికారులు ఏడి సర్వే చేయిస్తామని చెబుతూ బుకాయిస్తున్నారు. రెవెన్యూ అధికారుల సర్వేలో కబ్జాకు గురైన భూమి జాతీయ రహదారుల సంబంధించినదేనని తెలిసిన చర్యలు మాత్రం శూన్యంగా కనబడు తున్నాయి. ఏడి సర్వే అంటూ బుకాయిస్తూ ఆ బంగారు వ్యాపారి ఫైల్ ను సంబంధిత అధికారులు ముందుకు సాగనివ్వడం లేదు. బంగారు వ్యాపారి వేసిన ఫ్రీ కాస్ట్ ను తొలగించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమా, జాతీయ రహదారుల అధికారుల నిర్లక్ష్యమా అర్థం కాకుండా పోయింది. ఇట్టి భూ కబ్జాలో ఆర్డీఓ ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ భూములను కాపాడాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 మార్చి 2024

## 'బెంగ'ఊరు కరువును అడుగు..

# హైదరాబాద్‌లో కారును కడుగు..

*స్నానానికి బదులు తడి గుడ్డతో వొంటిని తుడుచుకోండి. కంచాలు వాడకుండా పేపర్ ప్లేట్లలో భోజనాలు కానిచ్చేయండి. ఆంక్షలు ఉల్లంఘిస్తే రూ. 5 వేలు పెనాల్టీ. అయినా పాటించకుంటే రోజుకు ఐదొందలు జరిమానా. కోరలు చాచిన కరువుతో కాలనీ, అపార్ట్మెంట్ సంఘాల స్వీయ నిబంధనలు. 'మా ఇంటి ముందరి చేతి పంపు కూడా వట్టి పోయింది' సాక్షాత్తూ డెప్యూటీ సీఎం, దక్షిణాది కాంగ్రెస్ కడక్ లీడర్ డీకే శివకుమార్ ఆవేదన.*




బెంగుళూరు దుర్భిక్ష ఛాయలు మనలనూ చలింపజేస్తున్నాయి. ఆ కాటకాలు మన దాకా వస్తే..? అనే ఊహకే హైరానా పడుతున్నాం. ఒకరినొకరం డిస్కస్ చేస్తూ వాపోతున్నాం. కానీ, నీటి పొదుపు మనసా వాచా కర్మణా మనలో పాటిస్తున్నది ఎందరం? 10 లక్షలకు తక్కువ కాకుండా నివాసాలతో మన రాష్ట్ర రాజధానికి కోటి జనాభా బలగం. కారు లేని ఇళ్ళు తక్కువ. ఫోర్ వీలర్ లేని విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్లయితే అసలే ఉండవు. వెలకట్టలేని నీటి వృథా జ్ఞానమంతుల నగరంలో పొంగి పారుతుంది. నౌకర్లు, ఓనర్లు నీటి పైపు అందుకొని కార్లు, రోడ్డే అయిన వాకిళ్ళు తెగ కడిగేస్తుంటారు. తడి బట్టతో తుడిస్తే తళుక్కుమంటాయి. కానీ కడగాలి, కడిగి తీరాలి. పైపు వేసి వాటర్ కొట్టాలి. అదో సోషల్ స్టేటస్. అట్లా ఎన్ని నీళ్ళు వేస్టు చేస్తుంటారో ఓ లెక్కా పత్రం అసలే ఉండదు. పద్ధతి ప్రకారం చాలినన్ని నీళ్ళతో ఎంచక్కా వాష్ చేసి ఇచ్చే స్టేషన్లకు పోతే పైసలవుతయనే పిసినారి గుణం ఉండనే ఉంటుంది. సూర్యోదయంతోనే నిత్యం 6 నుంచి 9 గంటల్లోపు అనేక చోట్ల ఇళ్ల ముందు ఈ యజ్ఞం కాని యజ్ఞం రివాజు. మా నీళ్లు మా ఇష్టం..మా కరెంటు మా ఇష్టం..బిల్లులు కడతాం కదా అంటారు గాక. కానీ, సమాజంతో ముడిపడిన అంశం ఇది. ఒక్కరు చేసే చె(కీ)డు పది మందినీ ప్రభావితం చేస్తుంది. పైగా బీటీ రోడ్లపై తడి వల్ల తారు చెదిరి, రోడ్లు పాడవుతాయి. అధికార పక్షానికి, ప్రతి పక్షానికి పడనంత, పాలి వాళ్లకు గిట్టనంత డాంబరుకు, నీటికి పొసగదు. ప్రధాన రహదారులు దాటి, గల్లీలు సందులు, కాలనీల తొవ్వల్లో నిత్యకృత్యమీ దృశ్యాలు. బెంగుళూరు బాధలు చూసి బాధపడడమే కాదు, ఆ ఇక్కట్లు మనకు తగలకుండా మనకు మనమే స్వీయ జాగ్రత్తలు పాటించాలి. అందమైన మన హైదరాబాద్ షహర్ లో మన ప్రవర్తన అంతే బ్యూటీగా ఉండాలి. గొప్పనైన సిటీలో మన గొప్ప గుణం ఉట్టిపడాలి.

### గొంతు తడిపే నీరు మన దాకా ఊరకే రాదు

హైదరాబాద్ కు మూడు దిక్కుల నుంచి నీళ్లు వస్తాయి. ఒక్కో దిక్కులో గరిష్టంగా 200 కిలోమీటర్లు ట్రావెల్ చేస్తాయి. గోదావరి, కృష్ణా, మంజీరా జలాలు శుద్ధి ప్రక్రియ మీదట మన ఇళ్ళకు, ఆపై మన గొంతును హాయిగా తడుపుతాయి. గ్రేటర్ లో 185 చిన్న చిన్న పంపింగ్ స్టేషన్ల వ్యవస్థతో 22 డివిజన్లలో నిరంతర నిర్వహణ జరుగుతుంది. 8 లక్షలు నివాస, 2.18 లక్షల కమర్షియల్ కలిపి 10.18 లక్షల కనెక్షన్లు జలమండలి నెట్వర్క్ లో ఉన్నాయి. జీహెచ్ఎంసీ బయట కూడా 2 లక్షల పైనే కనెక్షన్లతో హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లయ్ ఐండ్ సివరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ బి) నగర మంచినీటి అవసరాలను సంభాలిస్తుంది. కృష్ణా బేసిన్ లో చివరి సీజన్ లో కావాల్సినంత ఇన్ ఫ్లో లేదు. నాగార్జున సాగర్ డ్యాం జల మట్టం చూడబోతే ఈ వేసవికి డౌట్ కొడుతోంది. ముఖ్యంగా మే నెలలో పరీక్ష కాబోతుంది. సాగర్ లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా హైదరాబాద్ కు నీరందించడం సులువు. మూడు ఫేజులలో రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల నీటి సమీకరణకు దీని డిజైన్. 140 కి.మీ. దూరాన ఉంటుంది. 505 ఫీట్ల లెవెల్ వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల అవసరాల వినియోగానికి వీలుంది. సాగర్ కు సాధారణంగా జూలై/ఆగస్టుల్లో వరదలు మొదలవుతాయి. అప్పటిదాకా వెళ్ళదీయాలి. సాగర్ లో అత్యవసర మోటార్లు పెట్టి నీటిని రాజధానికి చేర్చాల్సిన తిప్పలు మున్ముందు తప్పవనేవి అనధికార అంచనాలు. జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ తొలినాళ్ళలో హైదరాబాద్ వనరులు. అవి సహా మంజీరా, (సింగూరు) కృష్ణా, గోదావరి జలాలు మన సిటీ సోర్స్. ఏకంగా 190 కిలోమీటర్ల దూరం నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గోదావరి నీరు మన గొంతులను తడిగా ఉంచుతుంది. 172 ఎంజీడీల పరిమాణంలో లక్షిత డిజైన్ తో అందుబాటులోకి తెచ్చారు. మహా నగరానికి మామూలు రోజుల్లో దినం 540 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్స్ పర్ డే)ల నీరు అవసరం. వేసవిలో అదనంగా 20 ఎంజీడీల పైనే కావాలి.

దుర్గాప్రసాద్ ఇల్లెందుల
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
హైదరాబాద్
9440850384

# సామాన్యుని రైలు బండి ఎక్కడ?



రైలు బండి కూడ మరీ పిరం అయిపోయింది. అందుకే డబ్బున్నోడు ప్రయాణించే రైళ్లకు ప్రోత్సాహం లభిస్తున్నది. ఇది కార్పొరేట్ లకు మాత్రమే లాభం చేసే ప్రభుత్వం అయ్యింది! దేశంలో సామాన్యుల రైలు బండి రోజు రోజుకు అభివృద్ధి చెందే బదులు మాయం అయిపోతున్నది. పాసెంజర్ రైళ్ళ నెంబర్ కు ముందు సున్నా ఒకటి యాడ్ చేసి ఎక్స్ ప్రెస్ ట్రైన్ గా పేరు మార్చారు. సౌకర్యాలు ఏవి మారలేదు. బోగీలు పెరుగలేదు. అయితే రైలు కిరాయి మాత్రం పెంచేసారు. ఉదాహరణకు మురళి గంజ్ నుంచి పూర్ణిమ స్టేషన్ దాకా కిరాయి 15 రూపాయలు ఉంటే 35 రూపాయలు చేశారు. తిరుపతి నుంచి చెన్నై కి 35 రూపాయలుంటే 70 రూపాయలు చేశారు. స్టేషన్‌లలో గంటల తరబడి లేట్‌గా నడిచే ఈ సామాన్యుని రైలు సౌకర్యం లో ఎలాంటి మార్పు లేదు. పాసెంజర్ రైళ్ల నుంచి 2022- 23 లో 6,345 కోట్ల రూపాయలు రెవిన్యూ రైల్వే కు వచ్చింది. గత ఏడాది తో పోల్చితే ఇది 80 శాతం ఎక్కువ ఉంది. అయినా సామాన్యుని రైలు సంఖ్యను పెంచలేదు. నిజానికి చిన్నచిన్న కలలు కనేవారు అంటే మన పీఎం మోడీకి ఇష్టం లేదు, అనిపిస్తుంది. అందుకే పెద్ద పెద్ద స్వప్నాలు కంటూ, అమలు చేస్తుంటారు. చత్తీస్‌ఘడ్ లాంటి రాష్ట్రాల్లో సామాన్యుల రైళ్లు రద్దు చేసేసారు. సామాన్యునికి అందుబాటులో లేని వందే భారత్ రైలు లను మాత్రం ప్రారంభిస్తూనే ఉన్నారు. ఉదాహరణకు గతంలో స్పీడుగా నడిచే రైలు కు ఢిల్లీ నుంచి కాన్పూర్ కు 300 రూపాయలు ఛార్జ్ ఉంటే ఇప్పుడు వందే భారత్‌కు 1,115 రూపాయలు ఛార్జ్ ఉన్నది. ఇప్పుడు 19,000 కోట్లు ఖర్చు చేసి దేశం లోని లక్నో లోని గోమ్టి నగర్ తదితర స్టేషన్ లను అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పేరిట ఆధునీకరిస్తున్నారు. మొత్తం 19,000 కోట్ల రూపాయలతో 573 స్టేషన్స్ ను ఇప్పుడు ఆదునీకరించే ప్రక్రియ ప్రారంభం అయ్యింది.ఇదే నేపథ్యంలో రైల్వే లో సామాన్యుడి ప్రయాణం దూరం అవుతున్నది. ఈ అమృత్ భారత్ రైల్వే స్టేషన్స్‌లో కుటుంబంతో సహా భోజనం చేసే సౌకర్యం, పిల్లలకు ఎంటర్టైన్మెంట్ లు ఉంటాయి. ఒక రకంగా చెప్పాలంటే పెద్ద, పెద్ద మాల్స్ లో ఉండే అన్ని సౌకర్యాలు ఉంటాయి అన్నమాట!కాస్తోకూస్తో చిన్న చిన్న పనులు చేసుకుని బతుకు బండి లాగుతున్న వేలాది మంది ఇప్పుడు స్టేషన్ల నుంచి బయట కు పంపే పరిస్థితి ఉంటుంది, అంటే అతిశయోక్తి కాదు!

### ప్రకటించిన ఉద్యోగాలు ఏవి?

2017 అక్టోబర్ లో పియుష్ గోయల్ మంత్రి గా ఉన్నపుడు రైల్వే లో ఈకో సిస్టమ్ ద్వారా 10 లక్షల ఉద్యోగాలు వస్తాయని అన్నారు.ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాల పేరిట అధికారంలోకి వచ్చిన పీఎం మోడీ ఆయన పది ఏండ్ల హయాంలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కనీసం ఈ పది ఏండ్లలో కోటి ఉద్యోగాలు కూడ ఇవ్వలేక పోయారు. రైల్వే స్టేషన్ లో ఛాయ్ అమ్మినాను, అని చెప్పుకునే పీఎం అవే స్టేషన్ లలో సామాన్యుల బతుకు కోసం ఏమి చేయలేదు. రైల్వే లో 3 లక్షల 12 వేల ఖాళీలు ఉన్నాయని 2023 లో చెప్పిన ప్రభుత్వం, ఎంతమందిని నియమించారని ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు జవాబుగా 2024, జనవరి 30 న ఒక లక్ష 49 వేల మందిని భర్తీ చేశామని పేర్కొన్నారు. వికృిత్ భారత్ అంటే,ఆత్మిత్ భారత్ అంటే ఇదేనేమో!

### బుల్లెట్ ట్రైన్ ఎక్కడ?

దేశంలో 2014 నుంచి హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ గురించి చెబుతున్న పీఎం మోడీ,2022 లో లక్ష్యం ప్రకారం రావాల్సి ఉన్నది. అయితే ఆ ట్రైన్ దేశంలో 2028 నాటికి రావచ్చు, అని ఇప్పుడు అంటున్నారు.లక్ష కోట్ల వ్యయం అంటున్నారు. ఆరు ఏండ్ల ఆలస్యం వల్ల దీని ఖర్చు 60 వేల కోట్లు పెరిగింది, అని కూడ అంటున్నారు. యూపీ లో లోకో పైలెట్, ఆర్ఓ,ఏఆర్ఓ లాంటి ఉద్యోగాల భర్తీ పేపర్ లీక్ మీద లక్ష లాది మంది నిరుద్యోగులు ఆందోళనలు చేశారు. ప్రయాగ్ రాజ్, లక్నో లలో ఈ ఆందోళనలు జరిగాయి. వీటి మీద పీఎం ఒక్క మాట మాట్లాడరు!

### పేదల రైళ్లు ఏవి?

పది ఏండ్ల పీఎం మోడీ కాలంలో పేదల కోసం ఎన్ని రైళ్లు వేసారో తెలియదు! అయితే రైలు ప్రయాణంలో వారి గోస మాత్రం తీర లేదు!గరీబు రత్, జన్ శతాబ్ది ట్రైన్స్ ఎన్ని వేశారు? అభివృద్ధి పేరిట స్టేషన్ ల ఆధునీకరణ, వందే భారత్ ట్రైన్ల జెండాలను ఊపడం, ఎవరి కోసం? సామాన్యుని ఓట్లు కావాలి, కాని వారి కష్టాలు అవసరం లేదు!రైల్వే స్టేషన్ లలో గంటల, రోజుల తరబడి ముల్లె, మూటలతో, నిరంతరం ఆలస్యంగా నడిచే రైళ్ళ కోసం వెయిట్ చేసే కూలీలు, వలస కార్మికులు, సామాన్య జనం ప్రభుత్వం కు కనిపించరు. వారి రైళ్ల లో సౌకర్యాలు ఏవి పెరగలేదు.ఎక్ స్ప్రెస్ గా పేరు మార్చి కిరాయి డబుల్ చేసి సామాన్యుడిని దోచుకోవడం చేస్తున్నారు. సామాన్యుడి జీవితం కూడ పాసెంజర్ ట్రైన్ లా మారింది!దేశంలో 80 కోట్ల పేదల పరిస్థితి పట్టదు!అవే రైళ్లు కిటికీల నుంచి, గేట్ల నుంచి లోనికి వెళుతు, వేలాలాడుతూ, బోగి మీద టాప్ లో ఎక్కి కూర్చుని ప్రయాణం చేసే వాళ్ళు పాలకులకు ఎప్పుడు కనిపిస్తారో? వారి ఘోష ఎప్పుడు వినిపిస్తుందో?అయితే తాజాగా ఎక్స్ప్రెస్ రైళ్లు గా మార్చిన పాసెంజర్ రైళ్ల చార్జీలు తగ్గించి, చాలా పెద్ద మెహెర్బానీ చేసిన పోజు ఒకటి! ఇదీ ఒక ఎన్నికల స్టంటే అనక తప్పదు!నిజానికి సామాన్యునికి న్యాయం చేసిన దాఖలా పీఎం మోడీ ప్రభుత్వం లో లేదు!ఎయిర్ పోర్టుల, పోర్టుల మాదిరే రైల్వే ను కూడ అమ్మే దిశన ఆయన వెళ్లిన విషయం మనం చూస్తున్నదే! కార్పొరేట్ లకు లాభం చేసే పనులు తప్ప, సామాన్యులు వారికి కనిపిస్తారు!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

## ఇస్త్రీ బట్టల విలువ

అబద్దాలకి కొట్టిన చప్పట్లు నిజాలకి కొట్టరు.
ఎందుకంటే ఆ భయంకరమైన నిజం లో
వాళ్ళు పాములు కాబట్టి..
అయినా "నిజం" చప్పట్లు కోరుకోదు...
నన్ను అబద్ధంగ మార్చద్దని వేడుకుంటది....
మనం ఒకరిని పొగడాలంటే లక్షల మెట్లు
దిగి రావాలి....
కోట్ల సంపదను దాటి రావాలి...
వేసుకున్న ఇస్త్రీ బట్టలకి విలువ పోతుందని
భయం....
వావి వరసలు చిన్నా పెద్దని అన్ని
లెక్కలేసుకుంటం....
అవసరమైతే మనసుతో కాసేపు యుద్ధమే
చేస్తాం.....
ఎందుకంటే మనం ఉప్పు కారం మానేసి
ఈర్ష ద్వేషాలు తింటున్నాం కదా......
అందుకే మనవాళ్ళకి సహాయం చేయడం
మానేసి..
మన పెండ్లి రోజున అనాధ ఆశ్రమంలో
మందికి బట్టలు పంచి పెడుతున్నాం....
వెతికితే దొరకరా నీ ఖాన్దాన్ లో లేనోల్లు...
పెళ్ళిళ్ళకి పిలుచుకోడానికి..
చావులకి పాడె మోయడానికేన ఈ
బంధాలా...?
సహాయాలు చేసుకోవడానికి పనికి రావా..?
కిలో మీటర్ల దూరం వెళ్లి దానం చేయడం
కాదు...
తొంగి చూస్తే నీ ఇంట్లోనే దొరుకుతారు
పేదోల్లు....
నీ చుట్టు పక్కలనే నిలబడి ఉన్నారు..!!
బయట వాళ్ళకి సాయం చేస్తేనే పుణ్యం
అనుకోవడం నీ వెర్రితనం...
మన చదువు సంపదను ఇవ్వగలుగుతుందే
కానీ...
సంస్కారాన్ని ఇవ్వలేకపోతుంది...
అందరు ఎవరికి వాళ్ళు మంచివాళ్లే...
ఇంతకీ తప్పెవరు చేస్తున్నట్లు...
ఇది సమాధానం దొరకని ప్రశ్న..
వెళ్లి రోజు నువ్వు చూసుకునే అద్దాన్ని
అడుగు నీ తల మీద ఉన్న వెంట్రుకల కంటే
ఇంకో రెండు ఎక్కువే చేశావ్ తప్పులు...!!
అవి కప్పి పెట్టుకోడానికి మనం పడే తిప్పలే
ఈ జీవితం....



తుమ్మల కల్పన రెడ్డి
9640462142

# పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ- సామాన్యుల ఇబ్బందులు!

*2019లో కోవిడ్ ప్రపంచ మహమ్మారిగా పరిణమించిన వేళ ఏ దేశాన్ని కూడా వదలకుండా తన దుష్ప్రభావాన్ని చూపి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను చిన్నా బిన్నం చేసిన విషయం అందరికీ తెలిసినదే. 2020 నాటికి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలు పేదరికంలోకి జారుకున్నారని, పేదరికం మరింత పెరిగింది. ప్రపంచంలో కేవలం భారతదేశంలోనేనని గణాంకాలు చెబుతుంటే పెట్టుబడిదారుల ఆదాయాలు మాత్రం రెట్టింపు కావడాన్ని ప్రభుత్వాలు ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉంది.*



కోవిడ్ సందర్భంలో లాక్ డౌన్ల కారణంగా, వ్యాపారాలు మార్కెట్లు దారి తప్పి, ఉపాధి అవకాశాలను సామాన్య జనం కోల్పోయి, వ్యాపారాలతో పాటు చిన్నాచితక జనం జీవితాలు అగాధములోకి నెట్టి వేయబడ్డాయి. దేశ జనాభాలో 15 శాతానికి పైగా దారిద్ర రేఖ దిగువ న జీవిస్తున్నట్లు ఇటీవల నీతి అయోగ్ ప్రకటిస్తే సుమారు 15 కోట్లకు పైగా వలస కార్మికులు ఇబ్బందులకు గురైనట్లు ఎంతోమంది ప్రయాణంలో మార్గమధ్యంలోనే చనిపోయిన విషయం మనందరికీ తెలుసు. ఆ త దనంతర కాలంలో కూడా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై ధరలు రోజురోజుకు పెరిగిపోతుంటే పేదరికం మరీ పెరిగిపోయి ఆకలి మంటలు సామాన్య ప్రజానీకాన్ని దహిస్తుంటే ఆ మంటల్లో చిన్నారులు ముఖ్యంగా మహిళలు సుమారు 20 కోట్ల మంది రక్తహీనత పోషకలేమితో బాధపడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కోవిడ్ కారణంగా ప్రభుత్వ పథకాలు అయినటువంటి సమగ్ర శిశు అభివృద్ధి సేవలు ,పోషకాహార పంపిణీ వంటి కార్యక్రమాలు కూడా నామమాత్రం కాగా పాఠశాలలు మూతపడడంతో బాలలకు ఆమాత్రమైన మధ్యాహ్న భోజనము ద్వారా లభించే ఆహారం అందక అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందవలసిన పోషకాహారం మొక్కుబడి అయిన విషయం తెలిసిందే.

విలువైన మానవ వనరులలో బాలలు పోషకాహార లోపంతో అనారోగ్యానికి గురికావడం కొత్త విషయాలను ఆసక్తిగా నేర్చుకునే ఉత్సాహం లేకపోవడంతో అన్ని రంగాలలో వెనుకబడినట్లు నిపుణులు తెలియజేస్తుంటే ఆ లోటును భర్తీ చేసుకోవడానికి ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం గుర్తించకపోతే ఎలా!మరింత లోతుగా పరిశీలిస్తే కరోనా సమయములో కనీసం రెండు మూడు సంవత్సరాల పాటు పాఠశాలలు నా మ మాత్రం కావడంతో అప్పటి బాలలకు విద్య అందకుండా పోవడంతో పాటు బాలలు పరస్పరం కలుసుకునే అవకాశం లేకపోవడంతో ఎదుగుదల కూడా క్షీణించినట్లు తెలుస్తున్నది. 2013 ఆహార భద్రత చట్టం మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఆహార భద్రతను కల్పించడంలో కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ నిధుల కొరత, చిత్తశుద్ధి లేమి వంటి కారణాల వలన కేవలం నామమాత్రంగానే మిగిలిపోగా పోషకాహార సరఫరా మాత్రం ఎండమావి గాని మిగిలిపోయింది. కోవిడ్ సందర్భంలో వైద్య నిపుణులు పేద ప్రజలను కోవిడ్ వంటి భయంకర రుగ్మతల నుండి భవిష్యత్తులో కూడా రక్షించేది కేవలం పోషకాహారమేనని చెప్పినప్పటికీ కేంద్రం ఇప్పటికీ కేవలం బియ్యం గోధుమలను మాత్రమే పేద వర్గాలకు ఉచితంగా అందిస్తూ ఇదే పోషకాహారమని ప్రకటనలు చేస్తే నమ్మేది ఎవరు? ప్రపంచంలోనే భారత ఆర్థిక వ్యవస్థ గుర్తింపు స్థాయిలోకి వస్తుందని, అతిపెద్ద 5వ ఆర్థిక వ్యవస్థగా ఏర్పడబోతుందని కేంద్రం ప్రకటన చేస్తూ 2025 నాటికి 5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని ఆరాటపడుతున్నట్లు నటించినప్పటికీ పోషకాహారం పేద ప్రజల పాలిట కడుపు నింపినప్పుడు మాత్రమే ఈ మాటలకు అర్థం ఉంటుంది. ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో కేవలం ఉచిత బియ్యాన్ని సరఫరా చేస్తూ 2028 వరకు ఉచితంగా సరఫరా చేస్తామని కేంద్రం ప్రకటించడమంటే అసలే పోషక విలువలు లేని బియ్యం రసాయనిక ఎ రువులు పురుగు మందుల వాడకం ద్వారా ఉత్పత్తి అయినటువంటివి ఏ రకంగానూ ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడని గుర్తించడం అవసరం . కరోనా దాటికి భారతదేశంలో ఆహార వ్యవస్థ తో పాటు ఆర్థిక వ్యవస్థ కూడా సంక్షోభంలోకి వెళ్లిన సందర్భంలో పిల్లలు ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందినటువంటి మహిళలు పురుషుల ఆరోగ్యం పట్ల కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఉత్పత్తిలో క్రియాశీలక పాత్ర పోషించే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినటువంటి పేద కుటుంబాల వాళ్ళ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

ఎదగని ,ఆరోగ్యంగా లేని మానసిక దౌర్బల్యము కలిగినటువంటి మానవజాతి ఏ రకంగానూ దేశ భవిష్యత్తుకు తోడ్పడదు" అనే సామాజిక చింతన ప్రభుత్వాలకు ఉన్నప్పుడు మాత్రమే ఆశయం నెరవేరుతుంది. పెట్టుబడుదారి వర్గానికి చెందినటువంటి వారి రుణాలను 14 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం మాఫీ చేసిందంటే ఏ వర్గ ప్రయోజనం కోసం పనిచేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు . ఇక విదేశాల్లో దాగి ఉన్నటువంటి నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి అకౌంట్లో 15 లక్షల రూపాయలను వేస్తానని ప్రధాని 2014లో ఇచ్చిన మాట ఇప్పటికీ అమలు కాలేదు అంటే ఈ పేద ప్రజల జీవితాల గురించి ఆలోచించే తీరిక ఉందా అనే అనుమానం కలగక మానదు. అయినప్పటికీ ఎన్నికల్లో గెలవాలని అధికారం చలాయించాలని ఆరాటపడుతున్నటువంటి అన్ని రాజకీయ పార్టీలు కూడా పేద ప్రజల పోషకాహారం, పేదరిక నిర్మూలన, ఉపాధి హామీ, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాల పైన తమ మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించడం ద్వారా చిత్తశుద్ధిని చాటుకోవాలి. ఆచరణలో చూపకుండా గంటల కొద్ది ప్రసంగాలు చేసే నాయకులు ఈ దేశానికి అవసరం లేదు . ఇటీవల ప్రధానమంత్రి 25 కోట్ల మందిని పేదరికం నుండి విముక్తి చేసినట్లు ప్రకటించినప్పటికీ ఇంకా దారిద్ర రేఖ దిగువన ఉన్న వాళ్ళ సంఖ్య గణనీయంగానే ఉండడంతో పాటు మౌలిక సౌకర్యాలు లేని పేదలు ఇంకెంతకాలం అనాధలుగా జీవించాలో ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది.

మానవతా విలువల రీత్యా ఆలోచించినా, ఆధ్యాత్మిక వాదంలో ఈ దేశంలో కుక్క కూడా ఆకలితో అల్లాడకూడదని వివేకానందుడు నొక్కి చెప్పినా, తమ అవసరాలకు మించి సంపాదించడం అక్రమమేనని గాంధీ వక్కానించినా, అనే సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరణ రాజ్యాంగ ద్రోహం అని భారత రాజ్యాంగంలోని పీఠిక ఆదేశిక సూత్రాలు గంటా పతంగా చెబుతున్నా , అసమానతలు అంతరాలు దోపిడీ లేనటువంటి సమ సమాజం అంతిమ లక్ష్యం అని మార్క్సిజం మన కర్తవ్యాన్ని ఉద్బోధించినా ఆ వైపుగా కనీసమైన చర్యలు లేకపోవడం ప్రజలు కూడా ఆలోచించకపోవడం అనాదిగా జరుగుతున్న దురాచారం. "భూమి నాది అనిన భూమి పక్కున నవ్వు" అన్న పద్య పాదాన్ని రచయిత ఏ సందర్భంగా వక్కాణించాడో కానీ ఈ ప్రకృతి మీద ఆధిపత్యాన్ని చలాయించడానికి అవకాశం లేదు అని చెప్పే ప్రయత్నమే ఈ పద్య భాగంలోని సారాంశం. ఒక భూభాగంలో ఉన్నటువంటి ప్రజలందరూ సమానంగా బ్రతకవలసినది పోయి ప్రతిభ పేరుతో, మోసకారితనం, దగా కోరుతనం, అవకాశం, విద్యపేరుతో, వారసత్వం, కలిసి వచ్చిన అవకాశం వంటి అనేక కారణాలను చూపి ఈ వ్యవస్థలో అంతరాలను పెంచే కుట్ర అనాదిగా కొనసాగుతున్నది. అదే క్రమంలో సంపన్న వర్గాలు సంపాదన స్వార్థపూరితమని, అక్రమమని ,ఇతరులను దోపిడీ చేస్తే వచ్చిందని ఏ కోశానా కూడా అంగీకరించకపోగా నిజాయితీగా సంపాదించినదని కష్టపడి పోగు చేసుకున్నామని నమ్మబలికే ప్రయత్నం చేయడం సమానత్వ సిద్ధాంతానికి గండి కొట్టడమే . ఈ ప్రకృతి పైన దేశంలోని ప్రజలందరికీ సమాన అవకాశాలు ఉండాలి ఇది సహజ న్యాయం. దానికి భిన్నంగా కలిసి వచ్చిన అనేక అవకాశాల రీత్యా తరాల వరకు సరిపోయే సంపదను కొన్ని వర్గాలు కూడబెడితే ఏ పూటకు ఆ పూట తినడానికి కూడా ఇబ్బంది పడుతూ యాచకులుగా వలస కార్మికులుగా దారిద్రరేఖ దిగువన జీవిస్తున్న వారు మరొక్క వైపు స్పష్టంగా కనబడుతుంటే,ఏ క్షణాన కూడా మనకు మనలను ప్రశ్నించుకోకపోవడం, నా జీవన విధానం నియమ బద్ధమా? అని సమీక్షించుకోకపోవడం ఆర్థిక అరాచకత్వమే అవుతుంది.ప్రధానంగా లబ్ధి పైననే దృష్టి ,జీవితం ఒకటే అని తెలిసి ఆ జీవన యానంలో ప్రపంచం తోనే పోటీ పడాలనే కాంక్షతో సంపాదించడానికి దూసుకు వెళ్లే ప్రయత్నం చేయడం ఇవాళ రివాజుగా మారింది .న్యాయబద్ధంగా వస్తున్న ఆదాయంతో పొదుపు చర్యలు కుటుంబ సభ్యుల ఉమ్మడి ఆదాయం ద్వారా సంపద పోగుపడితే కొంతవరకు అంగీకరించవచ్చు .అయినప్పటికీ స్వార్థ చింతనే తప్ప పక్క వాళ్ళ మేలు కోరే తత్వం లేకపోతే మాత్రం సహించే ప్రసక్తి లేదు. అలాంటి కుటుంబాలు లేదా వర్గాలకు కష్టాలు కన్నీళ్లు వచ్చిన సందర్భంలో సహకరించడానికి ఎవరు ముందుకు రారు అని తెలుసుకుంటే మంచిది. అంటే అంతిమంగా మనిషిని కాపాడుకోవడం, తోటి మనిషిని సాటిగా సాటి మనిషిగా చూడడం, కష్టాలు కన్నీళ్లలో తోడుగా అండగా ఉండడం అనే మానవతా విలువలను పాటించని ఏ సందర్భం అయినా సమాజానికి చేసే విద్రోహం గానే భావించవలసి ఉంటుంది . భారతదేశంలో 10% గా ఉన్న సంపన్న వర్గాల వద్ద 80 శాతం సంపద పోగుపడి ఉంటే 80% గా ఉన్నటువంటి మెజార్టీ ప్రజల దగ్గర 20 శాతం మాత్రమే సంపద అందుబాటులో ఉన్నదంటే ఏ రకంగా అంతరాలు అసమానతలు ఆర్థిక రంగంలో కొనసాగుతున్నాయో మనం అర్థం చేసుకోవచ్చు . ఆర్థిక పరిభాషలో కఠినమైన విషయమే కావచ్చు కానీ సామాన్య పద్ధతిలో ఆలోచించినప్పుడు పక్కవాడికి మన వాడికి ఉన్నటువంటి వ్యత్యాసం ఏమిటి? లేనివాడు చేసిన ద్రోహం నేరం ఏమిటి? ఎందు కొరకు ఆకలితో అలమటించి పేదరికంలో మగ్గి శిక్ష అనుభవిస్తున్నారు? అని విజ్ఞులుగా ఎప్పుడైనా ఆలోచించినామా? ఆ రకమైన చర్చ ఎందుకు చేయకూడదు? ఎందుకు మనకు మనమే చర్చించుకోకూడదు? అనేది ఇవాళ ప్రధానమైన విషయం. భారత రాజ్యాంగంలోని పీఠికలో కానీ ఆదేశిక సూత్రాలలో కానీ సంపద కొద్ది మంది చేతుల్లో ఏ కోశాన కూడా పోగుపడి ఉండడానికి వీలులేదు అని స్పష్టంగా చెబుతుంటే న్యాయబద్ధంగాను చట్టబద్ధంగాను సమానత్వం కోసం ఎన్ని అవకాశాలు ఉన్నా ఆ వైపుగా ప్రభుత్వ చర్యలు ఎందుకు లేవు? అని బుద్ధి జీవులు మేధావులు విద్యావంతులు త ర్కించుకోకపోతే ఇక దేశంలో సామాన్యుల సంగతి ఏమిటి ? సమ సమాజ స్థాపన కోసం, ఆర్థిక అంతరాలను నిర్మూలించడం కోసం, సమానత్వాన్ని సాధించటం కోసం అనేక ప్రజా ఉద్యమాలు సందర్భోచితంగా ప్రజలను చైతన్యవంతం చేసి పాలకుల కళ్ళు తె రిపించినప్పటికీ తిరిగి సంపద ఉన్న చోటుకే చేరడం అనేది ఆందోళన కలిగిస్తున్న విషయం. ప్రతి విషయానికి " అయితే నాకేమిటి"? "వారితో సంబంధం ఏమిటి? ". "ఎవరెక్కడ పోతే ఏమిటి" అనే దుర్మార్గమైనటువంటి నిర్లక్ష్య భావన ప్రజల్లో పేరుకు పోవడం కూడా కొంతమంది అతి పేదవాళ్లుగా మారడానికి సంపద కొద్దిమందిలో ఎక్కువ కనబడడానికి కారణం అవుతున్నది. పక్క వాడితో నాకేమిటి అని అనుకుంటున్నాం. కానీ ఈ సృష్టిలో చెట్లు, గుట్టలు, నదులు, సముద్రాలు, ఆకాశము, నిప్పు, జంతుజాలం ,క్రిమి కీటకాలు, పశుపక్షాదులు మనలాగే అనుకుంటే మానవ మనుగడ సాధ్యమయ్యేదా? ఏ ప్రయోజనాన్ని ఆశించి చెట్లు కాయలు, పండ్లు నీడనిస్తున్నాయి. పశుపక్షాదులు మానవ మనుగడకు ఎన్నో రకాలుగా తోడ్పడుతూ మనిషి మనుగడకు ఆధారభూతమవుతుంటే ఈ విషయాలను మనిషి ఎందుకు ప్రస్తావించుకోవడం లేదు ? ఇదంతా స్వార్థంతో కూడుకున్న నాటకం అంటే అతిశయోక్తి కాదు. అహంకార0 దుఃఖానికి కారణమని అక్రమ సంపాదన ద్వారా అంతిమంగా అశాంతియే మిగులుతుందని అనేక అనుభవాలు తెలియజేస్తుంటే అక్రమ సంపాదన పరులు ఉద్యోగులు, వ్యాపారులు పెట్టుబడిదారులు చట్టం నుండి తమ పలుకుబడిని ఉపయోగించి రక్షించుకోవచ్చు. కానీ ప్రజా ఉద్యమాలు తీవ్రమైన రోజున , చట్టాన్ని నిజాయితీగా అమలు చేసే పాలకులు రంగ ప్రవేశం చేసిన రోజున,

మరెన్ని కారణాల రీత్యా కచ్చితంగా అక్రమార్కులు కటకటాల్లోకి వెళ్ళక తప్పదు .ఎంతోమంది అధికారులు అక్రమ సంపాదన లంచాల రూపంలో పెంచుకుంటే అవినీతి నిరోధక శాఖ అధికారుల వేటలో అనూహ్యమైన

సందర్భాలను చూడవలసి వస్తున్నది. ఇక రాజకీయ రంగంలోకి వచ్చిన వారంతా సేవ కోసమే వస్తున్నామని చెప్పినప్పటికీ సామాన్య కార్యకర్త నుండి జాతీయ స్థాయి నాయకుని వరకు అధికారాన్ని అధికార పార్టీని అవకాశాన్ని అడ్డం పెట్టుకొని చేసే సంపాదనకు అంతే లేకుండా పోతున్నది. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న కారణంగా ఎంతోమంది శిక్ష నుండి త ప్పించుకుంటే అధికార పార్టీ ప్రతిపక్ష సభ్యుల పైన దర్యాప్తు సంస్థలను ఉసిగొలిపి ఏకపక్షంగా వ్యవహరించడాన్నీ కూడా మనం ఈ దేశంలో గమనించవచ్చు.

మనం అనుభవిస్తున్న అవకాశాలు వనరులు సౌలభ్యాలు అనేకమంది బుద్ధి జీవులు మేధావులు శాస్త్రవేత్తలు వివిధ రంగాల నిపుణుల కృషి ఫలితం అని ఎప్పుడైనా అంగీకరించినామా ? భయంకరమైన రోగాల బారిన పడుతూ చివరి అంచుకుపోయిన వారిని సైతం తిరిగి బ్రతికించగలుగుతున్న అనేక మందులు చికిత్సలకు ఎంతోమంది కృషి చరిత్రలో మిగిలి ఉన్నదని గుర్తించడం లేదంటే మనం మనుషులం ఎలా అవుతాం ? భక్తి పేరుతో అన్నదానాలు చందాలు కోట్ల రూపాయల సమీకరణ ఒకవైపు కొనసాగుతున్నది కానీ వికలాంగులు జుట్టు మాసి బట్టలు శిథిలమై జీవచ్ఛవాలుగా పడి ఉన్నటువంటి అభాగ్యుల ను కనీసం ఆదరించగలుగుతున్నామా ? ఒక్క రూపాయి అయినా దానం చేస్తున్నామా? ఇప్పటికైనా ఆలోచిస్తే మంచిది . మరి సామాన్యులమైన మనకు కొంచమైనా ఈ వ్యవస్థ పట్ల పేదరికం పట్ల ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా ? పట్టుదలతో ఆలోచిద్దాం! పరిశీలిద్దాం!. వీలున్న మేరకు స్పందిద్దాం ! పాలకులపై ఒత్తిడి తెచ్చి ప్రజా సంపద అందరికీ సమానంగా పంపిణీ చేసేలా పోరుబాట పడదాం !. ఇప్పటికైనా మీ మనసు మారిందా! మీకు సమ్మతమేనా నా సందేహాలు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం




# అక్రమ నిర్మాణాలపై మున్సిపాలిటీ మౌనమేల..?

- మున్సిపల్ కమిషనర్లు మారిన టౌన్ ప్లానింగ్ తీరు మారదా?
- ప్రజాప్రతినిధులకు అధికారులకు వజ్రాల గనిగా మారిన అక్రమ నిర్మాణాలు

**శంషాబాద్, మార్చి 10 (జనం సాక్షి)**

అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన శంషాబాద్ మున్సిపాలిటీ, మున్సిపాలిటీ పరిధిలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటే అక్కడ బడా నాయకుని పాత్ర ఉన్నట్టు. అంతా తానై చెక్కబడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడు. శంషాబాద్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులు ఒకే ఒక్క సుశీలన్నీ కలిస్తే చాలు మున్సిపల్ అధికారులు ఏ ఒక్కరూ అక్కడికి రారు. ఏ పార్టీకి సంబంధించిన ప్రజా ప్రతినిధి అయిన ఆయన రాకతో చల్లబడాల్సిందే. అక్రమ నిర్మాణాల పై ఎలాంటి ఫిర్యాదుల అందిన టౌన్ ప్లానింగ్ అధికారులు రాకుండా చూసుకునే బాధ్యత ఆ సుశీలిడిదే, ప్రభుత్వాలు మారిన మున్సిపల్ కమిషనర్లు మారిన టౌన్ ప్లానింగ్ తీరు మారదాంటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతా తానై మున్సిపాలిటీని ఏలుతున్న వ్యక్తి తను వచ్చాడు అంటే చాలు మున్సిపాలిటీ సిబ్బంది అధికారులు గజగజ ఓన్కాల్సింది, మున్సిపాలిటీకి సంబంధించిన ఎలాంటి సమస్యనైనా పరిష్కరిస్తూ, మున్సిపాలిటీలో ప్రజాప్రతినిధులకు కావలసిన సకల సౌకర్యాలను ఏర్పాటు చేసి తన వైపు తిప్పుకుంటాన్నారు. తక్కువ స్థలంలో భారీ బిల్డింగులు, సెల్లర్ల నిర్మాణాలు, పార్కింగ్ లేకుండా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోని మున్సిపల్ యంత్రంగా, మున్సిపాలిటీ పరిధిలోని పార్కింగ్ లేకుండా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. మున్సిపాలిటీలో పార్కింగ్ లేకుండా నిర్మాణాలను ప్రోత్సహిస్తుంటే మరోపక్క ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కింగ్ లేకుండా రోడ్లపై వాహనాలు నిలపడంతో రోడ్డుపై వాహనాలు జామాయిపోవడంతో ట్రాఫిక్ పోలీసులకు తిప్పలు తప్పట్లేదు. పార్కింగ్ కొద్దిగా స్థలాన్ని వదిలి నిర్మించాలని నిర్మాణదారులను కోరిన, నేషనల్ హైవే 44 ఇరువైపులా భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. సర్వీస్ రోడ్లపై వాహనాలు నిలిపి నేషనల్ హైవేకి ఆటంకాలు కలిపిస్తున్నారు. అభివృద్ధి పేరుతో అందిన కాడికి దోచుకోవడం వ్యాపారంగా మారింది. నిర్మాణాలకు మున్సిపాలిటీలు ఎలాంటి రుసుము చెల్లించకుండా ఇంటి నెంబర్ కోసం లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని వినికిడి, శంషాబాద్ మున్సిపాలిటీలో భూమి విలువ పెరగడంతో కుంటలు, చెరువులు, ఫిరంగినాలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ కు, ప్రభుత్వ అధికారులకు కలెక్టర్లకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాథుడు లేరాని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో పలు పార్టీలకు సంబంధించిన కౌన్సిలర్ గెలిచిన అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారు.



## సీఎం రేవంత్ రెడ్డి పోరాట ఫలితమే.. 2 దశాబ్దాల డంపింగ్ దుర్వాసన మాయం

- జీవో 59 ఛార్జీలు జవహర్ నగర్‌లో తగ్గించి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ప్రజా దీవెన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్యాదవ్

**జవహర్ నగర్, మార్చి 10 (జనం సాక్షి):**

జవహర్ నగర్ కార్పొరేషన్‌లో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న డంపింగ్ దుర్వాసన మాయమౌ తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. నాడు రేవంత్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు గ్రీన్ ట్రైబునల్లో న్యాయ పోరాట ఫలితమే డంపింగ్ యార్డ్ దుర్వాసన తగ్గుతూ వచ్చిందని ఈ ఘనత నాటి సీఎం రేవంత్ రెడ్డి కె దక్కుతుందని పేర్కొన్నారు. ప్రజా దీవెన సభలో శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..మహానగరానికి నలువైపులా డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తుండటంతో దుర్వాసన రావడం లేదని అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ లో దేశంలోని ప్రజలందరికీ ఆవాస నిలయంగా మారడంతో మినీ ఇండియాగా పేరుగాంచిందని..59 జీవో ఛార్జీలు కోకాపేటలో విధించేవి జవహర్ నగర్ విధిస్తుండటంతో పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జవహర్ నగర్పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి 59జీవో ఛార్జీలు తగ్గించి పేదలను ఆదుకోవాలని కోరారు.



## అన్నదానం గొప్ప సేవ

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, మార్చి 10 (జనం సాక్షి)**

సమాజంలో అన్నదానం గొప్ప సేవా కార్యక్రమమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని కుషాయిగూడలోని మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం కుషాయిగూడ పోచమ్మ దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతినెల అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తున్న మారుతి మిత్ర మండలి సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బాటసారులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి ప్రతినిధులు అశోక్ చారి, హనుమంతు, మచ్చ బాబు గౌడ్, వేణుగోపాల్ చారి, కమిటీ సభ్యులు, కుషాయిగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

## టికెట్ ఇప్పించినోళ్లే..గెలిపించే బాధ్యత తీసుకోండి

- టికెట్ రావడంలో ప్రధాన భూమిక కార్యకర్తలదే
- పాలమూరు కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి
- మక్తల్ కాంగ్రెస్‌కు కంచుకోట
- నాకు తోడుగా ఎంపీగా వంశీ అన్నని గెలిపించండి
- ఎమ్మెల్యేవాకిటి శ్రీహరి




**మక్తల్ మార్చి 10 (జనం సాక్షి)**

దేశవ్యాప్తంగా కేవలం 39 మందిని తొలిజాబితా కింద కాంగ్రెస్ పార్టీ లోక్ సభ అభ్యర్థులుగా ప్రకటించగా...తెలంగాణ నుంచి నలుగురిని మాత్రమే ఎంపిక చేయగా..తొలిజాబితాలోనే తనను మహబూబ్ నగర్ ఎంపీ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించారని, టికెట్ దక్కడంలో కీలకపాత్ర పోషించిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానని, టికెట్ ఇప్పింటినోళ్లే తనను గెలిపించే బాధ్యత తీసుకోవాలని చల్లా వంశీచందర్ రెడ్డి అన్నారు. మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల కృతజ్ఞతా మీటింగ్‌కు ఎమ్మెల్యేవాకిటి శ్రీహరితోపాటు కీలక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికలు పూర్తయ్యేవరకు కార్యకర్తలందరూ ప్రతి కార్యకర్త దీక్ష చేపట్టి, కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని అన్నారు. మక్తల్ నియోజకవర్గ పూర్తి బాధ్యత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి భుజాలమీద పెడుతున్నామని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో కార్యకర్తల బలగం పూర్తిస్థాయిలో ఉందని, ఈసారి భారీస్తాయిలోమెజారిటీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కంచుకోట అని, 2018లో ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తు లేకపోయినా...ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లో ఎవరూ ముందుకు రాకపోయినా వంశీచందర్ రెడ్డి ధైర్యంగా నిలబడ్డారని, ఆ సమయంలో 30వేలకుపైగా ఓట్లు వచ్చాయని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఎన్నికల్లో తనను కార్యకర్తలు, నేతలు అందరూ సమిష్టిగా నిలబడి శాసనసభ్యుడిగా గెలిపించుకున్నారని, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం తోడయిందని, ఈ సారి మరింత ఎక్కువ మెజారిటీ వంశీచందర్ రెడ్డికి అందించాలన్నారు. కేవలం 48 గంటల్లో రెండు హామీలు అమలు చేసిన ఘనత సీఎంరేవంత్ దేనని, తాజాగా మరో రెండు హామీలు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, 500కే సిలిండర్ అమలు చేస్తున్నారని అన్నారు. కేవలం 90 రోజుల్లోనే 13 కోట్ల రూపాయలతో ప్రతి గ్రామంలో సీసీరోడ్లు వేసుకుంటున్నామని, మక్తల్ ను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు. తాను 365 రోజులు అందుబాటులో ఉంటానని, రాబోయే రెండు నెలలు కార్యకర్తలు మరింతగా కష్టపడి ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆ తర్వాత జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించే బాధ్యతను తాము ఇద్దరం తీసుకుంటామన్నారు. అనంతరం వంశీచందర్ రెడ్డి, వాకిటి శ్రీహరిలను నేతలు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో నేతలు బాలక్రిష్ణారెడ్డి, నాగరాజ్ గౌడ్, లక్ష్మారెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, గోపాల్ రెడ్డి, గణేశ్ కుమార్, రవికుమార్, కట్టా సురేశ్ గుప్తా, వైస్ ఎంపీపీ రామేశ్వరి, అన్నిమండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, అన్ని విభాగాల నేతలు, కార్యకర్తలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## రక్తదానం మరోకరికి ప్రాణదానం

### రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు మార్చి10 (జనం సాక్షి)**

రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలో ఆర్బిఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అదేవిధంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తన సోదరుడి జన్మదిన వేడుకల సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా శ్రీనివాస్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినంత ఫలితం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్ రెడ్డికి ఆత్మీయ సన్మానం

**రాజేంద్రనగర్, మార్చి 10(జనం సాక్షి)**

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న కె. శ్రీనివాస్ రెడ్డిని మణికొండ ల్యాంకోహిల్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కె. సాంబశివరావు మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు, స్థానిక విలేకరులు తమ తమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో వారికి వాగ్దానం ఇచ్చి నెరవేర్చటంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఉండేందుకు ఇళ్లు లేక, సకాలంలో వైద్య సహాయం, ఆర్థిక సహాయం అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారన్నారు. అలాంటి వారిని మీడియా అకాడమీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపునః ఆదుకోవాలని కోరారు. మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకునేందుకు సిద్దంగా ఉందని, వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించామని, రాబోయే రోజుల్లో వారికి ప్రభుత్వ ఫలాలలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, ఐజేయు కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ, ల్యాంకోహిల్స్ నివాసితుల సంఘం కార్యదర్శి భాస్కర్, నాయకులు జనార్దనరెడ్డి, శ్రీనివాస్ సింగ్, చెన్నకేశవరావులతో పాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దాం



### ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తాండూరు మార్చి 10 (జనం సాక్షి)**

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేద్దామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం, తాండూరు, యాలాల మండల కేంద్రాలలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సోదరుడు ఆర్బిఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని తట్టేపల్లి సొసైటీ డైరెక్టర్ ఉప్పరి మల్లేశం ఆధ్వర్యంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు మహిపాల్ రెడ్డి,తాండూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, కోట్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుజ్జమ్మ, మాజీ ఎంపిటిసి డాక్టర్ రమేష్ కుమార్, పెద్దేముల్ సొసైటీ డైరెక్టర్ నారాయణ రెడ్డి,ఆర్మీ రిటైర్మెంట్ మాజీ ఎంపిటిసి విద్యాసాగర్, గ్రామ కమిటీ అధ్యక్షులు డివై. నర్సింలు, కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాలు ఎమ్మెల్యే సహకారంతో దశలవారీగా అభివృద్ధి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయా మండల పార్టీ నేతలు యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, మండల బీసీ సంఘం సెక్రెటరీ ఆనంద్ చారి, షబ్బీర్, జైపాల్ రెడ్డి, రమేష్, మల్లప్ప, వెంకట్ రెడ్డి, మినాజ్, బాల్ రెడ్డి, చెట్ల మీద రామప్ప పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రేటర్‌లో బల్దియా గొంతుకనవుతా

### జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్

**శేరిలింగంపల్లి, మార్చి 10 (జనం సాక్షి) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికై ప్రాంతాలకతీతంగా బలిజియ గొంతుకునవుతానని జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన దరిమిలా డివిజన్ పరిధి ఏఎస్ రాజు నగర్, జెపి నగర్ తదితర కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, బస్తీ పెద్దలు ఆదివారం ఉప్పలపాటి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని ప్రతి ప్రాంతానికి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా తన ప్రాతినిధ్యం ఉంటుందని, ఈ క్రమంలోనే నియోజకవర్గాలు ప్రాంతాలకు అతీతంగా గ్రేటర్ పరిధిలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి బల్దియా గొంతుకనవుతానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పునరుద్ఘాటించారు. గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలు, ఆయా డివిజన్ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం



ద్వారా ఇటు జిహెచ్ఎంసికి, అటు ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా జిహెచ్ఎంసి నుండి ఎన్నికవ్వడంతో తన పరిధి, బాధ్యత మరింత పెరిగిందన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూనే వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు నిశితంగా గమనిస్తూ గ్రేటర్ పరిధిలోని ప్రతి డివిజన్ సమగ్రాభివృద్ధికి ధనవంతు సహాయ సహకారాలు అందించడానికి నిజాయితీగా ముందుకు సాగుతానని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ రాజు నగర్, జెపి నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, బస్తీ పెద్దలు స్థానిక ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు అభిమానులు తదితరులుపాల్గొన్నారు.



## కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లగ్ మార్చ్ కవాతు

### డిఎస్పి కరుణ సాగర్ రెడ్డి

**కొడంగల్ మార్చి10 (జనం సాక్షి):**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమాన్ దేవాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి డిఎస్పి కరుణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తామ ఓటు హక్కు వినియోగించుకునెలా వారిలో నమ్మకం, బరోసా, భద్రత కలిగేలా జిల్లా పోలీసులు,కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లగ్ మార్చ్ కవాతు నిర్వహించడం జరిగిందని డిఎస్పి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలందరికీ ఎన్నికల పట్ల భద్రత, బరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలు కలిసి విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పరిగి డిఎస్పి కరుణ సాగర్ రెడ్డి, సిఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ లు భరత్ రెడ్డి, రాహుఫ్ పోలీసులు కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌ను కలిసిన బిజెపి నాయకులు

**అల్వాల్, మార్చి 10 (జనం సాక్షి)**



మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గ బిజెపి పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ను ఆయన నివాసంలో మేడ్చల్ మల్కాజిగిరి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మురళి కృష్ణ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా ఈటెల రాజేందర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా పలు విషయాలను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా నాయకులు డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 మార్చి 2024

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం



## సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు , మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మహబూబ్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పిస్తా హౌస్ నుండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన స్వయంగా బుల్లెట్ నడుపుతూ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్ రెడ్డిని మహబూబ్ నగర్




శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి ఆహ్వానించారు. అనంతరం అన్ని విభాగాల నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చెల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ అందరి ఆశీర్వాదం వల్లనే కేంద్ర నాయకత్వం మొదటి లిస్టులో తమ పేరు ఖరారు ప్రకటించడం జరిగిందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాలకేయుని హతమార్చి బాహుబలి గా గెలిచి నిలిచిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యంత కీలక పాత్ర పోషించాలని, మహబూబ్ నగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ తీసుకురావాలని ఆయన కోరారు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ కు ఓటు వేసే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు.

### పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా చల్లా వంశీచంద్రెడ్డిని గెలిపించాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఎంపిగా చెల్లా వంశీచంద్ రెడ్డిని గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కోరారు. ఈ ఎన్నికలు మనకు ఎంతో కీలకని, ఇప్పుడు కనిపించని శత్రువుతో మనం ఈ ఎన్నికల్లో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంచార్జిగా వ్యవహరిస్తున్న మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి, ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, కాబట్టి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. వచ్చే నలభై రోజుల పాటు పార్టీకోసం గట్టిగా పనిచేసి చల్లా వంశీచంద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెల్పించాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి , మహబూబ్ నగర్ మున్సిఫల్ చైర్మెన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మెన్ షబ్బీర్ అహ్మద్, టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, శివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు చలువ వసంత, మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బెక్కెరి అనిత, మైనార్టీ సెల్ చైర్మెన్ ఫయాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, హనీఫ్ హమ్మద్, ఎన్ ఎస్ యు ఐజిల్లా అధ్యక్షులు అవేజ్, ఐఎన్‌టియు సి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, డిసిసి కార్యదర్శి యం. కృష్ణయ్య, జి. చంద్రశేఖర్, మల్లు నర్సింహారెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు మహేంధర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఎన్ఎస్‌యుఐ అనిల్ రెడ్డి, సేవా దళ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం

## ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ మార్చి 10 (జనం సాక్షి)**



మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు కుటుంబ సమేతంగా శనివారం రాత్రి స్వామివారికి ఆకు పూజ మరియు రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రాణేశాచారి వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. అనం తరం దేవాలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రతినిధులు భక్తులతో ముచ్చటించారు. నారాయణపేట జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే మొదటి బ్రహ్మో త్సవాలు మక్తల్ శ్రీ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు అయినందున దేవాలయమునకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రతినిధులు మరియు భక్తులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కోరారు. శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం భూములు మక్తల్ పట్టణంతో పాటు, వివిధ గ్రామాలలో ఉన్న దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతానని చెప్పారు. స్థానిక మక్తల్ బస్టాండ్ ముందు భాగంలో బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులకు కూర్చోవడానికి ఎటువంటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారని విషయము వారి దృష్టికి తీసుకురాగా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కూర్చోవడా నికి తగిన షెడ్డు నిర్మాణము ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని, తమ ఇలవేల్పు అయినా శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆశీస్సులతో స్థానిక సమస్యలు, పట్టణ అభివృద్ధి,మరియు నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులను, మరియు వారి మాతృమూర్తి వాకిటి రాములమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రాణేశాచారి, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వి. భీమ్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు వాకిటి భీమన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ రావు, భజరంగ దళ్ జిల్లా సహ ప్రముఖ్ వాకిటి రమేష్, కున్సి నాగేందర్, అంజన్ ప్రసాద్ ఆలయ సిబ్బంది శ్రీనివాసులు తదితర భక్తులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి

## తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

**మక్తల్ మార్చి 10 (జనం సాక్షి)**

గత అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియను నూతన ప్రభుత్వం కొనసాగించి న్యాయం చేయాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం మఖ్తల్ కేంద్రంలో శేర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడుతూ అనేకమంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని అన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను వెంటనే విడుదల చేయాలని, 317 జీవో బాధితులను స్థానిక జిల్లాకు పంపాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దు పరచాలని, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఇటు తీర్మాన పత్రాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవియన్ రెడ్డి, తపస్ రాష్ట్ర శాఖకు నివేదిస్తామని జిల్లా అధ్యక్షుడు షేరి కృష్ణారెడ్డి తెలిపారు. మార్చి 8 మహిళా దినోత్సవం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వివిధ విభాగాలలో సేవలు అందిస్తున్న మహిళా ఉద్యోగులు నీరజ,పద్మ,సాయిభవాని,లక్ష్మి ,అనిత లకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంపు బాలరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు సీతారాములు, జిల్లా సలహాదారు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు సురేష్, వెంకట్ రెడ్డి, చంద్రకాంత్, తిరుపతయ్య, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, భీంరెడ్డి, రాకేష్, విశ్వనాథ్ రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, అంజిలయ్య, మల్లేష్ సురేష్ వెంకటేష్, రామ్మోహన్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



# సోమేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి కపూజలు

**చిన్న శంకరంపేట్ మార్చి 10 జనం సాక్షి:**

మండల కేంద్రంలోని ప్రసిద్ధ సోమేశ్వర ఆలయంలో మల్కాజ్గిరి మాజీ ఏమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ కోలుకురి రాజిరెడ్డి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిరంజీవి, మండల కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ గంగ నరేందర్,మాజీ ఎంపిపి అరుణ ప్రభాకర్, సాన సత్యనారాయణ, గడీల సుధాకర్, కోదూరి రమేష్ గౌడ్, పుల్లారావు, నాగరాజు, అంజాగౌడ్ పాల్గొన్నారు.

# భగవంతుని నామస్మరణ పూర్వజన్మ సుకృతం

## ఎమ్యెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

భగవంతుని నామస్మరణ పూర్వజన్మ సుకృతమని ఎమ్యెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం 88వ త్రిమూర్తి శివ జయంతి, శివ ధ్వజారోహణ ఉత్సవంలో భాగంగా మెట్టుగడ్డ లోని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనవుడు నేటి యాంత్రిక జీవన విధానంలో ప్రశాంతతను కోల్పోయాడని ప్రశాంతత కోసం భగవంతుని నామస్మరణ ఎంతో అవసరం అన్నారు. మానవుడు జీవిత పరమార్థం తెలుసుకోవడం ఎంతో ఆవసరమని , ఒక వ్యక్తికి ఉపకారం చేస్తే ఆవ్యక్తి మాత్రమే మేలు జరుగుతుందని ఊరికి ఉపకారం చేస్తే ఆ ఊరుకు అంతా మేలు జరుగుతుందని ఆ ఉద్దేశంతో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రపంచ శాంతిని కోరి చేస్తున్న సేవలు అమోఘమని కీర్తించారు. అందుకే నేను కూడా ఊరుకు ఉపకారం చేయాలనే సంకల్పంతోనే రాజకీయాలలోకి వచ్చానని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శివ




లింగానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మకుమారీస్ సంస్థ తరుపున ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ మున్సిఫల్ చైర్మెన్ ఆనంద్ గౌడ్, ఉమ్మడి జిల్లా సంచాలకులు సోదరి మహాదేవి, కౌన్సిలర్‌లు గిరిజ, విఠల్ రెడ్డి, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు జగదీష్, బ్రహ్మకుమారీస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో మార్చి 10 (జనం సాక్షి)**

వనపర్తి పట్టణంలోని 6వ వార్డుకు చెందిన నందిమల్ల సవరమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని కౌన్సిలర్ కంచె రవి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పార్థీవ దేహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. నిరంజన్ రెడ్డి వెంట మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, గౌనికాడి యాదయ్య, ఓడి రాములు తదితరులున్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక స్వయంగా నేనే చేస్తా

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, మార్చి 10 (జనం సాక్షి)**

వీపనగండ్ల మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు మరియు సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఒడిదుడుకులు ఇబ్బందులు ఎదుర్కొంటూ పరిపాలన సాగిస్తున్నామని వారు అన్నారు. దీనికి కారణం గత ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే అని వారన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి అప్పుల రాష్ట్రంగా మార్చిందని తెలిపారు. అప్పుల రాష్ట్రంగా ఉన్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం 6 గ్యారంటీల పథకాలలో నాలుగు గ్యారెంటీ పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. సోమవారం భద్రాచలంలో భద్రాచల రామయ్య సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఐదు లక్షల ఇందిరమ్మ ఇళ్లకు గాను నాలుగు లక్షల ఇళ్లకు రేపు ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. అదేవిధంగా గడిచిన ఐదేళ్లలో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని నేను చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని అన్నారు. వచ్చే సంవత్సరం లోపు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చూస్తానని అన్నారు. అదేవిధంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ కూడా తొందర్లోనే చేస్తామని రైతు భరోసా ద్వారా డబ్బులు జమ చేస్తున్నామని తొందరలోనే ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. రైతులకు రుణమాఫీపై ఎలాంటి అనుమానం ఉండవలసిన అవసరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఎస్. రవీందర్ రెడ్డి బసవరాజు గౌడ్, మునుగొండ గోపి, ముంత రాజు, ఆదయ్య, బాలపీరు,బాపూజీ గౌడ్, ముత్యాలు, సత్తయ్య, కల్వరాల నరసింహ పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల లక్ష్యంగా దూసుకెళుతున్న బీజేపీ



- బిజెపి పార్టీలో క్రియాశీల పాత్ర పోషించనున్న మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ
- బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్ సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి

**వనపర్తి బ్యూరో మార్చి 10 (జనం సాక్షి)**

పార్లమెంట్ ఎన్నికల లక్ష్యంగా జిల్లా బిజెపి పార్టీ కొత్త పాత నాయకులను కలుపుకుంటు ప్రజల్లోకి దూసుకెళుతున్నరు. ఆదివారం నాడు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పట్టణ చేరికల కమిటీ కన్వీనర్ సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి సమక్షంలో మాజీ బీజేపీ కౌన్సిలర్ అలివేలమ్మ క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. గతంలో వనపర్తి మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా 2 వ వార్డు మరియు 11 వ వార్డు నుంచి రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచి ప్రజా జీవితంలో ఉన్న అలివేలమ్మ 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 14వ వార్డు అభ్యర్థిగా పోటీలో ఉండి పరాజయం పొందిన తర్వాత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్న అలివేలమ్మను వనపర్తి పట్టణ చేరికల కమిటీ కన్వీనర్ సబిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ విజయానికి స్తబ్దుగా ఉన్న సీనియర్ నాయకులందరూ క్రియాశీలక భూమిక పోషించాలని ఆహ్వానించడంతో అలివేలమ్మ వారి భర్త కేశవాచారితో కలిసి మళ్ళీ బిజెపి కండువా కప్పుకున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలు ,వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపు లక్ష్యంగా పనిచేస్తానని అలివేలమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేరికల కమిటీ సభ్యులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, ఏ.సీతారాములు, జిల్లా కార్యదర్శి చిత్తారి ప్రభాకర్, జిల్లా అధికారుల ప్రతినిధి గొర్ల బాబురావు పాల్గొన్నారు.



# గుంపుగట్టు దర్గా మహిమాన్విత దేవుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి

## గుంపుగట్టు కందూరు విందులో పాల్గొన్న మాజీ ఎంపి రావుల

**వనపర్తి బ్యూరో మార్చి 10 (జనం సాక్షి)**

వనపర్తి జిల్లా బిఆరెస్ పార్టీ కార్మిక విభాగం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కానాయపల్లి గుంపు గట్టు దర్గా దగ్గర కందూరు నిర్వహించారు.వారి ఆహ్వానం మేరకు మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ గుంపుగట్టు దర్గా మహిమాన్విత దేవుడని ఈ స్వామివారిని దర్శించుకొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివస్తారని, వారికి కనీస సౌకర్యాలు మంచినీరు,కామన్ హాల్ కోసం గతములో సహకరించడం జరిగిందని రాబోవు రోజులలో ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ విందులో పాల్గొన్న రావులచంద్రశేఖరరెడ్డి కి ఆటో యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రావులతో పాటు మునిసిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పలుస రమేష్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ఎం.డి. గౌస్, నందిమల్ల రమేష్, ఆటో యూనియన్ నాయకులు యాదయ్య, గుబ్బం శ్రీను, ఖలీల్, రావుఫ్, అనిల్, రాములు, మన్నెం, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు

## రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు కురుమన్న

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులను ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా వాడుకొని అనంతరం విస్మరిస్తున్నారని తెలంగాణ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురుమన్న అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోనీ సంఘం కార్యాలయంలో తెలంగాణ వాల్మీకి యువసేన జిల్లా అధ్యక్షుడు కావలి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులను ఎన్నికల్లో కేవలం ఓట్ బ్యాంక్‌గా వాడుకొని వదిలేస్తున్నాయని ఎన్నికల సమయంలో వాల్మీకుల సమస్యలన్నీ తీరుస్తామని హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం వాల్మీకులను విస్మరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల కాలం నుండి వాల్మీకులను ఎస్టీ ల జాబితాలోకి మార్చాలని పోరాటం చేస్తున్న వాల్మీకులను పట్టించుకోవడంలేదని కేంద్రంలో వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చే బిల్లుని ఆమోదించబోయే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని, దాంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు వాల్మీకులకు రాజకీయాల్లో అవకాశాలు




ఇవ్వాలని కోరారు. లేదంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్న వాల్మీకి బోయలు తమ సత్తా చూపిస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎర్ర నరసింహ, జిల్లా కోశాధికారి సతీష్ కుమార్, పట్టణ యువసేన అధ్యక్షుడు నాగరాజు బోయ, ఉద్యోగ సంఘం నాయకులు కృష్ణయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.



# మహిళా స్వరాజ్యం

సోమవారం
11 మార్చి 2024
తెలంగాణ
జనంసాక్షి
www.janamsakshi.org





## సామూహిక ఆర్తనాదం
# 'యాన్ ఫ్రాంక్ డైరీ'

లాటిన్, షార్ట్ హాండ్ నేర్చుకునేది. తమ గదులకు పైనున్న ఒక చిన్న అటక మీద కూర్చుని పుస్తకాలు చదువుతూ, డైరీ రాస్తూ గడిపేది. రేడియో వార్తలు వింటూ రాజకీయ పరిణామాలను అర్థం చేసుకునేది. ప్రకృతిలో గడపటాన్ని ఇష్టపడే ఆనా, ఈ స్థితిలో సైతం తన సౌందర్య స్పృహను పోగొట్టుకో లేదు. అటకపైనున్న చిన్న వెంటిలేటర్ గుండా ప్రకృతి దృశ్యాలను చూస్తూ, "వినీలాకాశపు కాన్వాస్ మీదికి అప్పుడప్పుడూ సీగల్ లూ, ఇంకేవో చిన్ని పక్షులూ వచ్చి పోతాయి. మబ్బు తునకలు బద్ధకంగా నడిచి పోతాయి. సాయం సంధ్యలో సూర్యుడు బంగారు కిరణాలు వెదజల్లి పోతాడు. రాత్రి వేళల్లో చంద్రవంక చిరునవ్వు చిందిస్తుంది ."అంటూ అందమైన శైలిలో వర్ణిస్తుంది. కిటికీ పక్కనున్న చెస్ట్ నట్ చెట్టులో వచ్చే మార్పులను చూస్తూ రుతువులను అంచనా వేసేది .

"ఈ ప్రపంచం క్రమంగా క్రూరంగా మారి పోతోంది. అది పిడుగుపాటులా అందరినీ ధ్వంసం చేస్తుంది . కానీ అలా ఆకాశం వైపు చూస్తుంటే, ఇదంతా మారి పోతుందని ఆశ కలుగుతుంది. ఈ క్రూరత్వం అంతమై దయ, శాంతి నెలకొంటాయి. ఆ రోజును నా కళ్ళతో చూస్తాననే ఆశ ". అని రాసుకున్న ఆనా ఆశ నెరవేర లేదు. 1944 ఆగస్ట్ 4 న నాజీలు వాళ్ళను అరెస్టు చేసి కాన్సంట్రేషన్ క్యాంపుకు తరలించారు. అక్కడే ఆమె మరణించింది. రెండవ ప్రపంచ యుద్ధం లో జర్మనీ ఓడిపోయాక, నాజీల నిర్బంధ శిబిరాల నుండి యూదులు విడుదలయ్యారు. అలా బయట పడిన ఒట్టో ఫ్రాంక్ కు తన కుటుంబమంతా మరణించిన వార్త తెలిసింది. తమ స్థావరంలో దొరికిన ఆనా డైరీని కూడా ఆయన భద్ర పరిచాడు. డచ్ భాషలో ఆమె రాసిన ఆ రచన 1847 జూన్ 25న, అంటే సరిగ్గా 75 ఏళ్ళ కిందట మొదటి సారిగా ప్రచురితమైంది. ఆ తర్వాత 70కి పైగా భాషల్లోకి అనువాదమై ప్రపంచమంతటా లక్షల కాపీలు అమ్ముడు పోయింది. తమ అటక మీది కిటికీ గుండా ఆనా చూసి వర్ణించిన ఆ చెస్ట్ నట్ చెట్టును నెదర్లాండ్స్ ప్రభుత్వం తమ జాతీయ సంపదగా గుర్తించి సంరక్షించింది. ఆ కిటికీ నుండి ఆమెకు వెలుగునూ, వెన్నెలనూ పంచిన ఆకాశపు ముక్కను యాన్ ఫ్రాంక్ కు ఆ ప్రభుత్వం అంకితం ఇచ్చింది. రెండు సంవత్సరాలకు పైగా ఆమెకు ఆశ్రయమిచ్చిన ఆ భవనం యాత్రా స్థలమైంది.

ఆనా వంటి ఎందరో బాలల కలలూ, కోరికలూ అకాలంగా దగ్ధమై పోయిన దారుణం మాత్రం చెరపలేని పీడ కలగా చరిత్రలో నిలిచి పోయింది.

ఐతే, ఇప్పుడు ఇంత కాలం తర్వాత ఆ డైరీతో ప్రపంచానికి ఉన్న సంబంధం ఏమిటి? అదొక చారిత్రిక పత్రం మాత్రమేనా? మనం దాన్ని చదవటం కాసిని కన్నీళ్లు కార్చటానికేనా?ఎంత మాత్రం కాదు! ఆ నాటి ఫాసిజం వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు రూపాల్లో కొన సాగుతూనే ఉంది. యుద్ధోన్మాదం, దురాక్రమణ కాంక్ష బాలల భవిష్యత్తును కాలరాస్తూనే ఉంది. ఇరాక్ లో, ఆఫ్ఘన్ లో, పాలస్తీనాలో, కశ్మీర్ లో అనాథలై, బందీలై బిక్కు బిక్కుమంటున్న బాలలు ఎందరిని చూస్తున్నాం? "బయటికి రా ! మనసారా నవ్వు ! స్వచ్ఛమైన ప్రాణవాయువును గుండెల నిండా పీల్చుకో ! అని నా లోపలి నుంచి ఎవరో పిలుస్తున్నట్టుగా ఉంటుంది "అని రాసుకున్న మాటలు ఒక్క యాన్ ఫ్రాంక్ వేనా? ఎందరు బాలల సామూహిక స్వరమది!

అందుకే ఈ డైరీ మనల్ని ఇంకా కలత పెడుతూనే ఉంది. యుద్ధాలున్నంత కాలం, దురాక్రమణలు సాగినంత కాలం ఆనా రచనకు ప్రాసంగికత ఉంటుంది. ఆధిపత్య రాజకీయాలను నిరసించమని హెచ్చరిస్తూనే ఉంటుంది.

## ఊపిరి బిగపట్టి చదవాల్సిన పుస్తకం
# "ఉరి వార్డు నుండి"




అసలు బయట వుంటున్న వారెవరు? జైల్లో వుంటున్న వారెవరు? జరుగుతున్నది ఉల్టా కదా అన్న మౌలిక ప్రశ్నలు కూడా ఈ పుస్తకంలో చదువుతున్నంత సేపూ మనల్ని వెంటాడుతాయి. వేటాడుతాయి కూడా!

విచిత్రం ఏమంటే నిర్భాగ్యమహిళలకు బయట ప్రపంచమూ, జైలు ప్రపంచమూ కొంచెం అటూ ఇటూ రెండూ ఒకటి గానే వుంటాయి. ఒక్కోసారి జైల్లే మేలని కూడా అన్పిస్తుంటాయి.

బ్రహ్మకుమారీలు వచ్చి "నైతిక ఆధ్యాత్మిక బోధామృతం" కురిపించబోయినప్పుడు ఒక సాధారణ ఖైదీ "అందరం బాగానే వున్నాం కదా! ఇక్కడ అత్తలూ లేరు, మొగుళ్ళూ లేరుబీ వంటలూ లేవు, వేధింపులూ లేవు" అని అమాయకంగానో, గడసరి తనంతోనో వారిని ప్రశ్నిస్తుంది. ఇలాంటి ఘట్టాలు చదువుతున్నప్పుడు జైలు రచనల్లోనూ ఇంత హాస్యం పండించవచ్చునా అన్పిస్తుంది. కానీ ఇదొక కఠోర వాస్తవం.

జైల్లోనూ ఆడవాళ్ళకి పండుగలు, సంసారాలు, కోరికలు, ప్రేమలు, మేకప్లు, మాతృత్వాలు, సహకారాలు అన్నీ ఉంటాయి. అలానే అసూయలు, ద్వేషాలు, పోటీలు, కొట్లాటలు,దొంగతనాలు కూడా ఉంటాయి. జైల్లో వేసినంత మాత్రాన వాళ్ళ జీవితాలేమీ మారవు. వీళ్లంతా నిఖార్సైన మనుషులు, మట్టి మనుషులు. వాళ్లు ఎప్పుడూ మనుషుల్లానే వుంటారు. ఇలా చూస్తే జైలే వీళ్ళ ముందు ఒక ఘోరంగా ఓడిపోతుంది.

అన్నట్టు వీరంతా జైలు నుంచి బయటికొచ్చాక ఏమవుతారు? ఏమీ కారు.లోకాన్ని ఎదురీదడంలో అంతో ఇంతో మరింత రాటు తేలుతారన్పిస్తుంది. ఇంతకన్నా ఈ జైళ్లు నీళ్ళని "సంస్కరించించేదీ" లేదు. సాధించిందీ లేదు. బయట బడాబడా నేరగాళ్లు లక్షల మంది వుంటే వీళ్ళే జైలుకెందుకు రావాలి అనేది అసలు ప్రశ్న. కనీసం మరుగుదొడ్లయినా ఉండని, బాత్రూములు కూడా దొరకని, చివరకు బట్టలారేసుకొనూ దోవలేని దౌర్భాగ్యం దేనికనేది ప్రశ్న. సుధా గారే "నేను భారతీయ మరుగుదొడ్డిలో ఒక మూల కూచొని స్నానం చేసేదాన్ని" అన్నప్పుడు రాజ్యంలోని అమానుషత్వమంతా జైళ్లలో పేరుకుపోయిందా అనిపిస్తుంది. అసహ్యం వేస్తుంది.

విచిత్రం ఏమంటే బ్రిటన్ కాలపు జైళ్లే మేలు. ఇదే యరవాడ జైల్లో గాంధీ గారి లాంటివారూ వున్నారు. ఆ రోజుల్లో వారికి కావలసిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఎన్ని రచనలనైనా వారు చేసేవారు. సమావేశాలు జరిపేవారు పూనా ఒప్పందం సైతం ఇక్కడే జరిగింది. దీర్ఘకాలిక నిరాహార దీక్షల్లాంటి రాజకీయ పోరాటాలు కూడా వాళ్ళు చెయ్యగలిగే వారు. మరి స్వతంత్ర భారత జైళ్ళు ఎందుకిలా బిగుసుకుపోయాయి? మన ప్రజాస్వామ్యం ఎందుకింత కురచబారి పోయింది? సుధా భరద్వాజ్ గారు ఈ ప్రశ్నలన్నీ లేవనెత్తుతారు. అసలు జైళ్ళులేని పాలను అంటూ వుండదా? ఉండే రోజులు రావా అని ఆమె ప్రశ్నిస్తారు.

అలాగే మన నేరనిర్ధారణలూ, శిక్షాస్మృతులు కూడా. ఆత్మ రక్షణలో భాగంగా చెయ్యాల్సి వచ్చే చర్యల్ని బ్రిటన్ లాంటి దేశాలు హత్యానేరాలుగా లెక్కించవు. మరి ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లంటూ బడాయికి పోతున్న మన దేశంలో ఈ మాత్రం విచక్షణా లేదెందుకని? అదే వుండి వుంటే ఈ ఖైదీల్లో సగం మంది జైలు ముఖం చూడాల్సి వచ్చేదే గాదు. సుధా గారు సూటిగా ఈ ప్రశ్నను లేవనెత్తుతారు.

ఇక "ఉరివార్డు నుండి" కథనం కూడా అద్భుతమైంది. సుధా భరద్వాజ్ గారు చెయి తిరిగిన రచయిత్రిగా ఏ అరుంధతీ రాయ్ లాగానో సాహిత్య ప్రపంచంలో దఖలు పడకపోవచ్చు గానీ ఒక్కోఖైదీని (ఈ మాట మాటి మాటికీ అనడం సిగ్గుగా ఉంది) సాదాసీదాగా ఆమె ముక్కు గురించీ, ముంగురుల గురించీ, పూసుకున్న లిప్టిక్ గురించీ, వేసుకొన్న జడ గురించీ చెబుత చెబుతూనే పాఠకుల్ని ఎంత దూరం తీసుకెళ్లాలో అంత దూరం తీసుకెళ్తారు. సామాజిక రాజ 3 అపసవ్యతలనన్నిటినీ మన ముందు రాసి పోస్తారు. పేర్లుచెప్పడం వీలు గాక రూపురేఖలతోనో, వేషభాషలతోనో ప్రారంభించి ప్రతి ఖైదీ విషాదృశ్యాన్ని మన కళ్ళ ముందు నిలబెడతారు. ఇదో కొత్త ప్రక్రియ అనిపిస్తోంది.

చివరగా ఇలాంటి పుస్తకాలను తేవడం ఇప్పుడేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. మనందరం ఒకరికొకరం తోడుగా నిలబడితేనే ఈ వరవడిని కొనసాగించగలం. ఇప్పుడు మనకు పాఠకుల రచయితల సంఘటన కూడా, ఏదో ఒకటి, ఏదో ఒక మేరకైనా వుండాలి. ఇలాంటి పుస్తకాలు సహకార రంగంలో వచ్చిన సమిష్టి ప్రచురణలుగా మారాలి. పుస్తకం వెలువడ్డాక కూడా కనీసం ఐదారు వందల పుస్తకాలయినా మనలాంటి వాళ్ళందరి చేతుల్లోకి రాగలగాలి. వాటిపైన చిన్నచిన్న గ్రూపుల్లోనయినా విస్తృతంగా చర్చజరగాలి. తెలుగు వాళ్ళకు గొప్ప ప్రజాస్వామిక సాంస్కృతిక వారసత్వం వుంది. దీన్నిప్పుడు మనం పనిగట్టుకొని మరీ నిలబెట్టుకోవాలి. ఈ రోజు మతఛాందస శక్తుల నుంచి వెయ్యి సవాళ్లు మన ముందుండొచ్చు. ఎన్ని వున్నా మనం సమిష్టిగా వుంటే దీటుగా ప్రతి సవాలును విసరగలం. ప్రజాస్వామిక ఉద్యమాలకిది కొండంత స్ఫూర్తినిస్తుంది. వెన్నుదన్నుగా నిలుస్తుంది.

"ఉరి వార్డు నుంచి" మనల్ని ఈ వైపుకు కొంచెమైనా మళ్ళించగల్గితే దీనికి మరింత సార్థకత చేకూరుతుంది.

# రేవంత్ సీఎం కావాలన్నాను.. తప్పేముంది?

- భట్టి విక్రమార్క నా మీద పగ పట్టిండు..
- కన్నీరు పెట్టుకున్న వీ హనుమంతరావు



హైదరాబాద్ : ఖమ్మం ఎంపీ టికెట్ రాకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన మీద పగ పట్టిండు, కక్ష పెంచుకున్నాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు కన్నీరు పెట్టుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దయవల్లే ఈ స్థాయికి ఎదిగాను అని వీహెచ్ స్పష్టం చేశారు. గత ఏడు, ఎనిమిది ఏండ్ల నుంచి తనకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ లేదు.. స్టార్ క్యాంపెయిన్‌లో చోటు ఇవ్వలేదు. అయినప్పటికీ తనకు ప్రజల్లో అభిమానం ఉంది. ఎవరు తనకు వ్యతిరేకం చేసిన ఆ భగవంతుడు ఉన్నాడని వీహెచ్ పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి పార్టీ కోసం కష్టపడ్డారు.. ఆయనే సీఎం కావాలన్నాను.. అందులో తప్పేముంది..? పార్టీ బలోపేతానికి రేవంత్ ఎంతో కృషి చేశారు. న్యాయ యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ దీన్ని గమనించి తనకు న్యాయం చేయాలి. హెలికాప్టర్‌లో రేవంత్ రెడ్డి తిరిగితే.. తాను కార్లలో తిరిగి ప్రచారం చేశాను. భారతదేశంలో హనుమంతరావు అంటే తెలియని వారు లేరు. భట్టి విక్రమార్క సీఎల్పీ స్థాయికి ఎదిగేందుకు తన సహాయం కూడా ఉంది. రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగేందుకు భట్టి విక్రమార్కకు తాను సహాయం చేస్తే.. ఇవాళ్నేమో ఆయన తనను వ్యతిరేకిస్తున్నారు. ఖమ్మం టికెట్ వస్తే తప్పకుండా గెలుస్తా. రాజీవ్ గాంధీ ఆలోచనను ఇంప్లీమెంట్ చేస్తాను. ఖమ్మం ప్రజలు తనను కోరుకుంటున్నారు. బీసీలు అవసరం లేదా..? బీసీలు ఓట్లు వేసే మేషిన్లమా.. న్యాయం జరగదా..? తాను ఎంతో మందికి సహాయం చేశాను. రాజశేఖర్ రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్‌గా చేసింది కూడా తానేనని వీ హనుమంతరావు పేర్కొన్నారు.

# సాంకేతిక విద్య.. బంగారు భవిత

### పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**నల్లగొండ బ్యూరో, జనంసాక్షి :**
శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలనుకునే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఓ వరం. ఇందులోని కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువ. పది తర్వాత ఇంటర్మీడియట్. ఆ తర్వాత నీట్, ఎంసెట్ లాంటి పరీక్షలు రాసి ఇంజినీరింగ్ లేదా మెడిసిన్, లేకపోతే డిగ్రీ, పీజీలు చేయాలనుకుంటారు. కానీ పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ విద్య వైపు మళ్లితే తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకొని మూడు, నాలుగేళ్లలో బంగారు భవిష్యత్తు రూపొందించుకోవచ్చు. ఈ కోర్సు తర్వాత ఇంజినీరింగ్ చదివేందుకూ అవకాశాలున్నాయి. ఈ విద్యతో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, రోడ్డు భవనాల శాఖ, ఎయిర్‌లైన్స్, రవాణాశాఖ, టిఎస్ఆర్టిసి, టిఎస్‌ట్రాన్స్‌కో, టిఎస్ జెన్‌కో, డిస్కం, బిహెచ్‌ఈఎల్, బిఎస్ఎన్ఎల్; ఎన్‌టిపిసి, ఇండియన్ ఆర్మీ, నేవీ, కార్పోరేట్ సంస్థలు, పలు ప్రభుత్వ శాఖల్లో సూపర్‌వైజర్ స్థాయి, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

**షెడ్యూల్ ఇలా..**
ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 22 వరకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎబిటెట్. తెలంగాణ.గౌవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ.
**ఫీజు:** జనరల్, బిసి కేటగిరీకి రూ.500, ఎస్సి, ఎస్టికు రూ.250,




అపరాధ రుసుం రూ.100తో ఏప్రిల్ 24 వరకు, అపరాధ రుసుం రూ.300తో ఏప్రిల్ 26వరకు
**పరీక్ష తేదీ:** మే 17, **పరీక్ష విధానం:** 2.30గంటల సమయంలో 150 మార్కులకు పరీక్ష, గణితం -60, భౌతిక శాస్త్రం-30, రసాయనశాస్త్రం -30, జీవశాస్త్రం-30మార్కుల చొప్పున పదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు

**ఉపాధి అవకాశాలు ఎక్కువ..**
పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తి చేసినవారు బిటెక్‌లో నేరుగా రెండో ఏడాదిలో చేరొచ్చు. ఉన్నత చదువులు చదవలేనివారు ఈడిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం చేసుకోవచ్చు.

# సిరిసిల్ల జిల్లాలో విషాదం

### నలుగురు రైతులకు కరెంట్ షాక్

**రాజన్న సిరిసిల్ల, జనంసాక్షి :**
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. నలుగురు రైతులు కరెంట్ షాక్‌కు గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందారు.



వివరాల్లోకి వెళ్తే.. బావుసాయిపేట గ్రామానికి చెందిన ఉప్కల రోశయ్య అనే రైతు పొలంలో బోరు మోటారు దించేందుకు నలుగురు రైతులు వచ్చారు. బోరు మోటారు దించుతుం డగా.. నలుగురు రైతులకు కరెంట్ షాక్ తగిలింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఈ నలుగురిని 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురిలో ఒకరు మృతి చెందారు. కర్నాల శ్రీనివాస్, కర్నాల మహిపాల్, పంబల రాజు అనే ముగ్గురు రైతుల పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిని పంబల భూమయ్య(33)గా పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులను జడ్పీ చైర్ పర్సన్ అరుణ పరామర్శించారు.

## బీజేపీ తీర్థం పుచ్చుకున్న నలుగురు బీఆర్ఎస్ నాయకులు

- మహబూబాబాద్, ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సీతారాం నాయక్, గోడం నగేశ్‌తో పాటు శానంపూడి సైదిరెడ్డి, జలగం వెంకట్రావు చేరిక
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన తరుణ్ చుగ్



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ నుంచి నేతల వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆ పార్టీ మరో బిగ్ షాక్ తగిలింది. మహబూబాబాద్, ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సీతారాం నాయక్, గోడం నగేశ్, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో వీరు నలుగురు బీజేపీలో చేరారు. బీజేపీ కండువాలను కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ నాయకులు లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరిన విషయంతెలిసిందే. దీంతో లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి.

# ప్రణీత్ రావుపై కేసు నమోదు

- స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి అదనపు ఎస్పీ డి.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు

హైదరాబాద్, (జనంసాక్షి) :
తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో ప్రతి పక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారంటూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్ రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి) అదనపు ఎస్పీ డి.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును నమోదు చేశారు. సమాచారాన్ని వ్యక్తిగత పరికరాల్లోకి కాపీ చేసుకున్నాక హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ రావు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బీఆర్ఎస్ హయాంలో ఎస్ఐబీ డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్ రావుతో పాటు మరికొందరిపై కూడా పోలీసులు కేసులు పెట్టారు.

ఇటీవల కొన్ని రికార్డులు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మరుసటి రోజు డిసెంబర్ 4న రాత్రి సమయంలో సీసీటీవీ కెమెరాలను ఆఫ్ చేసి డేటాను ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎలక్ట్రానిక్ పరికరాలలోని సమాచారం, ఇతర డాక్యుమెంట్లు మాయమవ్వడం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీంతో అసలేం జరిగిందో తేల్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదవడంతో ప్రణీత్‌రావును విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా ఎస్ఐబీ కార్యాలయంలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2 గదుల్లోని 17 కంప్యూటర్లను ప్రణీత్‌రావు అనధికారికంగా వాడుకున్నారు.

# తాగునీళ్లు, సాగునీళ్లు ప్రజలు అల్లాడిపోతుండ్రు

- ఢిల్లీ పర్యటనలు మాని.. కరువు పర్యటనలు చేయండి ..
- రేవంత్ రెడ్డికి జగదీశ్‌రెడ్డి హితవు

**హైదరాబాద్, (జనంసాక్షి) :** సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా సోయి తెచ్చుకొని.. ఢిల్లీ పర్యటనలు మానుకొని.. రాష్ట్రంలో కరువు పర్యటనలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి. జగదీశ్‌రెడ్డి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనంతో వచ్చిన కరువుతో రైతులు అల్లాడిపోతున్నారని.. కరువు పర్యటనలు చేపట్టి వెంటనే రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు కరువుపై ఎక్కడ ప్రశ్నిస్తారోననే భయం, ఎక్కడ నీళ్ల కోసం అడ్డుపడతారోననే జంకుతో ఇప్పటికీ వ్యవసాయరంగంపై సమీక్ష చేసేందుకు సీఎం వెనకాడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే వ్యవసాయ, సాగునీటి శాఖలపై సమీక్షలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఒకవైపు తాగునీళ్లు లేక ప్రజలు.. సాగునీళ్లు లేక రైతులు అల్లాడిపోతుంటే సోయి లేకుండా కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మానవబాంబులు తయారు చేయడానికి ఉగ్రవాదివా..? పేగులు మెడలో వేసుకొని తిరగడానికి నువ్వేమన్న కసాయోడివా? ముఖ్యమంత్రివా..?' అని ప్రశ్నించారు. 'మూడు నెలల అసమర్థ పాలన వల్ల లక్షలాదిమంది రైతుల పేగులను మెడలో వేసుకున్నవ్.. ఆ పాపం ఊరికే పోదు' అంటూ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కోరుకున్న మార్పు ముందుకెళ్లడం లేదని.. మూడు నెలల్లోనే అది తిరోగమనంలో పయనిస్తున్నదని ఎద్దేవా చేశారు.

**కర్ణాటక నుంచి నీళ్లు తీస్కరా..**
కాంగ్రెస్ నేతలు నిష్ప్రయోజనంగా మార్చుతున్న కాళేశ్వరం నుంచి ఇప్పటికైనా రైతులకు సాగునీరు అందించవచ్చని జగదీశ్‌రెడ్డి సూచించారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ సర్కారే ఉందని.. అక్కడి ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు నీళ్లు తీసుకురావొచ్చని కోరారు. ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి.. అదే ఢిల్లీ పెద్దలతో కర్ణాటక నేతలతో మాట్లాడించి నీళ్లు తెచ్చే దమ్ములేదని అన్నారు. గతంలో రైతులు కేసీఆర్‌పై భరోసా వేశారని.. ఎలాగైనా అన్ని పంటలకు నీళ్లు ఇస్తారనే నమ్మకంతో ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి పంటలను ఎండబెడుతున్నదని అన్నారు. నీళ్లు లేక రైతులు పంటలను పశువుల మేతకు వదిలే దారుణ పరిస్థితులను కాంగ్రెస్ తీసుకొచ్చిందన్నారు. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు ఎండిపోతుంటే నల్లగొండ మంత్రులకు, ముఖ్యమంత్రి సోయిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఈ దుస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు. పంటలపై నాడు తమకొక అంచనా ఉందని, నేటి ప్రభుత్వానికి ముందస్తు అంచనా ఏమీ లేదన్నారు. ఢిల్లీకి ముడుపులు, మూటలు సర్దడంపైనే తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ముందుస్తు ప్రణాళిక ఉందని ఎద్దేవా చేశారు. ప్రధాన పత్రికల్లో కరువుపై రాస్తున్న వార్తలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

కేసీఆర్ నిర్మించిన బ్రిడ్జిలకు శంకుస్థాపనలు చేయడం, ప్రాజెక్టులకు కొబ్బరి కాయలు కొట్టడం, కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం కాదని.. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని సవాల్ విసిరారు. కొత్త ప్రాజెక్టులు కట్టకుండా.. ఉన్న ప్రాజెక్టులు నీటికి కొట్టుకుపోతే బాగుండనే దుర్మార్గపు ఆలోచన ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టడం, చిత్రహింసలు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మంచినీళ్లు లేవని, సాగునీరు లేక పొలం ఎండిపోయిందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కేసు పెట్టిస్తావా? అంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్ చర్యల వల్ల గ్రామాల్లో సహా హైదరాబాద్‌కు సైతం తాగునీటి సమస్య రాబోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రిళ్లు కరెంటుతో పాములు, తేళ్లు కుట్టి చనిపోతున్న రైతుల మరణాలతో మార్పు బాగానే మొదలైందని ఎద్దేవా చేశారు. నాడు సీఎం రేవంత్ గురువు చంద్రబాబుతో ఎలాంటి మార్పు మొదలైందో.. నేడు శిష్యుడి పాలనలోనూ అదే మార్పును చూస్తున్నామని అన్నారు. కేసీఆర్ ఒక్క ఆడబిడ్డ కూడా ఇబ్బంది పడొద్దని తాగునీరు ఇస్తే.. కాంగ్రెస్ చేతగాని తనం వల్ల గ్రామాల్లో, పట్టణాల్లోనూ ట్యాంకర్లతో నీటిని తెచ్చుకోవల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కృత్రిమ కరువుపై సోయి తెచ్చుకొని.. ఇకనైనా సమీక్షలు చేయాలన్నారు.

# తొలిసారి రామయ్య సన్నిధికి సీఎం రేవంత్ రెడ్డి

## భద్రాద్రి అభివృద్ధిపై దృష్టి సారిస్తారా..?



**ఖమ్మంజిల్లా బ్యూరో,మార్చ్10(జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారిగా సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి రామయ్య సన్నిధిలో అడుగు పెట్టబోతున్నారు. సాక్షాత్తు ఆ శ్రీ రామచంద్రులు నడయాడిన ప్రాశస్త్యం కలిగిన భద్రాచల క్షేత్రానికి సీఎం హెూదాలో రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యం తాజాగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రతియేటా శ్రీరామనవమి వేడుకకు లాంచనప్రాయంగా సమర్పించాల్సిన పట్టు వస్త్రాలను గత కొన్నేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన విషయం తెలిసిందే. తానీషా మంత్రివర్గంలో పని చేసిన భక్త రామదాసు అధికారిక హెూదాలో శ్రీరామ నవమికి పట్టు వస్త్రాలను సమర్పించిన నాటి నుంచి ఈ సంప్రదాయం ఆనవాయితీగా కొనసాగుతోంది. కాగా దశాబ్దాల ఈ ఆనవాయితీకి, సంప్రదాయానికి గత ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళం పాడారు. కాగా శ్రీరామనవమి సమీపిస్తున్న నేపథ్యంలో భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన జరపడం విశేషంగా చెప్పుకోవచ్చు. అయితే అనాదిగా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో సమస్యలతో కున్నారిల్లుతున్న భద్రాచల క్షేత్ర అభివృద్ధిపై సీఎం దృష్టి సారిస్తారా..? అన్నదే వేచి చూడాల్సి ఉంది. సోమవారం భద్రాచలానికి వస్తున్న ముఖ్యమంత్రి తొలుత శ్రీ రాముని దర్శనాన్ని పూర్తి చేసుకుని అనంతరం ఆరు గ్యారెంటీ ల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం మణుగూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

**దక్షిణ అయోధ్యపై వరాల జల్లు కురిసేనా..?**
భక్తులు దక్షిణ అయోధ్యగా పిలుచుకునే భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం అనాదిగా నిర్లక్ష్యానికి గురవుతోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు మొన్నటి వరకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం రామయ్య గుడి అభివృద్ధి గురించి అస్సలు పట్టించుకోలేదు. ఫలితంగా నాడు రామదాసు నిర్మించిన ఆలయం నేటికీ ఎలాంటి ఉన్నతికి నోచుకోకుండా అలాగే ఉంది. బీఆర్ఎస్ హయాంలో ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించి అమలుకు ఫండ్స్ ఇస్తామని ప్రకటించారే తప్ప పైసా రిలీజ్ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ఆలయాన్ని ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) పథకం కింద చేర్చింది. ఈ స్కీమ్ కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ట పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపిన కేంద్ర ప్రభుత్వం భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవాలయాన్ని మాత్రం విస్మరించింది.



**బీఆర్ఎస్ సర్కారు దగా...**
తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం భద్రాచలం దేవ స్థానాన్ని యాదాద్రి తరహాలో డెవలప్ చేస్తామని ప్రకటించింది. 2016లో ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించి, బడ్జెట్లో రూ. 50 కోట్లు కేటాయించింది. ఏటా బడ్జెట్ లో నిధులు ఇస్తామని మాటిచ్చింది. ఆలయ అభివృద్ధి, వసతుల కల్పన కోసం ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనందసాయి ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ తయారు చేయించింది. ఆలయం చుట్టూ రెండు ప్రాకారాలు, వేయికాళ్ల మండపం, గోదావరి పుష్కరిణి, 105 అడుగుల రామస్తూపం తదితర నిర్మాణాలకు 65 ఎకరాలు అవసరమని అంచనా వేశారు. రూ.400 కోట్లు ఖర్చయినా భద్రాచలం దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించిన అప్పటి సీఎం కేసీఆర్ సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చే సంప్రదాయాన్ని కూడా నీరుగార్చారు. బీఆర్ఎస్ హయాంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ ను ఏర్పాటు చేయలేదు. ప్రకటనలు తప్ప ఫండ్స్ ఇవ్వకపోవడంతో మాస్టర్ ప్లాన్ మూలన పడింది.

**"ప్రసాద్" పనులు నత్తనడకన..**
నిత్యం రామ జపం చేసే కేంద్ర సర్కారు కూడా భద్రాచలం డెవలప్మెంట్ పై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రసాద్" పనులకు 2022 డిసెంబరులో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శంకుస్థాపన చేశారు. తొలిదశలో రూ.41.38 కోట్లు మంజూరు చేయగా.. భద్రాచలంలోని మిథిలా స్టేడియం పక్కన భవన నిర్మాణాలు చేపట్టారు. టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్ కు అప్పగించిన పనులు నత్త నడకన సాగుతున్నాయి. పర్ణశాల, ఇతర చోట్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రామాలయంలో, స్టేడియంలో రూఫ్ వర్క్స్ కూడా మొదలు పెట్టలేదు. టెండర్లో పేర్కొన్న మేరకు పనులు 2024 మే నాటికి పూర్తికావాలి. కానీ పనులు జరుగుతున్న తీరు చూస్తే ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడంలేదు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ భద్రాద్రి రామాలయం అభివృద్ధిపై అనాదిగా చిన్న చూపే చూస్తున్నాయి. కాగా రాష్ట్రంలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం భద్రాచల ఆలయం అభివృద్ధి విషయంలో దృష్టి సారిస్తుందన్న అంచనాలు అందరిలోనూ నెలకొన్నాయి. శ్రీరామ నవమికి ముందే ముఖ్యమంత్రి రేవంత్ భద్రాచలంలో పర్యటించడం వెనుక అభివృద్ధి కోణం దాగి ఉందన్న చర్చ జరుగుతోంది. నిలిచిపోయిన అభివృద్ధిలో వేగం పెంచడంతోపాటు కొత్తగా మరిన్ని నిధులను మంజూరు చేసి భద్రాచల పుణ్య క్షేత్రాన్ని తెలంగాణకే తల మానికంగా రూపుదిద్దాల్సిన ఆవశ్యకత ఉంది. తాజాగా సీఎం భద్రాద్రిపై వరాల జల్లు కురిపిస్తే నిజంగా దక్షిణ అయోధ్యగా చెప్పుకునే భద్రాద్రి రామయ్య సన్నిధి ఆ పేరును సార్ధకం చేసుకుంటుంది.

## ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయండి

### 16, 17 తేదీలలో ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు

### హాజరు కానున్న డిప్యూటీ సిఎం భట్టి, కూనంనేని

**ఖమ్మం ఆర్సి ,మార్చ్ 10 (జనంసాక్షి):**
ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలో జరగనున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని ఈయు నేత తిమ్మినేని రామారావు కోరారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరుగుతున్నాయని ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క,కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఆయన -తెలిపారు. మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి కందుల భాస్కరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిమ్మినేని రామారావు మాట్లాడుతూ రవాణా రంగ అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి మిళితమై ఉంటుందని ప్రజా రవాణా సంస్థలను ప్రభుత్వ రంగ సంస్థలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. రోడ్డు, -రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వాల ప్రాధమిక బాధ్యత అని అన్నారు. ఆర్టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ 2023లోనే మొదలైందన్నారు. కానీ 2019 నుంచి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ల పై ఉక్కు పాదం మోపిందని రామారావు -తెలిపారు. ఈ దశలో కార్మికుల పై యాజమాన్య వేధింపులు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఆర్టిసిలో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరింత పెరిగాయన్నారు. ఆర్టిసిలోని అన్ని విభాగాల సిబ్బంది సమస్యలను ఈ మహాసభలలో చర్చిస్తామన్నారు. -తృతీయ మహాసభలో భట్టి విక్రమార్క, కూనంనేని తో పాటు ఏఐటియుసి నేత వివిఎస్ బోస్, ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, -కార్యదర్శులు ఎస్. బాబు, ఈ, వెంకన్న, జాతీయ నాయకులు పద్మాకర్, ఎపిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు . దామోదర్, నర్సయ్య పాల్గొంటారని రామారావు తెలిపారు. ఆహ్వాన సంఘ సమావేశంలో కోశాధికారి పాటి అప్పారావు, యూనియన్ -నాయకులు జి. మోహన్రావు, వెంకటరెడ్డి, జికె కుమార్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారికి ఆర్థిక సహాయమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

### దేవరకొండ లో మంత్రి కోమటిరెడ్డి సుడిగాలి పర్యటన

### పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





**దేవరకొండ మార్చి 10 జనంసాక్షి :**
ముందుగా మంత్రి దేవరకొండ నియోజకవర్గం, చింతపల్లి సాయిబాబా ఆలయానికి దర్శనానికి రాగా, ఆలయ చైర్మన్ మంచి కంటి ధనుంజయ్,ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.మంత్రి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూభద్రాచలం రామయ్య పాదాల సాక్షిగా ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమాన్ని మొదలు పెడుతున్నామన్నారు. పేదవారికి ఆర్థిక సహాయం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని,పేదవారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి, మంత్రులందరూ 24 గంటలు కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు.ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం, డిండి ప్రాజెక్టులను 3 సంవత్సరాల్లో పూర్తి చేయడమే లక్ష్యం గా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు.దేవరకొండ నియోజకవర్గం లో ఎక్కడ పంచాయతీ రోడ్డు ఉన్న దానిని రోడ్లు మరియు భవనాల రోడ్డుగా మార్చి ప్రతి తండాకు ,గ్రామానికి రోడ్లు వేయించే బాధ్యత తనదని అన్నారు.ఈ ప్రాంత అడవి బిడ్డలకు ఎంత చేసినా తక్కువేనని మంత్రి తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో 2 కిలోమీటర్ల మేర హైదరాబాద్ -నాగార్జునసాగర్ రహదారిని నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో టు వే లైన్ నుండి ఫోర్ వే లైన్ గా వెడల్పు చేసి పటిష్టపరిచే పనుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి దేవరకొండ పట్టణంలో గుట్ట పైన వెలసిన నిర్మాణంలో ఉన్న శ్రీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు, జరుగుతున్న తీరును పరిశీలించారు.పనుల నిర్మాణం, గుట్ట పైకి రహదారి, ఆలయ అభివృద్ధి కి సంబంధించిన విషయాలను ఆలయ కమిటీ మెంబర్లు మంత్రి దృష్టికి తీసుకురాగా, గుట్టపైకి రహదారి మంజూరు తో పాటు, ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తానని మంత్రి తెలిపారు. ఆ తర్వాత మంత్రి డిండి క్రాస్ రోడ్ లో దేవరకొండ మండలం మైనంపల్లి నుండి డిండి క్రాస్ రోడ్ వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు మరియు పటిష్టపరిచే 14 కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ , రోడ్లు మరియు భవనాల శాఖ ఎస్ ఈ రాజేశ్వర్ రెడ్డి , ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేద మహిళకు ఆసరాగా నిలిచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం అర్బన్,మార్చ్ 10 (జనంసాక్షి):**
ఖమ్మం నగరంలోని స్థానిక 46 వడివిజన్ లో నివాసం ఉంటున్న గవ్వల వీరమ్మ తీవ్ర వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న ఆమె వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బాణాల లక్ష్మణ్ ను సంప్రదించగా ఆయన వెంటనే స్పదించి సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లాగా వెంటనే స్పందించిన మంత్రి వారి కుటుంబ పరిస్థితిని అర్దం చేసుకొని %జవీ=ఖీ% ద్వారా ఆపరేషన్ ఖర్చు 2,50,000 రూపాయలు మంజూరు చేయించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గంలో ఎక్కడ ఎవరికి ఏ అపద వచ్చిన స్పందించి ఆదుకొనే విధానం పేదల పట్ల చూపించే పట్టు దల వారి పని తీరుకు నిదర్శనం.ఈ సందర్భంగా %ఖ% కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బాదా పడుతున్న మాకు వైద్యం చేయించుకొలేక చావే శరణ్యం అనుకుంటున్న దశలో దేవుడి రూపం లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదుకున్నారు వారికి ఎల్లప్పుడూ మా కుటుంబం రుణ పడి వుంటుంది.. ఇలాంటి మంత్రి దొరకడం ఈ జిల్లా ప్రజలు అదృష్టంగా భావిస్తున్నాము ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి గారు, డివిజన్ నాయకులు మరాటీ బీరేష్,దయ్యాల నాగేశ్వర రావు,ఏమ్మె రామకృష్ణ, రేగు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు



**పెన్ పహాడ్ మార్చి10 (జనంసాక్షి) :**
మండల పరిధిలోని నాగులపహాడ్ త్రి కోటేశ్వరాలయం వద్ద నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలను ఉత్సవ కమిటీ చైర్మన్ శంకరమద్ది సుధీర్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు స్నేహభావాలతో పాల్గొని క్రీడాశక్తిని చూపాలని కోరారు, ఈ క్రీడలకు 15 టీములు హాజరు కావడం విశేషమని తెలిపారు, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు, ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ ఒగ్గు దేవయ్య, కమిటీ సభ్యులు నిరంజన్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, జానకిరాములు, ఏపూరి నాగేష్, పోగుల జానయ్య, ఒగ్గు శ్రీనివాస్, మీసాల సోమయ్య, శ్రీనివాసు, రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, పీఈటి లు శ్రీనివాస్, మైసయ్య, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు..

## గోపయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**రఘునాథపాలెం , మార్చి 10 ( జనంసాక్షి):**
మండలం బూడిదంపాడు గ్రామానికి చెందిన ఓ డి యఫ్ సంస్థ సీనియర్ ఉద్యోగి గుడిబండ్ల గోపయ్య రోడ్డు ప్రమాదానికి గురై, మరణించారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గోపయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. గోపయ్య కేంద్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కమిటీకి జాతీయ ప్రధాకార్యదర్శిగా అందించిన సేవలను మంత్రి అభినందించారు. డా. బిఆర్ అంబేద్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేసినా వారిలో గోపయ్య ప్రముఖుడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి నరసింహరావు బీసీ సెల్ మండల అద్యక్షుడు మంద గోపి పార్టీ పెద్దలు అంగడపు నరసింహారావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

### జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి, పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన డిప్యూటి సియం మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మంజిల్లా బ్యూరో, మార్చి10(జనంసాక్షి)**
మధిర నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రహదారుల నిర్మాణం పూర్తి చేసి, అన్ని రంగాలలో అభివృద్ధి పర్చడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖా మాత్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఉప ముఖ్యమంత్రి చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాల్లో పర్యటించి, రూ.4318.70 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు నుండి పాతర్లపాడు వరకు రూ. 700.00 లక్షలతో 5.30 కి.మీ మేర నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు, రాఘవాపురం నుండి అల్లీపురం వరకు రూ. 200 లక్షలతో 1.70 కి.మీ. రోడ్డు విస్తరణ పనులకు, రాఘవాపురం నుండి లచ్చగూడెం వరకు రూ. 280.00 లక్షలతో 3.00 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డుకు, రాఘవాపురం నుండి లచ్చగూడెం వరకు రూ. 320.00 లక్షలతో 2.50 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు శంకుస్థాపన, బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో రూ. 20.00 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనమును ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆళ్లపాడు నుండి గోవిందాపురం వరకు రూ. 289.80 లక్షలతో 3.20 కి.మీ. మేర నిర్మించనున్న నూతన బి.టి. రోడ్డుకు, లక్ష్మీపురం నుండి పాతర్లపాడు వరకు రూ. 277.25 లక్షలతో 3.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి రోడ్డుకు, కలకోట నుండి నారాయణపురం వరకు రూ. 85.00 లక్షలతో 5.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు ఉప ముఖ్యమంత్రి శంఖుస్థాపనల చేశారు. రూ. 422.15 లక్షలతో గోవిందాపురం నుండి మోటమర్రి వరకు 4.60 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు, రూ. 539.50 లక్షలతో ఆళ్లపాడు నుండి నారాయణపురం 5.00 కి.మి. మేర నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు, అనంతరం ముదిగొండ మండలం వనంవారి క్రిష్ణాపురం గ్రామంకు చేరుకొని గోకెనపల్లి వెంకటాపురం చిరుమర్రి వనంవారి క్రిష్ణాపురం జగన్నాదపురం ఆర్.అండ్.బి. రోడ్డు విస్తరణ పనులకు ఆయన శంఖుస్థాపనలు చేశారు. రూ. 4318.70 లక్షల వ్యయంతో 44.10 కి.మీ. మేర నిర్మించనున్న బి.టి. రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధిర నియోజకవర్గం అన్ని మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి రవాణా వ్యవస్థను మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లడం జరుగుతుందని, అర్హులైన పేద వారందరికి అభయహస్తం సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. అనంతరం చింతకాని మండలంలో పాత్రికేయుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ. రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని సహచర మంత్రివర్యులతో కలిసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. నియోజవర్గానికి 3500 ఇండ్ల చొప్పున ప్రతి నియోజకవర్గానికి ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 12వ తేదీన మరో బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం, సంక్షేమ పథకాలపై పాత్రికేయుల సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్యాంప్రసాద్, పంచాయితీరాజ్ ఎస్.ఈ. చంద్రమౌళీశ్వరరావు, ఖమ్మం ఆర్.డి.ఓ. జి.గణేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## 7 ఐపీఓలు.. 8 లిస్టింగ్‌లు

వచ్చేవారం మెయిన్ బోర్డు విభాగంలో రెండు కంపెనీలు ఐపీఓకి రానున్నాయి. ఐదు సంస్థలు ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో పబ్లిక్ ఇష్యూ ప్రారంభించనున్నాయి.మరోవైపు మెయిన్‌బోర్డులో మూడు, ఎస్ఎంఈలో ఐదు కంపెనీల షేర్లు లిస్ట్ కానున్నాయి. మొత్తంగా ఏడు ఐపీఓలు, ఎనిమిది లిస్టింగ్‌లు ఈవారం దలాల్ స్ట్రీట్‌ను బిజీగా మార్చనున్నాయి.ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కంపెనీ క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ఐపీఓ మార్చి 14న ప్రారంభమై 18న ముగియనుంది. రూ.175 కోట్లు విలువ చేసే కొత్త షేర్లతో పాటు 17.5 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించనుంది. రిటైల్ మదుపర్లకు 35 శాతం షేర్లను కేటాయించారు. షేరు ధరల శ్రేణిని ఇంకా ప్రకటించాల్సి ఉంది.వాహన డీలర్‌షిప్ కార్యకలాపాల్లో నిమగ్నమైన పాపులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు సెబీకి దరఖాస్తు చేసుకుంది. రూ.250 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 1.42 కోట్ల షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ధరల శ్రేణిని రూ.280-295గా నిర్ణయించింది. రిటైల్ మదుపర్లు రూ.14,750తో కనీసం 50 షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ ఐపీఓ మార్చి 12 నుంచి 14 వరకు జరగనుంది.ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ మార్చి 15 నుంచి 19 వరకు కొనసాగనుంది. ధరల శ్రేణిని రూ.137-144గా నిర్ణయించింది. మదుపర్లు కనీసం 1,000 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.189 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఏవీపీ ఇన్‌ఫ్రాకాన్ ఐపీఓ మార్చి 13న ప్రారంభమై 16 వరకు జరగనుంది. షేరు ధరల శ్రేణిని రూ.71-75గా నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.52.34 కోట్లు సమీకరించనుంది. పూర్తిగా కొత్త షేర్లను మాత్రమే జారీ చేయనుంది.ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్, కమిషనింగ్ సర్వీసెస్ ప్రొవైడర్‌గా ఉన్న ప్రథమ్ ఈపీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ మార్చి 11న ప్రారంభం కానుంది. 13 వరకు బిడ్లు దాఖలు చేయొచ్చు. పూర్తిగా కొత్త షేర్లను మాత్రమే జారీ చేస్తోంది. రూ.36 కోట్లు సమీకరించనుంది. షేరు ధరల శ్రేణిని రూ.71-75గా నిర్ణయించింది.రూ.9.28 కోట్ల సమీకరణ లక్ష్యంతో సిగ్నోరియా క్రియేషన్ ఐపీఓకి వస్తోంది. ఈ పబ్లిక్ ఇష్యూ మార్చి 12న ప్రారంభమై 14న ముగియనుంది. పూర్తిగా కొత్త షేర్లను మాత్రమే జారీ చేస్తోంది.




# టెస్లా కోసం నిబంధనలు మార్చం

**• పీయూష్ గోయల్**






దిల్లీ: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా కోసం భారత్ నిబంధనల్లో మార్పులు చేయబోదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులు భారత్‌లో ప్లాంట్లు నెలకొల్పేందుకు అనుకూలంగా కేంద్రం చట్టాలను రూపొందించిందని చెప్పారు. చాలా కాలంగా భారత మార్కెట్లోకి అడుగుపెట్టాలని భావిస్తున్న టెస్లా సంస్థ.. దిగుమతి సుంకంలో రాయితీ కోరుతోంది. అయితే, ఇతర కంపెనీలకు ఇవ్వని ప్రాధాన్యం టెస్లాకు మాత్రమే ఇవ్వడం సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. తాజాగా దీనిపై పీయూష్ గోయల్ మరోసారి స్పష్టత ఇచ్చారు."ఈవీల ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తించింది. వాటితో కాలుష్యం, చమురు దిగుమతులు తగ్గుతాయి. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఇందుకోసం ఏదో ఒక కంపెనీకి అనుకూలంగా నిబంధనల్లో మార్పులు చేయలేం. యూరప్ సహా అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలకు చెందిన సంస్థలతో పలు అంశాల్లో చర్చలు జరుపుతున్నాం. భారత్‌లో పెట్టుబడి పెట్టే సంస్థలు తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసే స్వేచ్ఛ ఉంటుంది. అయితే, వాటికనుగుణంగా ప్రభుత్వం తప్పనిసరిగా నిర్ణయం తీసుకుంటుందని భావించకూడదు. భవిష్యత్తులో అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మారే సత్తా భారత్‌కు ఉంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తుంది"అని గోయల్ తెలిపారు.ప్రస్తుతం భారత్‌లో 40,000 డాలర్లు (దాదాపు 29.75 లక్షలు) లేదా అంతకంటే తక్కువ విలువ ఉన్న విద్యుత్తు వాహనాలపై ప్రభుత్వం 60 శాతం దిగుమతి సుంకం విధిస్తోంది. 40,000 డాలర్ల కంటే ఎక్కువ ధర ఉన్న విద్యుత్తు వాహనాలపై దిగుమతి సుంకం 100 శాతంగా ఉంది. అంటే, అమెరికాలో రూ.34 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న కార్లన్నీ భారత్‌లో రెట్టింపు ధరకు అందుబాటులో ఉంటాయి. దీన్ని 70 శాతానికి పైగా తగ్గించాలని టెస్లా కోరుతోంది. ముందుగా భారత్‌లో కొంతకాలంపాటు కార్లను దిగుమతి చేసి విక్రయిస్తామని, ప్రజల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా తయారీ యూనిట్‌ను నెలకొల్పుతామని చెబుతోంది. ఇలా చేయడం వల్ల ఇతర కంపెనీలకు ఇవ్వని ప్రయోజనాలను టెస్లాకు కల్పించినట్లు అవుతుందని, దీనివల్ల మిగతా సంస్థలకు తప్పుడు సంకేతాలు వెళతాయని కేంద్రం భావిస్తోంది.

| | ఒకటి | వందకు |
|---|---|---|
| **నెక్ గుడ్ల ధరలు** | | |
| హైదరాబాద్ | ₹4.10 | ₹410 |
| వరంగల్ | ₹4.12 | ₹412 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹66,270 | ₹60,750 |
| చెన్నై | ₹67,100 | ₹61,500 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹79,100

## భలే మంచి ఈవీ బేరం



రేటు ఎక్కువ ఉందని వెనకాడినవారే ఎక్కువ. అయితే ఇపుడు పరిస్థితి మారుతోంది. ఇటీవలి దాకా విద్యుత్తు ద్విచక్ర వాహన ధరను రూ.1-1.5 లక్షల వరకు విక్రయించాయి. అదే సమయంలో పెట్రోలు స్కూటర్లు, మోటార్‌సైకిళ్లు రూ.1 లక్ష దరిదాపుల్లోనే లభిస్తున్నాయి. దీంతో విద్యుత్తు వాహనాల అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తూ వచ్చాయి. ఇపుడు విద్యుత్తు ద్విచక్ర వాహన కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఒక్కో వాహనంపై రూ.25,000 వరకు రాయితీ ఇస్తున్నాయి. ఓలా ఎలక్ట్రిక్ తన ఎస్1 శ్రేణి స్కూటర్ల ధరను రూ.25,000 వరకు తగ్గించింది. ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్, ఎస్1 ఎక్స్+ వాహనాలకు ఈ తగ్గింపు వర్తిస్తోంది. దీనివల్ల రూ.79,999 నుంచి రూ.1,29,999 షోరూమ్ ధరకు ఈ వాహనాలు లభిస్తున్నాయి. హీరో మోటోకార్ప్ అనుబంధ విడా కూడా తమ స్కూటర్ల ధరలను తగ్గించింది. విద్యుత్తు కార్ల కంపెనీలూ ఇదే బాట పట్టడం ఆసక్తికర అంశం. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా, ఎంజీ మోటార్స్.. తదితర సంస్థలు తమ విద్యుత్తు కార్ల ధరలను స్వల్పంగా తగ్గించాయి.విద్యుత్తు వాహనాల ధరలు దిగిరావడానికి 'టెక్నాలజీ మార్పులు, అధిక సంఖ్యలో వాహనాలు ఉత్పత్తి చేస్తున్నందున వ్యయాలు తగ్గడం' వంటివి ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. విద్యుత్తు వాహనాల తయారీ, వినియోగాన్ని పెంచేందుకు అమలు చేస్తున్న ఫేమ్- 2 సబ్సిడీ గడువు ఈ నెలాఖరుతో తీరిపోతోంది. కేంద్రం ప్రభుత్వం ఈ పథకం కింద రూ.7,048 కోట్లు కేటాయించింది. విద్యుత్తు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల కొనుగోలుదార్లకు రాయితీ ఇచ్చేందుకు ఈ నిధులు ఉపకరిస్తున్నాయి. గడువు లోపు ఈ సబ్సిడీ వల్ల ప్రయోజనం పొందే లక్ష్యంతో విద్యుత్తు వాహనాల తయారీ సంస్థలు కూడా ఇప్పుడు వాహనాల ధర తగ్గింపునకు సిద్ధపడుతున్నాయి. తమ వాహనాల నిల్వలను మార్చి నెలాఖరు లోగా ఖాళీ చేసేందుకు దీన్నొక అవకాశంగా భావిస్తున్నాయి. ఈ పరిణామాలు వినియోగదార్లకు మేలు చేస్తున్నాయి. తక్కువ ధరలో విద్యుత్తు వాహనాన్ని సొంతం చేసుకునే వీలు కలుగుతోంది.

## రిలయన్స్‌తో డీల్‌తో మాకు మేలే

**బాబ్ ఐగర్**

దిల్లీ: భారత్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో కుదిరిన ఒప్పందం రెండు సంస్థలకు లాభాన్ని చేకూర్చుతుందని వాల్ట్ డిస్నీ సీఈవో బాబ్ ఐగర్ తెలిపారు.ఈ ఒప్పందం వినోద రంగంలో ఒక పెద్ద సంస్థ ఏర్పాటుకు అవకాశం కల్పించడంతోపాటు మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలబెడుతుందన్నారు. మోర్గాన్ స్టాన్లీ ఇన్వెస్టర్స్ సదస్సుల్లో పాల్గొన్న ఆయన విలీనంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."21 సెంచరీ ఫాక్స్ కొనుగోలు తర్వాత భారత్‌లో మా సంస్థ పెట్టుబడులు పెట్టింది. దీంతో దేశంలోని అతిపెద్ద మీడియా సంస్థల్లో మేం ఒకరిగా ఉన్నాం. ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన దేశం కావడంతో భారత్‌లో కొనసాగాలని ఆశిస్తున్నాం. కానీ, అందుకు మార్కెట్లో కొన్ని సవాళ్లు అధిగమించాలి. ఈ క్రమంలోనే రిలయన్స్‌తో ఒప్పందం చేసుకునే అవకాశం లభించింది. అతిపెద్ద మీడియా సంస్థలో వాటాను సొంతం చేసుకోవడం ద్వారా మార్కెట్‌లో రెండు సంస్థలు అగ్రస్థానంలో ఉంటాయి. రిలయన్స్‌తో భాగస్వామ్యం మాకు ఎంతో మేలు చేస్తుంది. దాంతోపాటు నష్ట భయం తగ్గుతుంది" అని ఐగర్ వ్యాఖ్యానించారు.రిలయన్స్ - వాల్ట్ డిస్నీల ఒప్పందం విలువ రూ.70,352 కోట్లు. ఈ మొత్తంతో ఇరు సంస్థలు జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా రిలయన్స్ సంస్థ సంయుక్త సంస్థలో రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీంతో స్టార్ ఇండియా నుంచి ఎనిమిది భాషల్లో 70 ఛానళ్లు, రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18 నుంచి 38 ఛానళ్లు కలిపి మొత్తం 120 టెలివిజన్ ఛానళ్లు ఒకే గొడుకు కిందకు రానున్నాయి. ఇవి కాకుండా డిస్నీ హాట్‌స్టార్, జియోసినిమా పేరుతో రెండు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఉండనున్నాయి. ఈ మీడియా వెంచర్‌కు ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

## 'ట్రూడో'కు షాక్

### సర్వేల్లో సంచలన ఫలితాలు



ఒట్టావా: కెనడాలో ప్రధాని జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పోస్ట్ మీడియా కోసం ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో 70 శాతం మంది ట్రూడో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతతో ఉన్నట్లు తేలింది.దేశంలో పాలన సరిగా లేదని 60 శాతం మంది ట్రూడో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిలో 43 శాతం మంది 2021 ఎన్నికల్లో ట్రూడో ప్రభుత్వానికి ఓటు వేసిన వారే కావడం గమనార్హం.దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, పెరిగిపోతున్న జీవన ఖర్చు, ఆరోగ్య రంగం, ప్రజల ఇళ్లు కొనుగోలుచేసే శక్తి వంటి అంశాల వచ్చే ఏడాది (2025) జరిగే సాధారణ ఎన్నికల్లో ట్రూడోకు వ్యతిరేకంగా పనిచేయనున్నట్లు చెబుతున్నారు. కాగా, నాన్ ప్రాఫిట్ అంగుస్ రెడ్ సంస్థ(ఏఆర్ఐ) నిర్వహించిన సర్వేలోనూ కేవలం 17 శాతం మంది మాత్రమే ట్రూడో తిరిగి ప్రధాని అవ్వాలని కోరుకుంటున్నారు. 28 శాతం మంది 'నన్ ఆఫ్ ద అబోవ్' ఆప్షన్‌ను ఎంచుకున్నారు.ఈ సర్వేలో కన్జర్వేటివ్ నేత పియెర్రే పోలీవర్ పట్ల మాత్రం కాస్త మెరుగైన స్పందన వచ్చింది.

## ఆస్ట్రేలియాలో హైదరాబాద్ యువతి దారుణ హత్య

మెల్‌బోర్న్(జనంసాక్షి):ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం బక్‌లేలో దారుణ ఘటన జరిగింది. హైదరాబాద్ ఏఎస్ రావునగర్‌కు చెందిన వివాహిత చైతన్య మదగాని అలియాస్ శ్వేత శనివారం హత్యకు గురైంది.చైతన్యను చంపిన దుండుగులు ఆమె మృతదేహాన్ని రోడ్డు పక్కన చెత్త డబ్బాలో పారేశారు.హత్యకు సంబంధించి సెకండ్ క్రైమ్ సీన్‌ను పాయింట్ కుక్‌లోని మిర్కా వేలో ఉన్న చైతన్య ఇంట్లో పోలీసులు రీ క్రియేట్ చేశారు. అయితే హత్య చేసిన వాళ్లు చైతన్యకు తెలిసిన వాళ్లేనని పోలీసులు చెబుతున్నారు. ఆమెను చంపినతర్వాత దుండగులు వేరే దేశానికి పారిపోయారని తెలిపారు. హత్య చేసిన వారికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించారు. కాగా, శ్వేత భర్త, మూడేళ్ల కొడుకు హైదరాబాద్ వచ్చేశారు.

# రైల్వేలో కొలువుల జాతర

### 9,144 ఉద్యోగాలు.. దరఖాస్తులు షురూ




దిల్లీ: నిరుద్యోగులకు గుడ్‌న్యూస్. ఇటీవల 5 వేలకు పైగా అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరించిన రైల్వే శాఖ..తాజాగా మరో భారీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసింది. 9,144 రైల్వే టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దేశవ్యాప్తంగా 21 ఆర్ఆర్‌బీల ద్వారా భర్తీ చేసే ఈ ఉద్యోగాలకు ఏప్రిల్ 8 రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే ఏప్రిల్ 9 నుంచి 18 వరకు సరిచేసుకునేందుకు అవకాశం కల్పించారు. **పోస్టుల వివరాలు:** మొత్తం 9,144 ఉద్యోగాలు ఉండగా.. వీటిలో టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ 1092 పోస్టులు కాగా.. టెక్నీషియన్ గ్రేడ్ 3 ఉద్యోగాలు 8,052 వయో పరిమితి: జులై 1,2024 నాటికి టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు 18 నుంచి 36 ఏళ్లు. గ్రేడ్ 3 పోస్టులకు 18 నుంచి 33 ఏళ్లు మించరాదు. ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్/దివ్యాంగులు.. ఆయా కేటగిరీల వారికి వయో సడలింపు కల్పించారు. దరఖాస్తు రుసుం రూ.500. కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాసిన తర్వాత రూ.400 రిఫండ్ చేస్తారు. ఎస్సీ/ఎస్టీ/ఎక్స్‌స ర్వీస్‌మెన్/మహిళలు/థర్డ్‌జెండర్/మైనార్టీలు/ఈబీసీలు రూ.250 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష తర్వాత ఈ మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఈ పోస్టులకు ఎంపిక చేస్తారు. వేతనం: టెక్నీషియన్ గ్రేడ్ -1 సిగ్నల్ పోస్టులకు ఏడో సీపీసీలో లెవెల్ -5 కింద ప్రారంభ వేతనంగా రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్ -3 పోస్టులకు లెవెల్ -2 కింద రూ.19,990 చొప్పున చెల్లిస్తారు. టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఉండాల్సిన విద్యార్హతలు, వయో పరిమితి, జోన్‌ల వారీగా పోస్టుల సంఖ్య, పరీక్ష ప్యాట్రన్, సిలబస్ తదితర పూర్తి వివరాలు ఈ కింది నోటిఫికేషన్‌లో చూడొచ్చు.

## ఉద్ధవ్ ఠాక్రేపై కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ మండిపాటు



దిల్లీ: ఉద్ధవ్ ఠాక్రేపై కాంగ్రెస్ నాయకుడు సంజయ్ నిరుపమ్ మండిపడ్డారు. మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడి(ఎంవిఎ) కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతుండగా ముంబై వాయువ్య లోక్‌సభ నియోజకవర్గానికి అభ్యర్థిని ఠాక్రే ముందుగానే ప్రకటించడాన్ని సంజయ్ తప్పుబట్టారు. శివసేన(యుబీటీ), ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం), కాంగ్రెస్‌ల సంకీర్ణమైన ఎంవీఏలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయి.ముంబై నార్త్-వెస్ట్ నియోజకవర్గానికి శివసేన అభ్యర్థిగా అమోల్ కీర్తికర్‌ను ప్రకటించడం వివాదానికి కారణమైంది. నిరుపమ్ ఆశిస్తున్న ముంబై నార్త్-వెస్ట్ సీటుపై కూటమిలో ఎలాంటి నిర్ణయానికి నేతలు ముందుకు రాలేదు.అయినా శివసేన ప్రకటనపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కొవిడ్ సమయంలో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వలస కార్మికులకు ఉచిత ఆహారం అందించడానికి ప్రారంభించిన 'ఖిచిడీ స్కామ్'లో అమోల్ కీర్తికర్ హస్తంఉందని, నిరుపేదల కోసం ప్రారంభించిన పథకంలో అవినీతికి పాల్పడ్డారని నిరుపమ్ ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) దీనిపై దర్యాప్తు చేస్తోంది. కుంభకోణంలో చిక్కుకున్న వ్యక్తిని అభ్యర్థిగా నిలబెడితే కాంగ్రెస్, శివసేన(యుబిటి) కార్యకర్తలు వారి గురించి ఎలా ప్రచారాలు చేస్తారు అని ప్రశ్నించారు.

## మనీలాండరింగ్‌లో లాలూ సన్నిహితుడి అరెస్టు



**పట్నా:** బిహార్‌లో ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సన్నిహితుడు, పార్టీ నేత సుభాశ్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ శనివారం రాత్రి అరెస్టు చేసింది.బ్రాడ్సన్స్ కమోడిటీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సుభాశ్ యాదవ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ- చలానాలను ఉపయోగించకుండా ఇసుక అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ కంపెనీతో సహా అతడిపై 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కంపెనీ చేపట్టిన ఇసుక తవ్వకాలు పర్యావరణ నిబంధలనలకు విరుద్ధమని అందులో పేర్కొంది. సిండికేట్‌లతో ఈ దందాను నడిపిస్తున్నారని.. దీనిలో సుభాశ్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి.వీటి ఆధారంగా పట్నా సమీపంలోని దనపుర్‌లో ఉన్న సుభాశ్ నివాసం సహా ఆరు చోట్ల ఈడీ సోదాలు నిర్వహించింది. 14 గంటల పాటు జరిపిన సోదాల్లో రూ. 2 కోట్లకు పైగా డబ్బుతో పాటు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడైన సుభాశ్‌ను అరెస్టు చేశారు. ఇసుక అక్రమ విక్రయాల ద్వారా రూ. 161 కోట్ల కుంభకోణం జరిగినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలోనే ఇటీవల శాసన మండలి సభ్యుడు రాధా చరణ్ సాహ్, అతడి కుమారుడు అరెస్టు అయ్యారు.

# జాతీయం అంతర్జాతీయం

జనంసాక్షి

## యుద్ధరంగ స్వరూపం మారుతోంది

**వాయుసేన చీఫ్ వీఆర్ చౌధరి**

చెన్నై: కొత్తగా వస్తున్న సాంకేతికత, పోరాట వ్యూహాల కారణంగా యుద్ధ రంగంలో మౌలికమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని వాయుసేన అధిపతి ఎయిర్‌చీఫ్ మార్షల్ వీఆర్ చౌధరి అన్నారు.చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శనివారం జరిగిన యువ అధికారుల శిక్షణానంతర కవాతుకు ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. "భారతదేశం ప్రస్తుతం అనేక కోణాల్లో భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిని నిలువరించడానికి మనం విభిన్న అంశాల్లో పూర్తి సామర్థ్యాన్ని సంతరించుకోవాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా స్వల్పకాల వ్యవధిలో ఒకేసారి పలు సైనిక చర్యలను నిర్వహించగల నైపుణ్యాన్ని కలిగి ఉండాలి" అని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టాలని యువ అధికారులకు సూచించారు. ఆదర్శ వృత్తిని ఎంచుకున్నారంటూ వారిని కొనియాడారు. సైనిక చరిత్ర, అంతర్జాతీయ వ్యవహారాల అధ్యయనం ద్వారా..ఎప్పటికప్పుడు మారుతున్న సంక్లిష్ట ప్రపంచంపై అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 184 మంది పురుష, 36 మంది మహిళా అధికారులు పాల్గొన్నారు. వీరు ఓటీఏలో శిక్షణ పూర్తిచేసుకొని, భారత సైన్యంలోని వివిధ విభాగాల్లో చేరారు. వీరితోపాటు మిత్రదేశాలకు చెందిన 9 మంది క్యాడెట్లకూ శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

## పండుగ వేళ పాకిస్తానీలకు కొత్త కష్టాలు..



ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభానికి ముందే పాకిస్తాన్‌లో కూరగాయలు, పాలు, పంచదార, వంటనూనెలు, నెయ్యి, మాంసం, గుడ్లు, పప్పుల ధరలు మూడు రెట్ల మేరకు పెరిగాయి.దీంతో బడుగు, మధ్య ఆదాయవర్గాల వారు పలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం పాకిస్తాన్‌లో కేజీ ఉల్లి ధర రూ. 150 (పాకిస్తానీ రూపాయిలు) నుండి 300 రూపాయలకు పెరిగింది. అయితే కొంతమంది విక్రేతలు తగ్గింపు ధరలో కిలో రూ. 250 చొప్పున విక్రయిస్తున్నారు. బంగాళదుంప ధర కేజీ 50 పీకేఆర్ నుండి 80 రూపాయలకు పెరిగింది. క్యాబేజీ ధర కిలో 100 పీకేఆర్ నుండి 150 పీకేఆర్‌కు పెరిగింది. పచ్చిమిర్చి కిలో 200 పీకేఆర్‌ల నుంచి 320 రూపాయలకు పెరిగింది. క్యాప్సికం కూడా కిలో 400 పీకేఆర్‌లకు చేరింది.సాధారణంగా రంజాన్ మాసంలో పండ్ల విక్రయాలు పెరుగుతాయి. చిన్న సైజు అరటి పండ్ల ధర డజను 80 పీకేఆర్‌ల నుంచి 120 రూపాయలకు పెరిగింది. మంచి నాణ్యమైన పెద్ద అరటిపండ్లు డజన్‌కు 200 పీకేఆర్‌లకు విక్రయిస్తున్నారు.



## స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్న పూర్వ విద్యార్థులు..

- 50 ఏళ్ల జ్ఞాపకాలు మా మదిలో పదిలం..
- 'ఖని' ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పూర్వ విద్యార్థులు..

గోదావరిఖని, మార్చి 10, (జనంసాక్షి) :
గోదావరిఖని నెహ్రూ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల 1972-74 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం గోదావరిఖని రెడ్డి భవన్‌లో ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు డాక్టర్ నవీన్‌కుమార్, నాగేంద్రగుప్తా, ఎన్.రాములు, బండారి విజయ్‌కుమార్, పుట్ట సాంబయ్య, జాన్ సామిల్ సమన్వయంతో 50 ఏళ్ల తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కె.రామసుధాకర్‌రాజు, పి.రామకృష్ణారావు, పీరయ్య, హేమలతను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడ్డప్పటికీ నాటి జ్ఞాపకాల స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొనడానికి సుమారు 30మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

## షెడ్యూల్డ్ కులాల.. జాతీయ కమీషన్ సభ్యులుగా రాంచందర్..



**గోదావరిఖని, మార్చి 10, (జనంసాక్షి) :**
షెడ్యూల్డ్ కులాల జాతీయ కమీషన్ సభ్యులుగా గోదావరిఖని రాంనగర్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకులు వడ్డెపల్లి రాంచందర్ నియామకమయ్యారు. ఈ అత్యుత్తమ పదవీకి రాంచందర్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో రాంచందర్ నియామక పత్రం అందుకున్నారు. రాంచందర్ నియామకం పట్ల బీజేపీ శ్రేణులు, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత నేతకు అత్యున్నత పదవీ రావడం గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. రాంచందర్ బీజేపీలో అంచలంచెలుగా ఎదిగారు. బీజేపీ బలోపేతానికి ఆయన కృషి చేశారు. పార్టీ, ప్రజల్లో రాంచందర్‌కు మంచి గుర్తింపు ఉంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాంచందర్‌కు సముచిత స్థానం కల్పించడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని నరేంద్రమోడీ కృతజ్ఞతలు తెలిపారు.



## 'ఖని'లో ఆగిన ఆసుపత్రి భూమిపూజ..

గోదావరిఖని, మార్చి 10, (జనంసాక్షి) :
స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.142.00 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన జీ+3 , 350 పడకల ఆసుపత్రికి భూమిపూజ ఆదివారం జరుగాల్సి ఉంది. అయితే అర్ధాంతరంగా ఆగిపోయింది. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అనివార్య కారణాలతో హాజరుకాకపోవడంతో ఈ భూమిపూజ వాయిదాపడినట్టు తెలిసింది. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందసింగ్ ఆధ్వర్యంలో భూమిపూజకు వైద్య సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో మంత్రి రావడంలేదని భూమి పూజ కార్యక్రమం ఆగిపోయిందని తెలియడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. షెడ్యూల్డ్ ప్రకారం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడమేకాకుండా..ఆసుపత్రి సిబ్బంది, పాత్రికేయులు, ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రి పర్యటన రద్దు కావటంతో భూమిపూజ కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నట్టు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ ప్రకటించారు. త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## బావుసాయిపేట గ్రామంలో విషాదం

**విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు..**

**ఆస్పత్రికి చేరుకొన్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్ పర్సన్ అరుణ..**







**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 10 (జనంసాక్షి):**
కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బోరు బావిలో పైపులు దించుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు, ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తిక్కల భూమయ్య అనే రైతు పొలంలోని బోరు బావిలో అదనపు పైపు వేసేందుకు ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన పంబాల భూమయ్య, పంబాల రాజు, కర్ణాల మహేష్, తుపాకుల శ్రీనివాస్ అనే నలుగురు దినసరి కూలీలు వెళ్లారు. ఈ క్రమంలో పైప్ ను పైకి లేపి బోరులో దించుతున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు పైప్ తాకి ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో భూమయ్య(35) అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ముగ్గురు తీవ్ర గాయాలపాలవ్వగా, స్థానికులు వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించిగ వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

**హుటాహుటిన తరలివచ్చిన ఎమ్మెల్యే..**
ప్రమాద విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన కరీంనగర్ పర్యటనను మధ్య లోనే వాయిదా వేసుకొని ఏరియా ఆసుపత్రికి వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించి ఓదార్చాడు. ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాడు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన భూమయ్య ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తరపున కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చాడు.

**బాధితులను పరామర్శించిన జడ్పీ చైర్ పర్సన్..**
విద్యుత్ షాక్ కు గురై ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జడ్పీ చైర్ పర్సన్ అరుణ-రాఘవ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి తదితరులు పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## రూ.6.5కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

**- అభివృద్ధే నా లక్ష్యం.. ప్రజా సంక్షేమమే నా ఎజెండా.. - రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**గోదావరిఖని, మార్చి 10, (జనంసాక్షి) :**
రూ. 6.5కోట్లతో అభివృద్ధి పనులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా.. ప్రజాక్షేత్రంలో సుపరిపాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో నిధుల కొరతతో సతమతమవుతున్న రామగుండం నియోజకవర్గానికి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తీసుకవచ్చామన్నారు. రామగుండం కార్పొరేషన్‌కు అలాగే నియోజకవర్గానికి ఆయా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నిధులను రాబట్టామని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు పట్టణ ప్రగతి, డిఎంఎఫ్‌టి, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటుగా, సిడిపి నిధులతో రూ. 6.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. రామగుండం కార్పొరేషన్‌తో పాటు నియోజకవర్గానికి పారిశ్రామిక ప్రాంతానికి కర్షక ప్రాంత అభివృద్ధికి కార్యసాధకునిలాగా నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని మక్కాన్ అన్నారు. ప్రజా సంక్షేమమే నా ధ్యేయమని, ప్రజా అభివృద్ధి నా లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీ



ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. పేదలకు ఆరోగ్య భీమా రూ. 10లక్షలతో పాటు రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నా మన్నారు. అలాగే నేటి నుంచి ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి పథకం ప్రారంభించ బోతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు, రామగుండం కార్పొరేషన్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు, ఆయా విభాగాల అధ్యక్షులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై.. సీఎండీ బలరాంతో చర్చించిన బీఎంఎస్..



గోదావరిఖని, మార్చి 10, (జనంసాక్షి) :
సింగరేణి పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏబీకేఎంఎస్-బీఎంఎస్) సింగరేణి వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన కార్మికులకు మెరుగైన సేవలు అందించటానికి బొగ్గు పరిశ్రమల ఇంచార్జి, సీఎం పిఎఫ్ ట్రస్టీ బోర్డ్ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, మంద రమకాంత్ 06.05.2023న,తేది 09.03.2024న అప్పటి డైరెక్టర్-పా ఇప్పటి సీఅండ్ఎండీ బలరాంనాయక్‌ను కలిసి సింగరేణి వ్యాప్తంగా పదవీవిరమణ పొందిన కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికులు చాలామంది, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, హనుమకొండ వంటి నగరాలలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అటువంటి కార్మికులు వైద్యం, మందుల నిమిత్తం ప్రతినెల వారు పనిచేసిన ఏరియాలకు ప్రయాణించి మందులు తీసుకోవడం కార్మికులకు ఆర్థికంగా, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని ఫార్మసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే దీనిపైన ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ నెల 9న చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి చర్చించామన్నారు. తక్షణమే కార్మికులకు కరీంనగర్, వరంగల్, హనుమకొండ, హైదరాబాదులోనే మందులు తీసుకోవడానికి ఫార్మసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా పదవీవిరమణ పొందిన కార్మికులు సింగరేణి పెన్షనర్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషిని గుర్తించాలని పేర్కొన్నారు. నిరంతరం విశ్రాంత కార్మికుల కొరకు పోరాడుతూనే ఉంటుందని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బూర్ల లక్ష్మీనారాయణ, మంద రమాకాంత్ తెలిపారు.



## మంత్రి పొన్నంకు ఆత్మీయ సన్మానం..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 10 (జనంసాక్షి).**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఆదివారం కరీంనగర్లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ గోపా సభ్యులు మంత్రిని శాలువాతో సన్మానించి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులానికి చెందిన పొన్నం ప్రభాకర్ గౌడ్ రాష్ట్ర మంత్రి పదవి పొందడం తమకు గర్వకారణంగా ఉందన్నారు రేణుక మాత ఆశీస్సులతో మరిన్ని పదవులు ఆయన అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ గోపా అధ్యక్షులు దూలం సంపత్ గౌడ్, సభ్యులు పొన్నం రవిచంద్ర గౌడ్, బత్తిని ఎల్లగౌడ్, పలువురు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంతో తిరుపతి గౌడ్...



**శంకరపట్నం, మార్చి 10(జనం సాక్షి):**
తెలంగాణ రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్ ఆత్మీయతను పంచుకున్నారు. ఆదివారం కరీంనగర్లో గౌడ కులస్తులు నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆత్మీయ సన్మానంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తిరుపతి గౌడ్ ను హక్కుల చేర్చుకునే ఆత్మీయతను పంచినట్లు తిరుపతి గౌడ్ తెలిపారు.

## రూ. 2.50 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :**
మంథని నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలం కలవచర్ల గ్రామానికి చెందిన రోడ్ లక్ష్మి కి కిడ్నీ సమస్య కి సంబంధించిన అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు సహాయం కొరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను సంప్రదించగా వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు ఆదివారం వీరికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి మంజూరు పత్రాలను అందజేశారు. రెండు లక్షల యాభై వేల రూపాయలు మంజూరు చేపించి తమకు అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



## మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఎంపిక పత్రాలను అందజేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



**మంథని,( జనంసాక్షి) :**
ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలుపుతూ, జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఎంపిక పత్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అందజేశారు. ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మంథనిలోని నృసింహ శివ కిరణ్ గార్డెన్స్ లో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (టి.ఎస్.-ఎస్.టి.ఇ.పి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో గల ఉన్న ఉపాధి అవకాశాలు తెలియజేస్తూ అర్హులైన వారికి వెంటనే ఉద్యోగం కల్పించే దిశగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు మెగా జాబ్ మేళాను జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి,జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో నిర్వహించామని అన్నారు. ఐటి, ఫార్మా, నిర్మాణ రంగం, మార్కెటింగ్ మొదలగు వివిధ రంగాలకు చెందిన 65 కంపెనీలు మెగా జాబ్ మేళాలో పాల్గొన్నాయని, కంపెనీలలో గల ఉద్యోగ అవకాశాల ప్రకారం 7వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని అన్నారు. మెగా జాబ్ మేళా వినియోగించుకుంటూ యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను సాధించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ మెగా జాబ్ మేళాలో ఏర్పాటు చేసిన కంపెనీల స్టాళ్లను పరిశీలించి ఎంపికైన అభ్యర్థులకు ఎంపిక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.వై.ఎస్.ఓ-ఎ.సురేష్ ,జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు, మంథని ఎంపీపీ కొండ శంకర్, రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య,ధ్రువ్ కన్సల్టింగ్ సర్వీసెస్ చైర్మన్ మన్మోహన్, సిబ్బంది, సంబంధిత అధికారులు,నాయకులు, పలు కంపెనీల హెచ్ఆర్ లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడి విషయములో అధిష్టానం పునరాలోచన..





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 10 (జనంసాక్షి):**
వేములవాడ బిఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అనూహ్య సంఘటనల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నెల 7 న జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో పార్టీ ఆదేశాలను ధిక్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపారనే కారణంతో పార్టీకి చెందిన అయిదుగురు కౌన్సిలర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సస్పెండ్ చేస్తున్నట్లు శనివారం ప్రకటన విడుదల చేశాడు. ప్రకటన విడుదలైన కొన్ని గంటల వ్యవధిలోనే సస్పెండైన కౌన్సిలర్లు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారి వాదనలు వినిపించారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైనట్లు తెలుస్తోంది. సస్పెండైన అయిదుగురిలో కేవలం ముగ్గురు మాత్రమే మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ పరిణామం కొత్త చర్చకు దారి తీసింది. హాజరు కాని మిగతా ఇద్దరి విషయంలో పార్టీ యూ టర్న్ తీసుకున్నట్లు, అందుకే వారివురు సమావేశంలో పాల్గొనలేదనే వాదనలు వినిపించాయి. అందరూ ఊహించనట్లుగానే ఇద్దరి విషయంలో కాదు గానీ 2వ వార్డ్ కౌన్సిలర్ రెండుమిద్దల జయ-సలీమ్ విషయంలో మాత్రం పార్టీ యూ టర్న్ తీసుకున్నట్లు తెలుస్తుంది. వీరి విషయంలో అధిష్టానం పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన జయ సలీం సస్పెండైన అందరి కౌన్సిలర్లతో పోలిస్తే రాజకీయ చరిత్ర వేరు 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడిగా సలీమ్ కొనసాగుతున్నాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైన, ఎన్నెన్నో ఆర్థిక ఇబ్బందులు సవాళ్లు విసిరినా, ఎత్తిన జెండా దించలేదు, ఎవరెన్ని ఆశలు చూపినా కప్పుకున్న కండువాను మార్చలేదు. ఇలా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి గత 23 ఏండ్లుగా సలీమ్ పార్టీలో కొనసాగుతున్నా అతడిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఒక్కసారిగా ప్రకటన రావడంతో వేములవాడ ప్రజలతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు.

**మంతనాలు జరిపిన జిల్లా అధ్యక్షుడు...**
సలీమ్ సస్పెన్షన్ విషయంలో జరుగుతున్న చర్చ ఆనోటా ఈ నోట పార్టీ అదిష్టానం దృష్టికి వెళ్ళింది. దీంతో ఒక నిఖార్సయిన ఉద్యమకారుడిని, పార్టీ అభ్యున్నతి కొరకు అంకిత భావంతో పనిచేసే వ్యక్తిని, ఎవరో చెప్పిన మాటలు విని దూరం చేసుకుంటే పార్టీకి భారీ నష్టం జరుగుతుందని, ఇది త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని పార్టీ అదిష్టానం గ్రహించినట్లుంది. వెంటనే సలీమ్ ను లైన్లో పెట్టె పనిలో పడింది. అనుకున్నదే తడవుగా ఎవరైతే ప్రకటన విడుదల చేశారో మళ్ళీ అదే వ్యక్తిని సలీమ్ తో మంతనాలు జరపాలని, దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు, పార్టీ అదిష్టానం ఆదేశాల మేరకు తోట ఆగయ్య సలీమ్ తో ఇప్పటికే మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ పార్టీని వీడేది లేదు, జెండా దించేది లేదని పరాయి పార్టీకి వెళ్ళేది లేదని,మరోవైపు ఈ అన్ని పరిణామాలపై సలీమ్ స్పందించాడు. 2001 నుండి ఇప్పటివరకు రెండు దశాబ్దాలకు పైగా పార్టీ అభ్యున్నతి కొరకు, అధినేత కేసీఆర్ పై అభిమానంతో, ఆయన అడుగుజాడల్లో గులాబీ జెండా నీడన పని చేస్తున్నానరు .నన్ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తే ఊరుకునేది లేదని, ఎవరేం చేసిన పార్టీని, పార్టీ జెండాను వీడేది లేదని, పరాయి పార్టీ జెండా పట్టేది లేదన్నారు. జీవితం మొత్తం గులాబీ పార్టీకి, గులాబీ జెండాకే అంకిత మన్నారు. పార్టీకి సంబంధించిన కీలక నేత తనతో మంతనాలు జరిపిన మాట వాస్తవమేనని,ఇంకా వారికి ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆయన చెప్పటం కొసమెరుపు.



## సీఎస్కే క్యాంప్‌లో ధోనీ..

### సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చిన అభిమాని

ఐపీఎల్ కెప్టెన్లలో మహేంద్ర సింగ్ ధోనీకి ఉన్న క్రేజ్ తెలిసిందే. మహీ భాయ్ ఎక్కడ ఆడినా.. స్టేడియమంతా 'ధోనీ.. ధోనీ' నినాదాలతో మార్మోగిపోవాల్సిందే. టీమిండియా రోజుల నుంచి అభిమానుల మనసు గెలిచిన ధోనీ.. ఐపీఎల్‌తో ఫాలోవర్స్ సంఖ్యను అమాంతం పెంచుకున్నాడు. ఐపీఎల్ 17వ సీజన్ కోసం సన్నాహక క్యాంప్‌లో ఉన్నమిస్టర్ కూల్ కెప్టెన్‌కు ఒక అభిమాని సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చాడు. విష్ణువు అవతారమైన 'నాయణుడి విగ్రహా'న్ని బహుమతిగా ఇచ్చాడు. ప్రస్తుతం ఆ ఫొటో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. టీమిండియా సారథిగా మూడు ఐసీసీ ట్రోఫీలు కట్టబెట్టిన ధోనీ.. ఐపీఎల్‌లోనూ తన మార్క్ చూపించాడు. నిరుడు చెన్నైకి ఐదో టైటిల్ అందించిన ధోనీ కెరీర్‌లో చివరి సీజన్‌కు సిద్ధమవుతున్నాడు. ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికల ప్రీ-వెడ్డింగ్ కార్యక్రమం అనంతరం ధోనీ సీస్కే ట్రైనింగ్ క్యాంప్‌లో చేరాడు.

చెన్నైలోని చిదంబరం స్టేడియంలో బ్యాటింగ్ ప్రాక్టీస్‌తో సహచరుల్లో ఉత్సాహం నింపాడు. మార్చి 22 నుంచి 17వ సీజన్ ఆరంభం కానుంది. తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఢీకొట్టనున్నాయి.

## ఢిల్లీ వర్సెస్ బెంగళూరు..

### గెలిచినోళ్లకు ప్లేఆఫ్స్ బెర్త్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నేడు కీలక మ్యాచ్ ఆడబోతున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంటుంది. ఇరుజట్లకూ నేటి పోరు కీలకమే. రెండో సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి ఇప్పటికే ఐదింటిలో నెగ్గిన ముంబై ఇండియన్స్.. 10 పాయింట్లతో అగ్రస్థానంతో పాటు ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. కాగా ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగు నెగ్గి రెండింట్లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్.. 8 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. నేటి మ్యాచ్ గెలిస్తే ఢిల్లీ ప్లేఆఫ్స్ బెర్త్‌తో పాటు తిరిగి అగ్రస్థానాన్ని దక్కించుకుంటుంది. ముంబై కంటే ఢిల్లీ నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉండటమే ఇందుకు కారణం. ఇక ఆరు మ్యాచ్‌లలో మూడు గెలిచి మూడింట ఓడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఆరు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. నేటి మ్యాచ్‌లో గెలవడం ఆ జట్టుకు అత్యంత కీలకం.




# ముంబై, ఢిల్లీ ఖరారు..

## మిగిలిన మూడు జట్లలో ప్లేఆఫ్స్ చేరెదెవరు..?

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) గ్రూప్ దశ పోటీలు చివరి అంకానికి చేరాయి. లీగ్ దశలో శనివారం గుజరాత్ జెయింట్స్ - ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన పోరుతో ఈ లీగ్‌లో 16 మ్యాచ్‌లు ముగిశాయి. నాలుగు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న ఈ స్టేజ్‌లో ముంబై ఇండియన్స్ ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ (మరో మ్యాచ్ గెలిస్తే చాలు) కూడా దాదాపు ప్లేఆఫ్స్ చేరినట్టే. మరి నాకౌట్ దశకు చేరే మూడో జట్టు ఏది..? యూపీ వారియర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఈ మూడు జట్లలో ప్లేఆఫ్స్ వెళ్లేదెవరు..? ఏ జట్టుకు అక్కడికి వెళ్లడానికి అవకాశాలు ఏవిధంగా ఉన్నాయి.

### గుజరాత్ జెయింట్స్..

శనివారం గుజరాత్.. ముంబైపై 190 పరుగులు చేసినా ఓటమి తప్పలేదు. హర్మన్ ప్రీత్ కౌర్ దంచికొట్టడంతో గుజరాత్ ఓటమిపాలైంది. దీంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరే గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరు మ్యాచ్‌లు ఆడి ఒక్కటి మాత్రమే గెలిచి రెండు పాయింట్లతో ఉన్న గుజరాత్.. ప్లేఆఫ్స్ చేరాలంటే తర్వాత ఆడబోయే రెండు మ్యాచ్‌లలో గెలవడంతో పాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆడాల్సి ఉన్న మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఓడిపోవాలి.

### యూపీ వారియర్స్..

గత సీజన్‌లో ప్లేఆఫ్స్ వరకూ వెళ్లగలిగిన యూపీ ఈసారి ఏడు మ్యాచ్‌లు ఆడి మూడింట్లో గెలిచి నాలుగు ఓడింది. ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మాత్రమే ఆడనున్న ఆ జట్టుకు ప్లేఆఫ్స్ అవకాశాలు తక్కువే. ఒకవేళ యూపీ.. తర్వాత మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించినా ప్లేఆఫ్స్ చేరాలంటే ఆర్సీబీ ఆడాల్సి ఉన్న తర్వాత రెండింట్లోనూ ఒకదాంట్లో ఓడిపోవాలి.

### రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..

ఆర్సీబీ ఈ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి మూడు గెలిచి మూడింట ఓడింది. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉన్న ఆర్సీబీ.. తమ తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్‌లను ఢీకొనుంది. ఈ రెండింట్లో ఏదో ఒకటి అయితే కచ్చితంగా నెగ్గాలి. ఆర్సీబీ.. ఈ రెండు మ్యాచ్‌లలో ఏదో ఒకదాంట్లో గెలిచినా గుజరాత్ జెయింట్స్ కథ ముగిసినట్టే.

## మిడిలార్డర్‌లో హిట్టు.. ఓపెనర్‌గా ఫట్టు..

అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ అభిమానులు ఫ్యాబ్ - 4 గా పిలుచుకునే ఆటగాళ్లలో ఒకడైన స్టీవ్ స్మిత్‌కు శతాధిక టెస్టులు ఆడిన అనుభవం ఉంది. మిడిలార్డర్‌లో అతడు దిగ్గజ బౌలర్లకు సైతం కొరకరాని కొయ్య. ఆస్ట్రేలియా టెస్టు జట్టులో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే స్మిత్.. క్రీజులో పాతుకుపోయాడంటే ఔట్ చేయడం కష్టం. కానీ ఇదంతా నిన్నా మొన్నటి ముచ్చట. ఇప్పుడు కథ వేరు. డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్‌తో స్మిత్ కెరీర్ కూడా ముగిసే దిశగా పయనిస్తోంది. వార్నర్ భాయ్ స్థానంలో టెస్టులలో ఓపెనర్‌గా వస్తున్న స్టీవ్ స్మిత్.. ఇప్పటివరకూ నాలుగు టెస్టులలో 8 ఇన్నింగ్స్‌లు ఆడి దారుణంగా విఫలమవుతున్నాడు.

## యూపీ స్టార్ ప్లేయర్లకు భారీ షాక్..

### నిబంధనలను ఉల్లంఘించినందుకు జరిమానా

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా ఆడిన ఏడు మ్యాచ్‌లలో మూడు గెలిచి నాలుగింట్లో ఓడి ప్లేఆఫ్స్ రేసులో ఉన్న యూపీ వారియర్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టులో ఉన్న స్టార్ ప్లేయర్లు సోఫీ ఎకిల్‌స్టోన్, కిరణ్ నవిగిరెలు డబ్ల్యూపీఎల్ నిబంధనలను అతిక్రమించినందుకు గాను వాళ్ల మ్యాచ్ ఫీజులలో భారీ కోత పడింది. డబ్ల్యూపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం.. ఈ ఇద్దరూ ఆర్టికల్ 2.2 నిబంధనలను ఉల్లంఘించారు. దీంతో ఈ ఇద్దరికీ వాళ్ల మ్యాచ్ ఫీజులో పది శాతం కోత విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రెండ్రోజుల క్రితం యూపీ వారియర్స్.. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఇద్దరూ ఆర్టికల్ 2.2 లోని లెవల్ 1 నేరానికి పాల్పడ్డారని డబ్ల్యూపీఎల్ ఓ ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. మ్యాచ్ జరుగుతున్న సమయంలో సహచర క్రికెటర్లను దూషించడం గానీ క్రికెట్ సామాగ్రిని ధ్వంసం చేయడం గానీ వంటివి నేరం కిందకే వస్తాయి.

ఢిల్లీతో రెండ్రోజుల క్రితం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముగిసిన మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ.. 19.5 ఓవర్లలో 137 రన్స్ వద్దే ఆగిపోయింది. 19వ ఓవర్ ప్రారంభానికి ముందు వరకూ 128-7గా ఉన్న ఢిల్లీ.. రెమడు రూములు వచ్చేసరికి 137 రన్స్‌కు ఆలౌట్ అయింది. దీంతో యూపీ ఒక్క పరుగు తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందుకుంది.

## సొంత అభిమానుల మధ్య బంగ్లాదేశ్ పరువు తీసిన లంకేయులు

ప్రపంచ క్రికెట్‌లో దాయాదుల (భారత్-పాకిస్తాన్) మధ్య జరిగే మ్యాచ్‌ల స్థాయిలో కాకున్నా గత నాలుగైదేండ్లుగా మరో రెండు ఆసియన్ క్రికెట్ టీమ్స్ అయిన శ్రీలంక - బంగ్లాదేశ్‌లు ఇదే వైరాన్ని పెంచుకుంటున్నాయి. ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్యలు, అన్నాతమ్ముళ్ల పంచాయితీ ఏంలేకున్నా ఇరు జట్ల ఆటగాళ్లు పదే పదే కవ్వించుకుంటూ వాళ్ల శత్రుత్వాన్ని పెంచుకుంటున్నారు. తాజాగా బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న శ్రీలంక ఆటగాళ్లు.. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను గెలుచుకున్న తర్వాత బంగ్లా క్రికెట్ టీమ్‌ను దారుణంగా ట్రోల్ చేశారు. 'టైమ్డ్ ఔట్' సెలబ్రేషన్స్‌తో బంగ్లా ఆటగాళ్లను ఆటాడుకున్నారు. వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా లంక - బంగ్లా మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక ఆటగాడు ఏంజెలో మాథ్యూస్ 'టైమ్డ్ ఔట్' విధానంలో మొట్టమొదటిసారిగా ఔట్ అయిన క్రికెటర్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

ఇరు జట్ల మధ్య శనివారం ముగిసిన మూడో టీ20లో లంక 28 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది.




మ్యాచ్ ముగిసి ట్రోఫీని పట్టుకుని ఫోటోలకు ఫోజిచ్చే వేళ లంక క్రికెటర్లంతా చేతికి వాచీ పెట్టుకునే దగ్గర వేళ్లు పెట్టి 'టైమ్డ్ ఔట్' సెలబ్రేషన్స్ చేసుకున్నారు. ఇది బంగ్లా ఆటగాళ్లను ట్రోల్ చేయడానికే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు.

## శార్దూల్ ఆల్‌రౌండ్ షో..

### తొలి రోజే ట్విస్టులతో మొదలైన రంజీ ఫైనల్




రంజీ ట్రోఫీ ఫైనల్స్‌లో 41 సార్లు ఛాంపియన్ ముంబైని తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌట్ చేశామన్న ఆనందం విదర్భకు ఎంతోసేపు నిలువలేదు. తొలి రోజు మూడో సెషన్‌లో ఆ జట్టు కూడా మూడు కీలక వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. 13 ఓవర్ల ఆటే ఆడినా విదర్భ.. ఓపెనర్ ధ్రువ్ షోరే, అమన్ మోఖడెతో పాటు కరుణ్ నాయర్ వికెట్లను కోల్పోయింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ.. 13 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 31 రన్స్ చేసింది. ఇంకా ఆ జట్టు 193 పరుగుల ఆధిక్యంలో ఉంది.ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరుగుతున్న ఫైనల్‌లో భాగంగా టాస్ గెలిచి ముంబైని మొదట బ్యాటింగ్‌కు ఆహ్వానించిన విదర్భ సారథి అక్షయ్ వాడ్కర్ నమ్మకాన్ని జట్టు బౌలర్లు నిలబెట్టారు. ముంబై ఓపెనర్లు పృథ్వీ షా (46), భూపెన్ లల్వానీ (37)లు తొలి వికెట్‌కు 81 పరుగులో జోడించినప్పటికీ ఈ ఇద్దరూ ఔట్ అయ్యాక ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. ముషీర్ ఖాన్ (6), అజింక్యా రహానే (7), శ్రేయస్ అయ్యర్ (7) విఫలమయ్యారు.

## ఎస్ఎస్ఎంబీ 29పై హింట్ ఇచ్చేసిన మహేశ్ బాబు..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్‌బాబు అభిమానుల ఫోకస్ అంతా ఇప్పుడు ఎస్ఎస్ఎంబీ 29 పైనే ఉంది. గుంటూరు కారం సక్సెస్ తర్వాత జక్కన్న, మహేశ్‌బాబు గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ గురించి నెట్టింట తెగ వెతికేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎస్ఎస్ఎంబీ 29 మూవీ హాలీవుడ్ రేంజ్‌కు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుందని ఇప్పటివరకు వచ్చిన వార్తలు చెబుతున్నాయి. మహేశ్ బాబు సినిమాలతోపాటు యాడ్స్‌కు కూడా సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. కూల్ డ్రింక్ మౌంటెయిన్ డ్యూను ప్రమోట్ చేస్తున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

## త్రిషకు చిరంజీవి ఖరీదైన కానుక



సిల్వర్ స్క్రీన్‌పై స్టాలిన్ సినిమాతో తొలిసారి సందడి చేశారు చిరంజీవి , త్రిష. ఈ ఇద్దరూ మళ్లీ 18 ఏండ్ల తర్వాత విశ్వంభర సినిమాతో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి డైరెక్ట్ చేస్తున్నాడు. కాగా ఎప్పుడెప్పుడు చిరుతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటానా..? అని ఎదురుచూస్తున్న త్రిష కు ఆ రోజు రానే వచ్చింది. ఇవాళ హైదరాబాద్‌లో జరుగుతున్న విశ్వంభర షూటింగ్‌లో జాయిన్ అయింది త్రిష.

అంతేకాదు ఈ సందర్భంగా చిరు నుంచి ఓ ప్రత్యేకమైన కానుకను అందుకుంది త్రిష.ఈ విషయాన్ని తెలియజేస్తూ తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందరితో షేర్ చేసుకుంది. ఉష్ణోగ్రతను నియంత్రించే స్మార్ట్ మగ్‌ను త్రిషకు బహుమానంగా అందించారు. చాలా ఖరీదైంది.. ఉష్ణోగ్రతను కంట్రోల్ చేసే నా స్మార్ట్ మగ్. చిరు సార్.. ధన్యవాదాలు అంటూ క్యాప్షన్ పెట్టింది. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఆర్ఆర్ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో డిజిటల్ వ్యూస్ రాబడుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. పురాణాలు ఢీకొట్టినప్పుడు లెజెండ్స్ ఉద్భవిస్తారు.. అనే క్యాప్షన్ పోస్టర్‌లో కనిపిస్తుండగా.. చిరు స్టైలిష్ వాక్‌తో కొత్త ప్రపంచంలోకి వెళ్తున్నట్టుగా ఉన్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది.

## రాణి రుక్మిణి దేవిగా రీతూవర్మ..

కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ తెలుగు ప్రేక్షకుల ముందు వినోదాన్ని అందించే ప్రయత్నంలో ఎప్పుడూ ముందుండే హీరో శ్రీ విష్ణు. ఇటీవలే తన పుట్టినరోజు సందర్భంగా కొత్త ప్రాజెక్టు స్వాగ్ అప్‌డేట్ కూడా అందించాడు. ఈ మూవీలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. నేడు రీతూవర్మ బర్త్ డే సందర్భంగా ఈ భామ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు. వింజామర వంశపు రాణి రుక్మిణీ దేవిగా రాజసం ఉట్టిపడేలా రాయల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. మగ అహంకారానికి మహారాణి గారి సమాధానం..రాజులని తలదన్నే మా వింజామర వంశ మహారాణి రుక్మిణీదేవికి జన్మదిన శుభాకాంక్షలు.. అంటూ మేకర్స్ లాంచ్ చేసిన లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. జీఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్ కాగా.. నందు మాస్టర్ స్టంట్ కొరియోగ్రఫర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ చిత్రం చారిత్రక నేపథ్యం ఉన్న శ్వాగణిక వంశం కథ అని మేకర్స్ ఇప్పటికే ప్రకటించేశారు. స్వాగ్ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ మూవీకి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నాడు. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్. శ్రీ విష్ణు ప్రస్తుతం ఓ భీమ్ బుష్ అంటూ ఓ సినిమాలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో ప్రియదర్శి పులికొండ, రాహుల్ రామకృష్ణ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ ఎంఆర్ సంగీత అందిస్తున్నాడు.



## విశాల్ రత్నం ఫస్ట్ సింగిల్



తెలుగు, తమిళంలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న యాక్టర్లలో ఒకడు విశాల్ . ఎప్పుడూ ఏదో ఒక సినిమా అప్‌డేట్‌తో అభిమానులు, మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తుంటాడు విశాల్. ఈ హీరో ప్రస్తుతం విశాల్ 34 తో బిజీగా ఉన్నాడు. రత్నం టైటిల్‌తో తెరకెక్కుతుంది. ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్ లుక్‌లో.. లారీలో నుంచి ఆవేశంతో దిగిన విశాల్ కత్తి చేత పట్టి శత్రువులను చీల్చి చెండాడుతున్న స్టిల్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. తాజాగా మేకర్స్ రత్నం ఫస్ట్ సింగిల్ విడుదల చేశారు. వివేక రాసిన ఈ పాటను డీఎస్పీ కంపోజిషన్‌లో స్వయంగా పాడాడు. ఈ పాట నెట్టింటిని షేక్ చేస్తోంది. రత్నం ఇంట్రెస్టింగ్ లుక్, ఫస్ట్ షాట్ వీడియో గూస్ బంప్స్ తెప్పిస్తూ సినిమాపై క్యూరియాసిటీ అంచనాలు పెంచుతోంది. ఇక విశాల్ 34 అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో చుట్టూ గన్స్, కత్తులు కనిపిస్తూ.. మధ్యలో స్టెతస్కోప్ ఉన్న లుక్ మాస్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. విశాల్ కెరీర్‌లో మొదటి సారి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్‌తో కలిసి పనిచేస్తుండటం విశేషం. డీఎస్పీ జర్నీతో డిజైన్ చేసిన విశాల్ 34 వీడియో ఒకటి ఇప్పటికే ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తోంది.

మాస్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న రత్నం సినిమాకు హరి దర్శకత్వం వహిస్తున్నాడు. భరణి, పూజ సినిమాల తర్వాత హరి-విశాల్ కాంబోలో మూడో సినిమా కావడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. రత్నంలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. సముద్రఖని, యోగిబాబు, గౌతమ్ వాసు దేవ్ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్-జీ స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతోంది. మరోవైపు తుప్పరివాలన్2 కూడా విశాల్ ఖాతాలో ఉంది.

## వకీల్ సాబ్ భామ రియాక్షన్!

ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ టాపిక్ తెరపైకి రావడం కొత్తేమీ కాదు. టాలీవుడ్, కోలీవుడ్ , బాలీవుడ్‌తోపాటు ఇతర ఇండస్ట్రీల నుంచి ఎవరో కాస్టింగ్ కౌచ్ అంశం గురించి మాట్లాడుతుంటారు. మల్లేశం సినిమాతో హీరోయిన్‌గా బ్రేక్ అందుకుంది తెలుగు భామ అనన్య నాగళ్ల . ఆ తర్వాత పవన్ కల్యాణ్ నటించిన వకీల్ సాబ్‌లో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. అనన్య నాగళ్లను ఈ అంశం గురించి అడుగగా.. అదృష్టవశాత్తు తనకెప్పుడు కాస్టింగ్ కౌచ్ అనుభవం ఎదురుకాలేదని చెప్పింది.లుగు ఇండస్ట్రీలో చాలా కాస్టింగ్ కౌచ్ ఉందని విన్నా. కానీ ఎవరూ అలాంటి ప్రవర్తనతో తన దగ్గరకు రాలేదని చెప్పుకొచ్చింది. మొదల సంప్రదాయ లుక్‌లో మెరిసిపోయిన ఈ బ్యూటీ ఆ తర్వాత సోషల్ మీడియాలో బోల్డ్ అవతార్‌లో కనిపిస్తూ.. నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అనన్య నాగళ్ల ప్రస్తుతం టైటిల్‌తో తెరకెక్కుతున్న హార్రర్ డ్రామాలో నటిస్తోంది. మార్చి 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ధనుష్ రఘుముద్రి, టెంపర్ వంశీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు



## సైతాన్ ప్రమోషన్స్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా జ్యోతిక..

స్టార్ యాక్టర్లు అజయ్ దేవ్‌గన్, ఆర్ మాధవన్, జ్యోతిక లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం సైతాన్ . వికాస్ బెహల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 08న ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలైన అన్ని థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. ఈ మూవీ నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్, ట్రైలర్ విడుదల చేశారు. కాగా సైతాన్ ప్రమోషనల్ ఈవెంట్‌లో జ్యోతిక బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో మెరుపులు మెరిసింది.

మరోవైపు సూర్య కూడా బ్లాక్ ప్యాంట్, టీ షర్టులో సందడి చేస్తూ.. కెమెరాకు ఫోజులిచ్చాడు. ఈ ఫొటోలు, వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. వెకేషన్ కోసం మారుమూల గ్రామానికి వెళ్లిన అజయ్ దేవగన్ కుటుంబం, మాధవన్, బ్లాక్ మ్యాజిక్ అంశాల చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కింది.. జియో స్టూడియోస్ సమర్పణలో అజయ్ దేవగన్, జ్యోతి దేశ్‌పాండే, అభిషేక్ పాఠక్ ఈ సినిమాను సంయక్తంగా నిర్మించారు. గుజరాతీ హారర్ థ్రిల్లర్ 'వష్' రీమేక్‌గా వచ్చి మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తుంది.

## అమావాస్య రోజు అన్నదానం ఎంతో పుణ్యం



- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : అమావాస్య రోజు అన్నదానం ఎంతో పుణ్యమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, రామంతపూర్‌లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో, మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం, మేడిపల్లి వద్ద జరిగిన అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, విచ్చేసి, అమావాస్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రతి నెల దాదాపు 500 మందికి భోజనాలు పెట్టడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. అమావాస్య రోజున ఆకలితో ఉన్నవారికి, నిరుపేదలకు అన్నదానం చేయడం, నిత్యావసర వస్తువులను దానం చేయడం వల్ల ఎంతో పుణ్యం వస్తుందని, ఈరోజు అమావాస్య సందర్భంగా అన్నదానం కార్యక్రమం చేస్తున్న వారి సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు పాండయ్య గుప్త, జనరల్ సెక్రటరీ, ట్రెసరర్ మరియు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు,ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ బోనగిరి శ్రీనివాసులు గుప్త, ఐవీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్,మేడిపల్లి ఆర్య వైశ్య సంఘం నాయకులు శ్రీధర్ గుప్త ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి

- వేతన సవరణతో మరింత బాధ్యత పెరిగింది
- ఉద్యోగులకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ దిశానిర్దేశం
- మిగతా పెండింగ్ సమస్యలను ప్రభుత్వ సహకారంతో పరిష్కరిస్తామని హామీ
- 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులతో వర్చ్‌వల్‌గా ముఖాముఖి



హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ కోరారు.తమ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మూడు నెలలుగా ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ కోసం ఉన్నతాధికారులు కసరత్తు చేశారని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తోన్న పీఆర్సీ కల సాకరమైన ఈ సందర్భంగా చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. 2017 వేతన సవరణలో భాగంగా 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ బస్ భవన్ నుంచి క్షేత్రస్థాయి సిబ్బందితో టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వర్చువల్‌గా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి యాజమాన్యం పెద్ద పీటవేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో పెండింగ్‌లో ఉన్న ప్రతి అంశాన్ని సంస్థ పరిష్కరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. టీఎస్‌ఆర్టీసీ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ.. సిబ్బంది సంక్షేమ విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీ పడటం లేదని, రెండున్నర ఏళ్లుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని గుర్తు చేశారు. సిబ్బందికి ఇప్పటివరకు 9 డీఏలను సంస్థ చెల్లించిందని, అన్ని కేటగిరీలలో పదోన్నతులు కూడా కల్పించిందని తెలిపారు. ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య వైద్య సేవల్ని అందించేందుకు తార్నాకలోని టీఎస్‌ఆర్టీసీ ఆసుపత్రిని కార్పొరేట్ తరహాలో ఆధునీకరించామన్నారు. 50 వేల మంది ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పేరుతో వైద్యపరీక్షలు నిర్వహించామని, దీని వల్ల గుండెసంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 300 మందిని ప్రాణాప్రాయం నుంచి కాపాడామని వివరించారు. ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చే పెండింగ్ లో ఉన్న రూ.280 కోట్ల బాండ్ల మొత్తాన్ని ప్రభుత్వ సహకారంతో చెల్లిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాల్లో మరణించిన సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు యుబిఐ సహకారంతో కోటి రూపాయలకు పైగా ఉచిత ప్రమాద బీమాను వర్తింపజేశామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకాన్ని 48 గంటల్లోనే అమలులోకి తీసుకువచ్చి.. మహిళలకు ఉచిత ప్రయాణం సజావుగా సాగుతుండటంలో సిబ్బంది కృషి ఎనలేనిదన్నారు. 90 రోజులుగా 25 కోట్ల మంది మహిళలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చారని తెలిపారు. మేడారం లాంటి జాతరలను విజయవంతం చేశారని గుర్తుచేశారు. సిబ్బంది సమిష్టి కృషితో పనిచేయడం వల్లే జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐదు నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్ పోర్టు ఎక్స్‌లెన్స్ అవార్డులను సంస్థ సాధించగలిగిందన్నారు. సంస్థ మీద నమ్మకం, విశ్వాసంతో తీసుకువచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, ఇప్పుడు అదే నమ్మకాన్ని కొనసాగిస్తూ ఆదర్శమైన పబ్లిక్ రంగ సంస్థగా టీఎస్‌ఆర్టీసీని తీర్చిదిద్దేందుకు సిబ్బంది అంతా తోడ్పాడుతారనే గట్టి విశ్వాసం తనకుందని ఆయన అన్నారు.ఈ వర్చువల్ సమావేశంలో సీవోవో డాక్టర్ రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీటీఎం(ఆపరేషన్స్) జీవన ప్రసాద్, సీటీఎం(కమర్షియల్) శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తు ఖరారు

- రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- సీట్ల పంపిణీపై స్పష్టత,త్వరలోనే ప్రకటన
- పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తాయని వెల్లడి




హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : తెలంగాణలో బీఎస్పీ,బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి అనుమతి లభించిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని ప్రకటించారు. బీఎస్పీ–బీఆర్ఎస్ పార్టీల కూటమి చర్చలపై రాష్ట్రంలో ఏర్పడిన సందిగ్ధానికి బెహన్జీ మాయావతి కొద్ది సేపటి క్రితమే తెరదించారని ఆయన వివరించారు.రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఎన్డీయే,ఇండియా కూటమిలో లేనందున ఆ పార్టీతో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేయడానికి పార్టీ హై కమాండ్ అనుమతించిందని తెలిపారు.రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ,బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు వివరించారు. బీఎస్పీ, బీఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేసే స్థానాలపై త్వరలోనే సంయుక్త ప్రకటన ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగే తదుపరి చర్చలకు పార్టీ రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ బెహన్జీ దూతగా హాజరుకానున్నారని తెలిపారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచర ణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామన్నారు.బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులపై మీడియాలో వస్తున్న నిరాధారమైన వార్తలు, వదంతులు, దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు,ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.



## బైంసా డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

బైంసా, మార్చ్ 10 (జనం సాక్షి) : నిర్మల్ జిల్లా బైంసా డిపోలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పిట్ మెంట్ ప్రకటినందుకు గాను బైంసా డిపో ఆర్టీసీ ఉద్యోగులకు స్వీట్ లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్సీ రావటానికి ప్రయత్నించిన సంస్థ ఎండి సజ్జనార్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉప ముఖ్య మంత్రి దామోదర రాజనరసింహకి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఉద్యోగులందరూ రుణ పడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఎఫ్ చందు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సంఘాలతో సీఎం సమావేశం



హైదరాబాద్, మార్చి 10 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమావేశ మయ్యారు. ఆదివారం ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రొ. కోదండరాం తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ నర్సస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్ రూడవత్ పాల్గొన్నారు. నర్సింగ్ డైరెక్టరేట్ ట్రెజరీ సాలరీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగాలకు కనీస సౌకర్యాలు నర్సింగ్ ఆఫీసర్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో కరువు పరిస్థితులు

- చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలి
- గోదావరి జలాలను ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్





రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, మార్చి 10 (జనంసాక్షి) : పదేళ్ల కాలంలో ఎన్నడూ కాని విధంగా భూగర్భజలాలు బావులు, బోర్లు అడుగంటుతున్నాయని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కరెంటు షాక్ కు గురై వేములవాడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రి మార్చురీలో పంబాల భూమేష్ మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రైతులు బోరు బావుల్లో పైపులు దించుతున్నారని, పొలాన్ని ఎలాగైన కాపాడుకోవాలని ఓ రైతు బోరు బావిలో కూలీలను పెట్టి పైపులు దింపిస్తున్న క్రమంలోనే బావుసాయి పేట కు చెందిన పంబాల భూమేష్ కరెంటు కాటుకు బలయ్యాడని, మరో ముగ్గురు బాధితులు పంబల రాజు, కర్ణాల శ్రీను, కర్ణాల మహేష్‌లు గాయపడ్డారని తెలిపారు. పదేళ్ల కాలంలో ఎన్నడూ కూడా చెరువులు, కుంటలు ఎండలేదని రైతులకు పుష్కలంగా నీళ్లు ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగినాయనే సాకుతో నీళ్లు పంపింగ్ చేయకపోవడంతో భూగర్భజలాలు లేక రైతులు బోర్లలో పైపులు దింపితే నీళ్లు వస్తాయనే ఇలా చేస్తున్నరని అన్నారు. ప్రభుత్వం వెంటనే మేడిగడ్డ బ్యారేజ్ కు మరమ్మతులు చేసి గోదావరి జలాలను ఎత్తిపోయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మృతుడు భూమేష్ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడంతో పాటు మానవత దృక్పథంతో మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోర్లలో పైపులు దింపేప్పుడు పైన కరెంటు తీగలు ఉంటే జాగ్రత్తగా దింపాలని సూచన చేశారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ వెంట మాజీ పౌరసరఫరాల శాఖ చైర్మన్ రవిందర్ సింగ్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సెస్ డైరెక్టర్ తిరుపతి, మార్క్ ఫేడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, వేములవాడ. మున్సిఫల్ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, కుమార్, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రాజు, మాజీ సర్పంచ్ గంగాధర్, జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రావు, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

## ఎక్కడైతే స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు

- అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి..
- మరో మదర్ థెరిస్సా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా
- మంత్రి సీతక్క



ములుగు ప్రతినిధి, మార్చి 10(జనంసాక్షి) : ఎక్కడైతే స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.ములుగు జిల్లా కేంద్రంలో సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ గా ఉద్యోగం చేస్తూ సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవ చేస్తూ మానవత్వాన్ని చాటుతున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా కు అభినందనలు తెలుపుతూ ఈ రోజు ములుగు జిల్లా కేంద్రములో మహిళా దినోత్సవ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషదాయ కమని అన్నారు. సమాజంలో మహిళ లేకుండా సృష్టి లేదు, కానీ మగవాళ్ల భావజాలం మార్చాల్సిన అవసరం ఉంది, ఎక్కడైతే స్త్రీలు పూజలం దుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని చెబుతారు. సమస్యలకు పారిపోకుండా ఎదుర్కోవాలి, అప్పుడే మనకంటూ ఓ విజయం ఉంటాది. మనమంటూ ఓ చరిత్రలో నిలబడతామన్నారు. మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే సమాజం సరికాదన్న ఆమె, ఒకనాడు మాతృస్వామిక సమాజం నుంచి నెమ్మదిగా పితృస్వామ్యం దిశగా పరిస్థితులు మారాయన్నారు. మహిళా దినోత్సవ స్ఫూర్తిని అందిపుచ్చుకొని అతివలంతా ఆర్థికంగా బలంగా మారడంతో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లోనూ ఉన్నత స్థానాలకు చేరాలని మంత్రి వర్యులు సీతక్క ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలతో పాటు మహిళా సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల అధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన సన్మానం





కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (జనం సాక్షి) : కరీంనగర్ లో ఆదివారం బొమ్మకల్ బైపాస్ రోడ్ లోని వి కన్వెన్షన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ గౌడ్ ని ఘనంగా సన్మానించారు. అదే విధంగా గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాన్ని అడ్డుపెట్టి తెలంగాణ బిల్లు ఆమోదం కోసం కృషి చేసిన వ్యక్తి పొన్నం ప్రభాకర్ అని ఇలాంటి వ్యక్తికి మంత్రిగా అవకాశం రావడం పట్ల ఒక సాధారణ గీత కార్మిక కుటుంబంలో పుట్టి అత్యున్నత స్థాయికి ఎదగడం పట్ల వారు కొనియాడారు. పొన్నం ప్రభాకర్ విద్యార్థి దశ నుండి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ఎదిగిన వ్యక్తి అని ఉమ్మడి రాష్ట్రంలో మార్క్ఫెడ్ చైర్మన్ గా, పార్లమెంట్ సభ్యునిగా, 42 మంది పార్లమెంట్ సభ్యులకు కన్వీనర్‌గా, వ్యవహరించి అనేక పదవులను అలంకరించి కరీంనగర్‌లో పాస్ పోర్ట్ కేంద్రకార్యాలయం, ఎఫ్ ఎం రేడియో స్టేషన్, కేంద్రీయ విద్యాలయం, రైల్వే లైన్ పునరుద్ధరణ పనులు, తిరుపతికి ప్రత్యేక రైలు, కరీంనగర్లో సిటీ బస్సులు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి ప్రభాకర్ అని కొనియాడారు. నేడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ఆర్టీసీని ముందుకు తీసుకెళు ళ్ళటకు కృషి చేయాలని ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడతాడని, బీసీల సంక్షేమ పథకాలు, ప్రతి పేద బీసీకి అందెందుకు ప్రభాకర్ కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వేలాదిమంది గీతా కార్మికులు, సంఘం సభ్యులు తరలివచ్చారు. ఆదర్శ ఎండీ బూరుగు సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పల్లె లక్ష్మణ్ గౌడ్, రాచకొండ తిరుపతి గౌడ్, రిటైర్డ్ డిసిపి సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, చక్రధర్ గౌడ్, పొన్నం సత్యం, సుధ గోని లక్ష్మీనారాయణ గౌడ్, పొన్నం శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాచర్ల అంజయ్య, మాచర్ల ప్రసాద్, కోట రవి, దేశిని కోటి, మాజీ జడ్పీటిసి గోపగోని సారయ్య గౌడ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్, జనంసాక్షి తెలుగు దినపత్రిక కరీంనగర్ జిల్లా బ్యూరో చీఫ్ బుర్ర పరశురామ్ గౌడ్, ఓల్లాల శ్రీనివాస్ గౌడ్, గడ్డపార వెంకన్న గౌడ్, కోడూరి మహేందర్ గౌడ్, పంజాల సురేందర్ గౌడ్, పొన్నం రవి చంద్ర గౌడ్, బిజేపి తాల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, అధికారులు, పోలీస్ సిబ్బంది, వివిధ జిల్లాల గౌడ నాయకులు, ప్రతినిధులు, గౌడ కుల పెద్దలు, గౌడ యువకులు, గౌడ కులస్తులు, గీతా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 12న బీజేపీ సోషల్ మీడియా వాలంటీర్స్ మీటింగ్



నిర్మల్ బ్యూరో, మార్చ్10 (జనంసాక్షి) : కేంద్ర హెూం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా సోషల్ మీడియా వాలంటీర్స్ సమావేశం ఈ నెల 12 న హైదరాబాద్ లో నిర్వహిస్తున్న సంధర్భంగా ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో సోషల్ మీడియా అదిలాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి మౌనిక సుంకెర, సాయికిరణ్ గౌడ్ హాజరయ్యారు. అబ్ కీ బార్ చార్సౌ బార్ నినాదంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాజీరావ్ పటేల్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెలిశాలి తిరుమల చారి, దళిత మోర్చ జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ మల్లారెడ్డి, నిర్మల్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ శేఖర్, ముదోల్ అసెంబ్లీ సోషల్ మీడియా రవి కుమార్, ఖానాపూర్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్, తో పాటు పలు మండలాల సోషల్ మీడియా కన్వీనర్స్, కో కన్వీనర్స్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105